8-7Pg1exHMNWJQE.qxd:8-7Pg1exHMNWJQE.qxd 01/01/01 8:17 AM Page 1

మాయిల్ గత వారం పుస్తకాల పై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

గుంటూరు

: fb.com/vaartha Digital

**టెక్సాస్‌లో జలప్రళయం: 82 మంది మృతి**

**పంజాబ్‌లో ఘోరప్రమాదం: ఎనిమిది మంది మృతి** 9లో

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

8-7-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 157 పేజీలు: 12 వెల: 6.50

# శాంతిభద్రతల్లో ఏపి ఆదర్శం

## టెక్నాలజీతో క్రైమ్‌రేట్ తగ్గించాలి

### పిడుగులుపడేచోట ముందుగా సైరన్ హెచ్చరికలు

### ప్రభుత్వ రికార్డుల భద్రతకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ

### రియల్‌టైమ్ గవర్నెన్స్ సమీక్షలో సిఎం చంద్రబాబు



సోమవారం టెక్నాలజీ, రియల్ టైమ్ గవర్నెన్స్‌పై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

**విజయవాడ, జూలై 7,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో నేరాల నియంత్రణకు సాంకేతిక సంస్కరణలు అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.టెక్నాలజీని వినియోగించుకుని జీరో క్రైమ్ రేట్ స్టేట్ గా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు.సాంకేతికత వినియోగించుకుని శాంతి భద్రతల పర్యవేక్షణలో ఆంధ్రప్రదేశ్ ను ఓ మోడల్ రాష్ట్రంగా మార్చాలని స్పష్టం చేశారు సోమవారం ఏపీ సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్సు పై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీసీ కెమెరాలతో క్రైమ్ హాట్ స్పాట్లపై నిరంతరం నిఘా పెట్టి నేరాల నియంత్రణ చేయాలన్నారు. దీంతో పాటు ప్రైవేటు సీసీ కెమెరాల ఫుటేజి వ్యవహారంలోనూ నిబంధనలు మార్చేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. నేరాల నియంత్రణకు ప్రైవేటు కెమెరాలను కూడా వినియోగించుకునేలా చూడాలని స్పష్టం చేశారు. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడే వారి విషయంలో టెక్నాలజీని మరింతగా ఉపయోగించుకోవాలన్నారు. కొందరు తెలివిగా నేరాలు చేసి దాన్ని ప్రభుత్వంపై నెడుతున్నారని పోలీసులకు సహకరించని వ్యక్తులు, నేతల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు సూచించారు. ఇలాంటి వారి కోసం పబ్లిక్ సేఫ్టీ యాక్టు కింద వారి వద్ద నుంచి డేటాను తీసుకునేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ఆయా నేరాలకు బాధ్యులుగా చేసే అంశంపైనా దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రజా భద్రత కోసం.. నేరాల కట్టడి కోసం, దర్యాప్తు నిమిత్తం, షాపింగ్ మాల్స్, థియేటర్లు, హోటళ్ల వద్ద ఉండే సీసీ కెమెరాల్లోని ఫుటేజీని సేకరించే వంటి వాటి విషయాల్లోనూ పబ్లిక్ సేఫ్టీ యాక్టును వర్తింప చేయాలన్నారు. మరోవైపు వివిధ రంగాల్లో డ్రోన్లు, సీసీ కెమెరాల వినియోగం పెంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ పురోగతిపైనా అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డ్రోన్ టెక్నాలజీని అన్ని విభాగాల్లో వినియోగించాలన్నారు, నేర నియంత్రణలో డ్రోన్ల వినియోగం మంచి >>2

# ప్రపంచశాంతిలో 'బ్రిక్స్' కీలకం

### ఉగ్రవాదులపై ఆంక్షలకు వెనుకంజ వేయలేం

### గ్లోబల్‌సౌత్‌లో ఉగ్రనిర్మూలన ఉమ్మడి లక్ష్యం

### 'బ్రిక్స్' ముగింపు కార్యక్రమంలో ప్రధాని మోడీ

### 2026లో భారత్‌లో శిఖరాగ్ర సదస్సు



బ్రిక్స్ దేశాధినేతలతో ప్రధాని మోడీ 2లో

# మన్యం జిల్లాలో భారీ వర్షాలు

### అప్రమత్తంగా ఉండాలన్న మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ, జూలై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** మన్యం జిల్లలో వర్షాలు కురుస్తున్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆ జిల్లా ఇంచార్జ్ మంత్రికింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు.ఆ మేరకు ఇక్కడి ఆయన కార్యాలయం ఒక ప్రకటన జారీ చేసింది.బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అధికారులు అనుక్షణం జాగ్రత్తగా ఉంటూ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆదేశించారు. వరద నిర్వహణ >>2



# నేడు తేరుచుకోనున్న శ్రీశైలం క్రస్ట్‌గేట్లు

**శ్రీశైలంప్రాజెక్టు,జులై 7,ప్రభాతవార్త:** శ్రీశైలం రిజర్వాయర్ రెడియల్ క్రస్ట్‌గేట్లు నేడు తెరుచుకోనున్నాయి.జలాశయంకు అత్యధిక క్యూసెక్యుల నీరు చేరడంతో గరిష్టస్థాయి చేరుకుంటున్నాయి.ఈ నేపథ్యంలోనే డ్యాం క్రస్ట్‌గేట్లను తేరచి దిగువ సాగర్‌కు నీటిని విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీశైలంకు రానున్నారు.ఈ క్రమంలోనే నీటినిల్వలు సోమవారం సాయంత్రం 6గంటల సమాయానికి 880.80 అడుగులుగా ఉండగా నీటినిల్వ సామర్థ్యం 192.5300 టియంసిలుగా నమొదు అయింది.ఈక్రమంలోనే ఎగువన ఉన్నా జలాశయాల నుండి వరద నీరు వచ్చి చేరుతుండడంతో >>2





# జనగణన అంతా డిజిటల్!

### ప్రత్యేక యాప్, ప్రత్యేక పోర్టల్ రూపకల్పన

**న్యూఢిల్లీ, జూలై 7:** కేంద్ర ప్రభుత్వం నిర్వహించతలపెట్టిన జన గణనలో ప్రజలే స్వయంగా వివరాలు పొందుపుచుకునే సౌలభ్యం కల్పిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకమైన వెబ్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువస్తోంది. దేశ ప్రజల ఇళ్ల వివరాల సేకరణకు సంబంధించిన హెచ్‌ఎల్‌ఓ గణనతో పాటు జనగణన సమాచారాన్ని సేకరించేందుకు ఇదే పోర్టల్‌ను వినియోగించనుంది. జనగణనలో భాగంగా తొలి విడతలో హెచ్‌ఎల్‌ఓ గణన జరుగుతుంది. హెచ్‌ఎల్‌ఓ అంటే హౌజ్ లిస్టింగ్ అండ్ హౌజింగ్ సెన్సస్. ఈ గణనలో దేశ >>2

# రూ.100కే వారసత్వ భూముల రిజిస్ట్రేషన్

### ఆస్తి విలువ రూ.10లక్షలు పైన ఉంటే వెయ్యి రూపాయలు స్టాంప్ డ్యూటీ

**విజయవాడ,జూలై7,ప్రభాతవార్తప్రతినిధి:** వారసత్వ భూముల సంక్రమణ భాగస్వామ్య (సక్సెషన్) రిజిస్ట్రేషన్‌లు ) రిజిస్ట్రేషన్‌లు గ్రామ/వార్డు సచివాలయాల్లో నామమాత్ర ఫీజుతో త్వరలో జరగనున్నాయి. ఈ దిశలో ఇటీవల రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. రెవెన్యూ సమీక్షా సమావేశంలోను తక్షణం ఈ విధానం అమలులోకి తీసుకుని రావాలని అధికారులను ఆదేశించారు.వారసత్వ భూముల సంక్రమణ భాగస్వామ్య (సక్సెషన్) రిజిస్ట్రేషన్‌లపై సీఎం చంద్రబాబు మేరకు అధికారులు కార్యచరణకు సన్నద్ధమవుతున్నారు.సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నిర్ధారించిన మార్కెట్ విలువ ప్రకారం సదరు ఆస్తి విలువ రూ.10లక్షల లోపు ఉంటే రూ.100, ఆపైన ఉంటే రూ.1,000 ఫీజును స్టాంపు డ్యూటీ కింద తీసుకోనున్నారు. ఆస్తి యజమానులు మరణించిన అనంతరం వారసులకు సంక్రమించే వాటికి మాత్రమే గ్రామ/వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేస్తారు. మిగిలిన వాటిని యథావిధిగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే చేస్తారు. తల్లిదండ్రులు మరణించిన అనంతరం వారసత్వంగా వచ్చే ఆస్తులను వారసులు తహసీల్దారుకు దరఖాస్తుచేసి, కాగితాలపై రాసుకుంటున్నారు. వీటికి మ్యుటేషన్‌లు సకాలంలో జరగడం లేదని, తహసీల్దారు కార్యాలయాల సిబ్బంది పదేపదే తిప్పుతున్నారన్న ఫిర్యాదులు ప్రభుత్వానికి అందుతున్నాయని సీఎం చంద్రబాబే రెవెన్యూశాఖ సమీక్షలో స్పష్టం చేసారు.గత ఏడాదిలో సుమారు 55 వేల ఫిర్యాదులు ఇలా ప్రభుత్వానికి అందాయి. తమ ఆస్తికి ఎందుకు రిజిస్ట్రేషన్ చేయించాలి అనే ఉద్దేశంతో కొందరు ఉంటున్నారు. దీనివల్ల చనిపోయిన వారి పేర్లు భూముల రికార్డుల్లో అలాగే ఉండిపోతున్నాయి. ఫలితంగా పలు సమస్యలు తలెత్తుతున్నాయి. గ్రామ/వార్డు సచివాల యాల ద్వారా మరణ ధ్రువీకరణ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు జారీ >>2

# యేడాదిలో రెండుసార్లు పేరెంట్లు, టీచర్ల భేటీ

### పి-4లో భాగమైన స్కూళ్ల అభివృద్ధికి సహకరించాలి: మంత్రి లోకేష్





సోమవారం విఆర్ పాఠశాల విద్యార్థులతో ముచ్చటిస్తున్న మంత్రి లోకేష్

**నెల్లూరు, జులై 7, ప్రభాతవార్త-విద్య :** రాష్ట్రంలో విద్యావ్యవస్థలో సమూల మార్పులు తసుకు వస్తున్నామని రాష్ట్ర విద్య,ఐటీశాఖమంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. సోమవారం నగరం లోని స్థానిక విఆర్‌సి సెంటర్‌లో ఆధునీకరించిన విఆర్‌పాఠశాల ప్రారంభోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలగావించి పాఠశాలను ప్రారంభించారు. తొలుత లోకేష్ ఆయన సహచర మంత్రులైన నారాయణ, ఫరూక్, ఎంపీ వేమిరెడ్డి, జిల్లాలోని ఎమ్మెల్మేలతో కలిసి పాఠశాల భవనాలను, అక్కడ అందిస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. హైడ్రోఫోనిక్స్ ల్యాబ్, కంప్యూటర్‌ల్యాబ్, ప్లేగ్రౌండ్స్, తదితరాలను సందిర్శంచి సిబ్బందితో మాట్లాడారు. ఆట స్థలంలో క్రికెట్, వాలీబాల్ ఆడి సరదాగా గడిపారు. అనంతరం ఆయన విద్యార్థుల తల్లింద్రులను ఉద్దేశించి మాట్లాడారు. 150ఏళ్ల చరిత్ర గలిగిన విఆర్‌సి పాఠశాల గత పాలకుల నిర్లక్ష్యంతో మూతపడిందన్నారు. పట్టుదలకు మారు పేరుగా ఉన్న మంత్రి నారాయణకృషితో నేడు విఆర్‌సి ఎంతో అద్భుతంగా రూపు దిద్దుకోవటం జరిగిందన్నారు. ప్రైవేట్, >>2

# రాష్ట్రంలో సమగ్రాభివృద్ధి

### పూర్తిస్థాయి కార్యాచరణ రూపొందించిన సిఎం చంద్రబాబు: మంత్రి అనగాని



సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

**తిరుపతి కలెక్టరేట్, జూలై7 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ 2047 సంవత్సరం నాటికి అభివృద్ధిలో నెం.1 కానుందని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంప్స్ శాఖా మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. సోమవారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మంత్రి అధ్యక్షతన స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా డిస్ట్రిక్ విజన్‌యాక్షన్ ప్లాన్ యూనిట్, పీ4పై జిల్లాలోని శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, ఎస్వీయూ పద్మావతి యూనివర్శిటీల వైస్ చాన్సనర్లు, జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమాన్ని సీఎం నారా చంద్రబాబు నాయుడు గత ఏడాది డిసెంబరు 13న ఆవిష్కరించారన్నారు. దేశ ప్రధాని మోదీ దేశాన్ని అగ్ర స్థానంలో నిలిపేందుకు వికసిత్ భారత్‌కు రూపకల్పన చేశారన్నారు. అందులో భాగంగానే 2047 నాటికి రాష్ట్రాన్ని నెంబర్ 1గా ఉండేలా సీఎం నారా చంద్రబాబు నాయుడు విజన్ డాక్యుమెంట్‌కు రూపకల్పన చేశారన్నారు. సీఎం చంద్రబాబు 2020 విజన్ రూపొందించినపుడు కూడా చాలా మంది హేళన చేశారని కానీ తదనంతరం దాని ఫలితాలు ఎలా ఉన్నాయో ప్రత్యక్షంగా అందరం చూశామన్నారు. అలాగే నేడు 2029 సంవత్సరం నాటికి రాష్ట్రాన్ని ఏప రంగాల్లో అభివృద్ధి పథంలో నిలపాలో చర్యలు తీసుకునేలా కార్యాచరణను రూపొందించడం జరుగుతుందన్నారు. జిల్లా, నియోజక వర్గ అభివృద్ధి చేపట్టేందుకు విజన్ ప్లాన్‌ను ఎలా తయారు చేస్తున్నామో జిల్లా కలెక్టర్ వివరించడం జరిగిందన్నారు. తిరుపతి జిల్లాను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో తీసుకెళ్ళేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలన్నారు. శాసన సభ్యులు సైతం తమ నియోజక వర్గాల్లో ఏవిధంగా అభివృద్ధి చేయాలో ప్రణాళికలు రూపొందించేందుకు అధికారుల సహాయం తీసుకుని ముందుకు వెళ్ళాలన్నారు. తిరుపతి జిల్లాలో 46 శాతం పరిశ్రమల నుంచి 30 శాతం సర్వీస్ రంగం నుంచి 18 శాతం వ్యవసాయ రంగం ద్వారా ఆదాయం వస్తోందన్నారు. తిరుపతి జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలబెట్టాలన్నారు. పీ4 విధానం ద్వారా పేదలకు సాయం చేస్తూ ఆర్థిక అసమానతలు తగ్గించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పేదరికం లేని సమాజాన్ని స్థాపించడమే లక్ష్యంగా పనిచేయాలని, పీ4 విధానం ద్వారా రాష్ట్రంలో 2029 నాటికి పేదరికాన్ని రూపు మాపాలని పలు వేదికల ద్వారా సీఎం అవగాహన కల్పిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. >>2

# వ్యవసాయం అభివృద్ధికి సహకరించండి

### కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కోరిన మంత్రి అచ్చెన్నాయుడు

### రాష్ట్రంలో 3.5లక్షల మెటన్నుల మామిడిపంట కొనుగోలు చేశాం

### బంగారుపాళ్యం మార్కెట్‌కు జగన్ వెళ్లడానికి అనుమతిస్తాం: మంత్రి



**విజయవాడ,జూలై7,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో వ్యవసాయరంగం అభివృద్ధికి సహకరించాలని రాష్ట్ర వ్యవసాయమంత్రి కింజరపు అచ్చెన్నాయుడు కేంద్రానికి విజ్ఞప్తి చేసారు. రెండు రోజుల పాటు ఢీల్లీ పర్యటనకు వెళ్లిన మంత్రి అచ్చెన్నాయుడు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్‌తో సోమవారం ప్రత్యేక భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వ్యసాయ రంగానికి తోడ్పాటు నివ్వాలని, గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలు కారణంగా రాష్ట్రంలో రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని కేంద్ర మంత్రికి వివరించారు. పెద్ద మనసుతో రాష్ట్రాన్ని ఆదుకోవాలని, సహయ, సహకారాలు అందించాలని విన్న వించారు. మ్యాంగో పల్ప్ పై విధిస్తున్న జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించేలా కేంద్రప్రభుత్వాన్ని కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఏపీలో దాదాపుగా 64 శాతం మంది వ్యవసాయం, వ్యవసాయం అనుబంధ రంగాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అందుకు ప్రభుత్వాలు ఈ రంగానికి ప్రాధాన్యం ఇస్తున్నాయి. కానీ గత వైకాపా ప్రభుత్వం మాత్రం ఈ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా గాలికి వదిలేసింది. రాష్ట్రాన్ని ఐదేళ్ల పాటు జగన్ రెడ్డి చిన్నా భిన్నం చేశారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్యక్రమాలను కూడా వినియోగించుకోకపోవడం వల్ల రాష్ట్రంలో వ్యవసాయ రంగం కుదేలైందని ధ్వజమెత్తారు. తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ పరిధిలోని గరివిడిలో ఉన్న కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్‌లో 2022-23, 2023-24విద్యా సంవత్సరాలకుగానూ మూడవ, నాల్గవ సంవత్సరాల బీవీఎస్‌సీ, ఏహెచ్ కోర్సులు పునరుద్ధరణ కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపామన్నారు. కేంద్రం అందుకు అనుమతి ఇచ్చిందని తెలిపారు. 2022 సంవత్సరం నుండి ఈ కోర్సులకు అనుమతి లేదు. వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి సంబంధిత కోర్సులకు అనుమతులను పునరుద్ధరిస్తూ లేఖను విడుదల చేశారు. మంగళవారం కేంద్ర పశుసంవర్ధక పాడిపరిశ్రమ మంత్రిత్వ శాఖ మంత్రి లాలన్ సింగ్ ను కలిసి మరిన్ని విషయాలు చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంటామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

చిత్తూరు మామిడి రైతుల దగ్గర 3.5 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాం, మామిడి ధరపై జగన్ నీచమైన రాజకీయం చేస్తున్నారు. తోతాపురి మామిడి సేకరణను కిలోకు రూ. 12/ ధరను ప్రభుత్వం నిర్ణయించిందని,అందులో రూ. 8/ ప్రాసెసర్లు/వ్యాపారులు భరించాలని, అదనపు మద్దతు ధరగా రాష్ట్ర ప్రభుత్వం రూ.4/ చెల్లిస్తుందని, దీనికి సంబంధించి మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద రూ.130 కోట్ల కేంద్ర వాటాను విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపా దనలను సమర్పించడం జరిగిం >>2

# అమరావతి క్వాంటం వ్యాలీ డిక్లరేషన్ ఉత్తర్వులు జారీ

**విజయవాడ,జూలై7,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి క్వాంటం వ్యాలీ డిక్లరేషన్ ఉత్తర్వులను ఏపీ ప్రభుత్వం విడుదల చేసింది. జీవో ఆర్టీ నెంబర్ 23ను ఐటీ ఎలక్ట్రనిక్స్ అండ్ కమ్యూనికేషన్ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటమనేని సోమవారం ఈ కీలక ఉత్తర్వులను జారీ చేసారు. జూన్ 30న విజయవాడలో అమరావతి క్వాంటం వ్యాలీ వర్క్‌షాప్‌ను నిర్వహిం చినట్టు ఉత్తర్వుల్లో వెల్లడించారు. ఈ వర్క్‌షాప్ ద్వారా >>2



సోమవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, మంత్రి అచ్చెన్నాయుడు

# వ్యవసాయం అభివృద్ధికి సహకరించండి

>> చేన్నారు. రాష్ట్రాన్ని ఐదేళ్ల జగన్ విన్నాశనం చేశారు. ఓడార్పు అని మళ్లీ బల ప్రదర్శనకు దిగుతున్నారు. చంద్రబాబు ఏడాదిలో 9లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చారు. రాష్ట్రాన్ని గాడిలో పెడు తుంటే మళ్లీదండయాత్ర మొదలెట్టారు. శాంతిభద్రతల సమస్య సృష్టించేందుకు జగన్ ప్రయత్నిస్తున్నాడన్నారు. 2019- 2024 మధ్యకాలంలో తోతాపురి మామిడి ధర కిలో రూ. 6 రూపాయలు నుంచి రూ. 4 రూపాయిలకు పడిపోయిందన్నారు. వైకాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం రైతులకు ఒక్కరూపాయి కూడా సబ్సిడీ ఇవ్వలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం మామిడి రైతులకు అదనంగా కేజీకి రూ.4సబ్సిడీ మద్దతు ధరను ఇచ్చి రైతులను ఆదుకుంటుందని తెలిపారు. చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లా రైతుల నుంచి 3.5 మెట్రిక్ టన్నుల మామిడి సేకరించామని, మామిడి ధరపై జగన్ రెడ్డి నీచమైన రాజకీయం చేస్తున్నారని, మూడు వేల కోట్ల ధరల స్థిరీకరణ నిధి అని చెప్పి ఐదేళ్లలో రైతులకు ఒక్కరూపాయి కూడా చెల్లించలేని అసమర్థ నాయకుడు జగన్ రెడ్డి అని తీవ్ర స్థాయిలో మండి పడ్డారు. మామిడి రైతులకు ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుం టుందని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రైతులను అన్ని విధాల ఆదుకుంటున్నామని ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేసేందుకే జగన్ రెడ్డి మామిడి రైతులపై దండయాత్రలు చేసేం దుకు వెళుతున్నారని ఆరోపించారు. గంజాయి, డ్రగ్స్, రౌడీ షీట్స్‌లో ఉన్న వారు జగన్ యాత్రల్లో పాల్గొంటున్నారని విమర్శించారు. చిత్తూరు జిల్లా రైతులు జగన్ ను ప్రశ్నించాలి.. లేదంటే ప్రజా స్వామ్యానికి తీవ్ర నష్టం జరుగుతుందని అని అన్నారు. విభిన్న మైన రాష్ట్రం వికాసం వైపు పయ నిస్తుందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజ రాపు రామ్మోహన్ నాయుడు, శ్రీకాకుళం శాసన సభ్యులు గొండు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# జనగణన అంతా డిజిటల్!

>> ప్రజల ఇళ్ల స్థితిగతులు ఎలా ఉన్నాయి ఇళ్లలో ఉన్న సౌకర్యాలు ఏమిటి దేశ ప్రజల ఆస్తిపాస్తుల సమాచారం ఏమిటి అనే సమాచారాన్ని సేకరిస్తారు. తదుపరి దశలో జనగణన జరుగుతుంది. భారతదేశంలో జరగబోతున్న తొలిసారిగా డిజిటల్ సెన్సెస్ కూడా ఇదే. ఎందుకంటే ఈ గణనను నిర్వహించే ఎన్యుమరేటర్లు తమతమ ఆండ్రాయిడ్ ఫోన్లలోని యాప్‌లు, యాపిల్ ఫోన్‌లలోని యాప్‌లలో దేశ ప్రజల సమాచారాన్ని సేకరించి నిక్షిప్తం చేయనున్నారు. వారు నమోదు చేసే సమాచారం ఎప్పటికప్పుడు ఎలక్ట్రానిక్ విధానంలో సెంట్రల్ సర్వర్‌కు చేరిపోయి, అందులో స్టోర్ అవుతుంది. దీనివల్ల జనగణన పూర్తికాగానే సమాచారాన్ని విడుదల చేసేందుకు ఆస్కారం కలుగుతుందని కేంద్ర అధికార వర్గాలు సోమవారం వెల్లడించాయి. ఎన్యుమరేటర్లు జనగణన సమాచారాన్ని సేకరించడం దగ్గరి నుంచి దాన్ని సెంట్రల్ సర్వర్‌కు పంపడం, అందులో స్టోర్ కావడం దాకా ప్రతీచోటా పకడ్బందీ సమాచార భద్రతా చర్యలను అమలు చేస్తామని తెలిపాయి. దేశవ్యాప్తంగా రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నియమించే దాదాపు 34 లక్షల మంది ఎన్యుమరేటర్లకు ఎక్కడికక్కడ జనగణన నిర్వహించడంపై ట్రైనింగ్ ఇవ్వనున్నారు. ఈ శిక్షణ ఇచ్చేందుకు జాతీయ స్థాయిలో నేషనల్ ట్రైనర్లు, తదుపరిగా మాస్టర్ ట్రైనర్లు, చివరగా ఫీల్డ్ ట్రైనర్లు ఉంటారు. జనగణనకు అనుగుణంగా రాష్ట్రాల పాలనా యూనిట్ల సరిహద్దుల్లో ఈ ఏడాది డిసెంబరు 31లోగా మార్పులను పూర్తి చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ లేఖ రాశారు. రాష్ట్రాలు, యూటీలలో పాలనా యూనిట్ల ఫ్రీజింగ్ జరిగిన 3 నెలల తర్వాతే జనగణన నిర్వహించాలని రూల్స్ చెబుతున్నాయి. పాలనా యూనిట్లు అంటే జిల్లాలు, ఉప జిల్లాలు, తహసీల్‌లు, తాలూకాలు, పోలీసు స్టేషన్ల పరిధులు. హౌజ్ లిస్టింగ్ అండ్ హౌజింగ్ సెన్సస్ 2026 ఏప్రిల్ 1న ప్రారంభమవుతుంది. 2027 ఫిబ్రవరి 1 నుంచి జరగనున్న రెండోవిడత గణనలో జనాభా వివరాలను సేకరిస్తారు. ప్రతీ కుటుంబానికి చెందిన సభ్యుల కులాల సమాచారాన్ని నమోదు చేస్తారు. కేంద్ర హోంశాఖ గతనెల 16న విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో దేశంలో జనగణన నిర్వహణకు రెఫరెన్స్ తేదీగా 2027 మార్చి 1ని ప్రస్తావించారు. హిమాలయ ప్రాంతాలైన లద్దాఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో ఉండే ప్రతికూల వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వాటికి 2026 అక్టోబర్ 1ని రెఫరెన్స్ తేదీగా ప్రకటించారు. సగటున ఈ రెఫరెన్స్ తేదీల్లోనే జనగణన ప్రక్రియ ప్రారంభమవుతుంది. మనదేశంలో జరగబోతున్న 16వ జనగణన ఇది. స్వాతంత్ర్యం సిద్ధించాక జరుగుతున్న 8వ జనగణన అని కేంద్ర అర్థగణాంకశాఖప్రకటించింది. స్థితిగతులు ఎలా ఉన్నాయి ఇళ్లలో ఉన్న సౌకర్యాలు ఏమిటి దేశ ప్రజల ఆస్తిపాస్తుల సమాచారం ఏమిటి అనే సమాచారాన్ని సేకరిస్తారు. తదుపరి దశలో జనగణన జరుగుతుంది. భారతదేశంలో జరగబోతున్న తొలిసారిగా డిజిటల్ సెన్సెస్ కూడా ఇదే. ఎందుకంటే ఈ గణనను నిర్వహించే ఎన్యుమరేటర్లు తమతమ ఆండ్రాయిడ్ ఫోన్లలోని యాప్‌లు, యాపిల్ ఫోన్‌లలోని యాప్‌లలో దేశ ప్రజల సమాచారాన్ని సేకరించి నిక్షిప్తం చేయనున్నారు. వారు నమోదు చేసే సమాచారం ఎప్పటికప్పుడు ఎలక్ట్రానిక్ విధానంలో సెంట్రల్ సర్వర్‌కు చేరిపోయి, అందులో స్టోర్ అవుతుంది. దీనివల్ల జనగణన పూర్తికాగానే సమాచారాన్ని విడుదల చేసేందుకు ఆస్కారం కలుగుతుందని కేంద్ర అధికార వర్గాలు సోమవారం వెల్లడించాయి. ఎన్యుమరేటర్లు జనగణన సమాచారాన్ని సేకరించడం దగ్గరి నుంచి దాన్ని సెంట్రల్ సర్వర్‌కు పంపడం, అందులో స్టోర్ కావడం దాకా ప్రతీచోటా పకడ్బందీ సమాచార భద్రతా చర్యలను అమలు చేస్తామని తెలిపాయి. దేశవ్యాప్తంగా రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నియమించే దాదాపు 34 లక్షల మంది ఎన్యుమరేటర్లకు ఎక్కడికక్కడ జనగణన నిర్వహించడంపై ట్రైనింగ్ ఇవ్వనున్నారు. ఈ శిక్షణ ఇచ్చేందుకు జాతీయ స్థాయిలో నేషనల్ ట్రైనర్లు, తదుపరిగా మాస్టర్ ట్రైనర్లు, చివరగా ఫీల్డ్ ట్రైనర్లు ఉంటారు. జనగణనకు అనుగుణంగా రాష్ట్రాల పాలనా యూనిట్ల సరిహద్దుల్లో ఈ ఏడాది డిసెంబరు 31లోగా మార్పులను పూర్తి చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ లేఖ రాశారు. రాష్ట్రాలు, యూటీలలో పాలనా యూనిట్ల ఫ్రీజింగ్ జరిగిన 3 నెలల తర్వాతే జనగణన నిర్వహించాలని రూల్స్ చెబుతున్నాయి. పాలనా యూనిట్లు అంటే జిల్లాలు, ఉప జిల్లాలు, తహసీల్‌లు, తాలూకాలు, పోలీసు స్టేషన్ల పరిధులు. హౌజ్ లిస్టింగ్ అండ్ హౌజింగ్ సెన్సస్ 2026 ఏప్రిల్ 1న ప్రారంభమవుతుంది. 2027 ఫిబ్రవరి 1 నుంచి జరగనున్న రెండోవిడత గణనలో జనాభా వివరాలను సేకరిస్తారు. ప్రతీ కుటుంబానికి చెందిన సభ్యుల కులాల సమాచారాన్ని నమోదు చేస్తారు. కేంద్ర హోంశాఖ గతనెల 16న విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో దేశంలో జనగణన నిర్వహణకు రెఫరెన్స్ తేదీగా 2027 మార్చి 1ని ప్రస్తావించారు. హిమాలయ ప్రాంతాలైన లద్దాఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో ఉండే ప్రతికూల వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వాటికి 2026 అక్టోబర్ 1ని రెఫరెన్స్ తేదీగా ప్రకటించారు. సగటున ఈ రెఫరెన్స్ తేదీల్లోనే జనగణన ప్రక్రియ ప్రారంభమవుతుంది. మనదేశంలో జరగబోతున్న 16వ జనగణన ఇది. స్వాతంత్ర్యం సిద్ధించాక జరుగుతున్న 8వ జనగణన అని కేంద్ర అర్థగణాంకశాఖప్రకటించింది.

## లిక్కర్ స్కామ్‌లో చాణక్య బెయిల్ పిటిషన్ కొట్టేసిన ఏసీబీ కోర్టు

**విజయవాడ,జూలై7,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో మద్యం కుంభకోణం కేసులో నిందితుడుగా ఉన్న చాణక్య బెయిల్ పిటిషన్‌ను విజయవాడ ఎసిబి కోర్టు సోమవారం కొట్టివేసింది. మద్యం కేసులో కీలక పాత్రధారిగా ఉన్న రాజ్ కెసిరెడ్డి ఆదేశాల మేరకు చాణక్య పని చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా మద్యం కేసులో చాణక్య ఏ8 గా ఉన్నాడు. ప్రస్తుతం చాణక్య విజయవాడ జిల్లా జైలులో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నాడు. చాణక్య గతంలో ఈ కేసులో ముందస్తు బెయిల్‌కు ప్రయత్నించి ఎదురుదెబ్బ తిన్నారు. ఈ కేసులో కీలక సూత్రదారిగా ఉన్న రాజ్ కసిరెడ్డి అత్యంత సన్నిహితునిగా ఉంటూ లిక్కరాయణం నడిపారన్నది సిట్ ఆరోపణ. చాణక్య బెయిల్‌పై బయటకు వస్తే కేసులో కీలక సాక్షులపైన ప్రభావం చూపే అవకాశం ఉందని సిట్ తరపున న్యాయవాదులు కోర్టులో వాదించారు. నిందితుడు విచారణలో సిట్‌కు సహకరించలేదని న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకుని వెళ్ళారు. ఈ క్రమంలో చాణక్య బెయిలన పిటిషన్ కోర్టు కొట్టివేసింది. ఈ కేసులో చాణక్య. రాజ్ కసిరెడ్డితో పాటు మరో తొమ్మిది మంది నిందితులుగా ఉన్నారు.

## పోలవరం స్పిల్‌వే నుంచి 2,23,309 క్యూసెక్కుల నీరు విడుదల

**విజయవాడ,జూలై 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాలకు గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. దీంతో పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేలోకి చేరుకున్న 2,23,309 క్యూసెక్కుల అదనపు నీటిని అధికారులు దిగువకు విడుదలచేశారు. ఇరిగేషన్ అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 28.220 మీటర్లు, దిగువన 18.740 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యామ్‌కి ఎగువన 28.370 మీటర్లు, దిగువ కాపర్ డ్యామ్‌కి దిగువన 17.770 మీటర్లు, ఎగువ, దిగువ కాపర్ డ్యామ్‌కి మధ్య 15.680 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు దిగువన 6.66 మీటర్లు నమోదైందని, ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం తగ్గుతూ వస్తోందని సిడబ్ల్యూసి అధికారులు తెలిపారు.

# శాంతిభద్రతల్లో ఏపి ఆదర్శం

>> ఫలితాలు వస్తునని అధికారులు నివేదికలు స్పష్టం చేస్తున్నాయన్నారు. టెక్నాలజీవివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన రికార్డులు, డేటా భద్రతకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీని వినియోగించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రస్తుత రెవెన్యూ రికార్డులను కూడా పూర్తి స్థాయి బ్లాక్ చైన్ సాంకేతికతనే వినియోగించి భద్రంగా ఉండేలా చూడాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమాచారం డేటా లేక్ ద్వారా సమన్వయం చేయాలని సీఎం స్పష్టం చేశారు. మరోవైపు 517 పౌరసేవల్ని వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అందిస్తున్నట్టు అధికారులు వివరించారు. అయితే అందిస్తున్న సేవలన్నీ యూజర్ ఫ్రెండ్లీగా ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పిడుగులు పడే ప్రాంతాల్లో విలువైన ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా పనిచేయాలని, ముందస్తు హెచ్చరికల వ్యవస్థ సమర్థంగా పనిచేసేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. ముందుగానే ఆయా ప్రాంతాల్లో సైరన్ మోగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. భూగర్భ జలాల పర్యవేక్షణకు పీజోమీటర్లు, సెన్సార్లు త్వరితగతిన పునరుద్ధరించాలని ఆన్నారు. రిజర్వాయర్లలో ప్రస్తుతం ఉన్న నీరెంత, ఎంతమేర ప్రవాహాలు వస్తున్నాయి. సముద్రంలోకి విడుదల చేస్తున్న నీరెంత లాంటి వివరాలు నమోదు చేయాలన్నారు. రిజర్వాయర్లలో వచ్చే ప్రవాహాలకు సంబంధించిన వివరాలను రియల్ టైమ్ లో పర్యవేక్షిస్తే వరద నిర్వహణ చేయొచ్చన్నారు. ప్రస్తుతం వస్తున్న ప్రవాహాలతో రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లనూ పూర్తి సామర్థ్యంతో నింపుతున్నట్టు సీఎం స్పష్టం చేశారు. మరోవైపు సముద్ర తీరప్రాంతాల్లో అలల ఉధృతి, వేటల వేటకు అవకాశం ఉన్న ప్రాంతాలపై ఇన్ కాయిస్ సంస్థ ఇచ్చే వివరాలను మత్స్యకారులకు, తీరప్రాంతాల్లోని వారికి అందేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు.

**ప్రజల అవసరాలకు అనుగుణంగా పథకాల రూపకల్పన:** ప్రతీ ప్రభుత్వ శాఖ తమ దగ్గర ఉన్న లబ్ధిదారుల డేటా సహా ఇతర వివరాలను ఆర్టీజీఎస్ తో సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. క్షేత్రస్థాయిలో వ్యత్యాసం ఉంటే తక్షణం ఆర్టీజీఎస్ కు తెలిపి డేటాను సవరించుకోవాలని స్పష్టం చేశారు. 2029 నాటికి పేదరిక రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అందుకు తగినట్టుగా సంక్షేమ పథకాల రూపకల్పన జరగాలని ముఖ్యమంత్రి అన్నారు. పేదరిక నిర్మూలన కోసం చివరి వ్యక్తి వరకూ చేయూత అందించడమే కూటమి ప్రభుత్వ ఆలోచన అని అన్నారు. పీ4లో భాగంగా బంగారు కుటుంబం మార్గదర్శి అనుసంధాన ప్రక్రియ నిరంతరం కొనసాగాలని సీఎం స్పష్టం చేశారు. ప్రతి అంశంలో మనం లక్ష్యాలను నిర్దేశించుకున్నాం, ఆ దిశలో మన కార్యచరణ వేగవంతంగా ఉండాలని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. మనం వారం, వారం ఆర్టీజీఎస్‌పై వరుసగా విభాగాల వారీగా సమీక్షించుకుంటున్నాం, అయితే ఇతర విభాగాల్లో పనితీరు మెరుగుదలపై మనకు అవగాహన ఉండాలన్నారు. ముఖ్యమంత్రి నిర్వహించిన ఈ సమీక్షకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ ,సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ప్రపంచశాంతిలో 'బ్రిక్స్' కీలకం

**రియోడీజెనీరో(బ్రెజిల్),జూలై 7:** ఉగ్రవాదులపై ఆంక్షలు విధించడంలో వెనుకాడకూడదని ఉగ్రవాద బాధితులు, మద్దతుదారులను ఒకే త్రాసులో తూకం వేయలేమని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి బ్రిక్స్ దేశాలు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన పహల్గామ్ ఉగ్రదాడిని భారత ఆత్మ, గుర్తింపు, గౌరవంపై జరిగిన ప్రత్యక్ష దాడిగా ప్రధాని మోడీ అభివర్ణించారు. ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడి కేవలం భారత్‌కు మాత్రమే కాదు, మానవాళికి ఎదురుదెబ్బ అని ప్రధాని స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఖండించడం మన బాధ్యత అంటూ పేర్కొన్నారు. శాంతియుతమైన, సురక్షితమైన వాతావరణంలో మాత్రమే మానవాళి అభివృద్ధి సాధ్యమని ఈ లక్ష్యాన్ని నెరవేర్చడంలో బ్రిక్స్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. బ్రిక్స్ దేశాలు ఉమ్మడి సవాళ్లను ఎదుర్కోవడానికి ఐక్యంగా ఉండాలన్నారు. భారత్ అన్ని స్నేహపూర్వక దేశాలతో సహకారం, భాగస్వామ్యానికి కట్టుబడి ఉందని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. బ్రిక్స్ కూటమి గ్లోబల్ సౌత్ అంచనాలను అందుకోవాలని అభిప్రాయపడ్డారు. భారత్ వ్యవసాయం, ఆరోగ్యం, పాలన విద్య వంటి రంగాలలో ఏఐని విస్తృతంగా ఉపయోగిస్తోందని ప్రధాని వెల్లడించారు. బ్రెజిల్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సులో ప్రధాని నరేంద్ర మోడీ పాకిస్థాన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఖండించడంలో భారత్‌కు మద్దతు ఇచ్చిన దేశాలకు కృతజ్ఞతలు తెలిపారు. బ్రిక్స్ సదస్సులో ప్రపంచ నాయకులను ఉద్దేశించి ప్రధాని మోడీ మాట్లాడుతూ భారత్ ఉగ్రవాద బాధిత దేశమని.. పాకిస్థాన్ దానికి మద్దతుదారు అని.. కాబట్టి బాధితులు, మద్దతుదారులను ఒక స్థాయిలో తూచలేమని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. వ్యక్తిగత లేదా రాజకీయ లాభాల కోసం ఉగ్రవాదం వ్యాప్తికి వ్యతిరేకంగా మాట్లాడని లేదా చర్యలు తీసుకోని వారిని కూడా ఆయన పరోక్షంగా ప్రస్తావించారు. ఉగ్రవాదులకు మోన సమ్మతి ఇవ్వడం ఆమోదయోగ్యం కాదని ఎత్తి చూపారు. బ్రిక్స్ కూటమి దేశాలు రియో డి జనీరో డిక్లరేషన్ పేరుతో సంయుక్త ప్రకటనను చేశాయి. ఈ ప్రకటన 2025 ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిచింది. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా, దాని ప్రేరణ ఏదైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎవరు పాల్పడినా అది నేరమేనని, అన్యాయమేనని తీవ్రంగా ఖండించింది. సరిహద్దులు దాటి వచ్చే ఉగ్రవాదులను, ఉగ్రవాదానికి నిధులు సమకూర్చడాన్ని, వారికి సురక్షిత స్థావరాలు కల్పించడాన్ని కలిసికట్టుగా ఎదుర్కొంటామని బ్రిక్స్ దేశాలు సంయుక్తంగా ప్రకటించాయి. బ్రిక్స్ 2026 సదస్సుకు ఆతిథ్యం ఇవ్వనున్న భారత్ భారతదేశం 2026లో బ్రిక్స్ సదస్సును నిర్వహించనుంది. అంతేకాకుండా వచ్చే ఏడాది బ్రిక్స్‌కు భారత్ ఛైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్నది. ఇది అంతర్జాతీయ స్థాయిలో ఉగ్రవాదంపై తన నిబద్ధతను, సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి ఒక అవకాశంగా నిలుస్తుంది.

# రాష్ట్రంలో సమగ్రాభివృద్ధి

>> జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ డిస్ట్రిక్ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌లతో జిల్లా రూపు రేఖలు మారుస్తామన్నారు. ఏపీ రాష్ట్రంలో తిరుపతి జిల్లా జీడీపీలో మూడవ స్థానంలో ఉన్నదని, వ్యక్తిగత తలసరి ఆదాయంలో నాలుగవ స్థానంలో ఉన్నదన్నారు. మండల స్థాయిలో 31 శాఖలలో 258 ఇండికేటర్స్ అభివృద్ధిలో భాగంగా జిల్లా అధికారులను రాష్ట్ర స్థాయిలో అనుసంధానం చేయడం జరిగిందన్నారు. జిల్లాలో పీ4 సర్వేలో 80331 బాటమ్ 20 శాతం కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించడం జరిగిందన్నారు. శ్రీ కాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ పీ4 చాలా చక్కనైనా కార్యక్రమం అని, సంపాదించడమే కాదు, సమాజానికి తమ వంతు సహాయ చేయడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ స్థాయికి తీసుకుని వెళ్ళాలని పిలుపునిచ్చారు. గూడూరు ఎమ్మెలేవ్య పి. సునీల్ కుమార్, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, రాష్ట్ర గ్రీన్, బ్యూటిఫికేషన్ ఛైర్మన్ సుగుణమ్మ, చంద్రగిరి ఎమ్మెల్యే వెంకట ముని ప్రసాద్ పులివర్తి నాని, శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఉమ , రాష్ట్ర హస్త కళ కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ హరిప్రసాద్, తుడా ఛైర్మన్ డాలర్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఓ విజన్ ఉన్న నాయకుడని కొనియాడారు. కూటమి హయాంలో రాష్ట్రాభివృద్ధి శరవేగంతో పరుగులు తీస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి మున్సిపల్ కమిషనర్ ఎన్. మౌర్య, శిక్షణ కలెక్టర్ సందీప్ రఘువాని, సూళ్ళూరుపేట, వెంకటగిరి ఎమ్మెల్యేలు ఎన్. విజయశ్రీ, రామకృష్ణ, ఎస్వీయూ, పద్మావతి మహిళా యూనివర్శిటీల రిజిస్ట్రార్లు ప్రొఫెసర్ వి.ఎం. భూపతినాయుడు, ప్రొఫెసర్ ఎన్. రజిని, జెడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డీఆర్వో నరసింహులు, జిల్లా అధికారులు, ఇతర ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. త

## అమరావతి క్వాంటం వ్యాలీ డిక్లరేషన్ ఉత్తర్వులు జారీ

>> ప్రభుత్వ, పరిశ్రమ, విద్యా సంస్థలు, స్టార్టప్‌లు కలిసి కొత్త టెక్నాలజీని సమన్వయంతో పనిచేసే దిశగా చర్చలు జరిగాయన్నారు. అమరావతిని గ్లోబల్ క్వాంటం టెక్నాలజీ హబ్‌గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో అమరావతి క్వాంటం వ్యాలీ డిక్లరేషన్‌ను జూన్ 30న ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ డిక్లరేషన్‌పై నేడు అధికారిక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఉత్తర్వుల ద్వారా క్వాంటం పరిశోధన, ఆవిష్కరణ, ప్రతిభ అభివృద్ధి, మోలిక సదుపాయాలు అంతర్జాతీయ భాగస్వామ్యాలకు ప్రాధాన్యం ఇవ్వనునట్టు వెల్లడించారు. దేశంలోనే అతి పెద్ద క్వాంటం బెడ్‌గా క్వా చిప్ ఇన్‌ను వచ్చే 12 నెలల్లో అమరావతిలో ఏర్పాటు చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2035 నాటికి ప్రపంచ క్వాంటం కేంద్రంగా అమరావతి అభివృద్ధే లక్ష్యమని ఉత్తర్వుల్లో తెలిపారు. 2026లో ప్రారంభం అయ్యే అమరావతిక్వాంటం అకాడమీ ద్వారాశిక్షణ, ఫెలోషిప్‌లు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# ఆర్టీసీని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు

## ఆర్టీసీ ఛైర్మన్ కొనగళ్ల ..వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

**కుప్పం, జూలై 7 ప్రభాతవార్త:** ప్రజారవాణా సంస్థ ఆర్టీసీని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆర్టీసీ ఛైర్మన్ కొనగళ్ల నారాయణ, వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. సోమవారం విజయవాడ ఆర్టీసీ భవన్‌లో వారు ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారక తిరుమల రావు, జోనల్ ఛైర్మన్‌లతో సమావేశం నిర్వహించారు.

ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ సేవల విస్తరణ, ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాల కల్పన తదితర అంశాలపై చర్చించారు. సామాన్య ప్రయాణీకులను సౌకర్యాలు మెరుగుపరచడంతో పాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై సైతం సమావేశంలో చర్చించారు. కార్యక్రమంలో జోనల్ ఛైర్మన్లు రెడ్డి అప్పలనాయుడు, సురేష్‌రెడ్డి, దొన్నుదొర, నాగరాజు పాల్గొన్నారు.



సోమవారం వీఆర్ పాఠశాలలో వాలీబాల్ ఆడుతున్న మంత్రి లోకేష్

# యేడాదిలో రెండుసార్లు పేరెంట్లు, టీచర్ల భేటీ

>> కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ఈ పాఠశాలను తయారు చేసేందుకు కృషిచేసిన మంత్రి నారాయణ కుమార్తె షరణిని అభినందించారు. ప్రభుత్వ పాఠ శాలల ముందు అడ్మిషన్లు లేవు అనే బోర్డులు చూ స్తుంటే విద్యాశాఖమంత్రిగా తనకెంతో సంతృప్తి వచ్చిందని, రాష్ట్రంలో 9600 పాఠశాలలను ఏర్పా టుచేశాము, విలువలతో కూడిన విద్యా బోధన అవసరమని గ్రహించి వాటిలో వారి రక్త నలను పాఠ్యపుస్తకాల్లో పొందుపరచటం జరిగిం దన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ చెప్పినట్లుగా విద్యార్థులకు మొక్కల ఆవశ్యకత తెలిసేలా చెయ్యాలన్నారు. చదువుతోనే పేదరిక నిర్మూలన సాధ్యమౌతుందని, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. అలాగే వివిధ రకాల వ్యాపారాల్లో, రంగాల్లో అభివృద్ధి చెందిన వారు పి4లో భాగమై రాష్ట్రంలోని పాఠ శాలల అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. విద్యాశాఖలో మార్పులు తీసుకువచ్చి విద్యార్థుల్లో మార్పులు తీసుకురావాలనే ఈ విద్యాశాఖను తాను స్వీకరించటం జరిగిందని తెలిపారు. విద్యార్థులు చదువు, ఆటలు పాటలు తదితర వివరాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించేందుకు ఏడాదికి రెండు సార్లు మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్స్‌ను నిర్వహించటం జరుగుతుం దన్నారు. అలాగే తమకు విద్యాబుద్ధులు నేర్పించమని కమిషనర్‌ను కోరిన పిల్లలను దత్తత తీసుకుని తాను ప్రత్యేక చొరవతో చదివిస్తామని హామీ ఇచ్చారు. విఆర్‌సి తోపాటూ సంస్కృత పాఠశాలను దత్తత తీసుకున్న డిఎస్ఆర్, ఆర్ఎస్ఆర్‌ను దత్తత తీసుకున్న ఎంపీ వేమిరెడ్డిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. మంత్రి నారాయణ మాట్లాడుతు గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని, విద్యావ్యవస్థను పూర్తిగా బ్రష్టు పట్టించిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇందుకు నిదర్శనమే విఆర్‌సి పాఠశాల అని తెలిపారు. ఎన్నికల హామీల్లో భాగంగా మూసివేసిన విఆర్‌సిని ఆధునీకరించి ప్రారంభించటం జరిగిందన్నారు. పి4లో భాగంగా ఎన్‌సిసి అధినేత రాజు, తమ కుమార్తె షరణిలు ముందుకు వచ్చి ఆదునీకరణ పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో నగరంలోని 94వేల ఇళ్లలో 84వేల్ల ఇల్లు తిరిగి పేదల కష్టాలను స్వయంగా పరిశీలించామని, వీరికి మంచి చేయ్యాలనే విఆర్‌ను పునఃప్రారంభింపచేశామన్నారు. తానుకూడా ఇదే పాఠశాలలో 6నుండి డిగ్రీ వరకు చదివానని, అనంతరం ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించామన్నారు. సుమారు 6800మంది ఇక్కడ చదువుకునే వారిని వారి స్మృతులను గుర్తుచేసుకున్నారు. ఈ పాఠశాల పునఃప్రారంభంగురించి ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖమంత్రి లోకేష్‌లకు చెప్పగానే అనుమతులు మంజూరుచేయటం జరిగిందన్నారు. అందరూ పి4లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇన్‌చార్జ్‌మంత్రి ఫరూక్ మాట్లాడుతు పేదలకు సేవ చేయ్యాలని మంత్రి నారాయణ విఆర్‌ను పునఃప్రారంబించటం సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే మెగా డిఎస్సీని నిర్వహించి 16వేల పోస్టులను భర్తీచేసేందుకు మంత్రి లోకేష్ చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర విద్యావ్యవస్థలో మంత్రి లోకేష్ సమూల మార్పులు తీసుకువచ్చి నూతర ఒరవడికకు శ్రీకారం చుట్టారని, ఇదుకు నిరద్శనమే విఆర్ పాఠశాల ఆదునీకరణ అని తెలిపారు. విఆర్ మానేజ్‌మెంట్‌లో 45 సంవత్సరాలుగా ఉంటూ విద్యార్థుల అభివృద్ధికి కృషిచేశామన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిమాట్లాడుతు విద్యాశాఖ మంత్రిగా లోకేష్‌కు అన్నీ విషయాల్లో లోతైన అధ్యయనం, అవగాహ ఉందన్నారు. తాము కూడా దత్తత తీసుకున్ని ఆర్ ఎస్ఆర్‌ను సుందరంగా అభివృద్ది చేసి చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమెహన్‌రెడ్డి, కావ్యకృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, ఎమ్మెల్సీ బల్లి కళ్యాన్‌చక్రవర్తి, వక్స్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్, టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్, సివిల్‌సప్లయిస్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాబి రామిరెడ్డి, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే ప్రసన్న ఇంటిపై దాడి

**నెల్లూరు క్రైమ్ జూలై 7, ప్రభాతవార్త :** కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిపై కొందరు గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం దాడికి పాల్పడ్డారు. స్థానిక సుజాతనగర్ లోని ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిపై కొందరు గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం సాయంత్రం రాళ్ల దాడి చేయడంతో పాటు లోపలికి ప్రవేశించి కొన్ని వస్తువులను పగలగొట్టారు. కోవూరులో జరిగిన వైసిపి కార్యకర్తల సమన్వయ కమిటీ సమావేశంలో ప్రసన్న కుమార్ రెడ్డి మాట్లాడిన కొన్ని వ్యాఖ్యలే ఈ దాడికి కారణంగా అందరూ భావిస్తున్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పై ఈ సమావేశంలో ప్రసన్న కొన్ని అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. దీంతో మనస్థాపానికి గురైన కొందరు టిడిపి కార్యకర్తలు, ఈ దాడికి పాల్పడినట్లు అందరూ భావిస్తున్నారు. ఈ సంఘటన పై సమాచారం అందుకున్న దర్గామిట్ట పోలీసు సంఘటన స్థలానికి చేరుకున్నారు.

## మన్యం జిల్లాలో భారీ వర్షాలు

>> అధికారులు గట్టి జాగ్రత్తలు తీసుకోవాలి, వర్షపు నీటితో, మురుగు కాలువలతో ప్రజలకు ఇబ్బందులు తెలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఎస్పీలకు ఆదేశం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల దగ్గర ఉండకూడదు. తీరం వెంబడి ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది మత్స్యకారులు చేపట వేటకు వెళ్లొద్దని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు.

## నేడు తెరుచుకోనున్న శ్రీశైలం క్రస్ట్‌గేట్లు

>> జలశయం కలకళను సంతరించుకుంటుంది. ఈక్రమంలోనే ఎగువన ఉన్నా జూరాల ప్రాజెక్టు క్రస్ట్‌గేట్ల గుండా 79,200 క్యూసెక్కుల నీరు, విద్యుత్ ఉత్పత్తి అనంతరం 26,159 క్యూసెక్కుల నీరు, సుంకేసుల నుండి మొత్తం 1,71,550 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వచ్చిచేరుతుంది.

## భూముల రిజిస్ట్రేషన్

>> అవుతున్నాయి. యజమాని మరణించిన అనంతరం వచ్చిన ఆస్తులను వారసులు భాగాలు చేసుకుని లిఖితపూర్వకంగా ఏకాభిప్రాయంతో వస్తే గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేసే డిజిటల్ అసిస్టెంట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేస్తారు. సచివాలయాల్లో అది కూడా నామ మాత్ర ఫీజులతో రిజిస్ట్రేషన్ చేయడం ద్వారా వారసులు ముందుకు వస్తారని అంచనా వేస్తున్నారు. ఆటోమేటిగ్గా మ్యుటషన్ విధానం అమలు చేయాలన్నది ప్రభుత్వ నిర్ణయం .ఆ ప్రకారం రిజిస్ట్రేషన్ చేయడం వల్ల భూముల రికార్డుల్లో వివరాల నమోదు (మ్యుటేషన్) ఆటోమేటిగ్గా జరుగుతుంది. ఈపాస్‌బుక్ కూడా జారీ అవుతుంది. వారసులుగా ఉన్న వారి నుంచి ఈకేవైసీ సైతం తీసుకుంటారు. ఇటీవల నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు జారీచేసిన ఆదేశాల ప్రకారం రెవెన్యూ శాఖ నుంచి ఈ విధానం అమలుపై మార్గదర్శకాలు రానున్నాయి. దీనికి అనుగుణంగా రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ చర్యలు తీసుకుంటుంది. ఇందుకు కనీసం రెండు, మూడు నెలల సమయం పట్టనుంది. గతంలో విధానాలకు భిన్నంగా ఇప్పుడు వారసత్వ భూములకే రిజిస్ట్రేషన్‌చేస్తారు. స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పర్యవేక్షణలో ఈ ప్రక్రియ జరుగుతుంది. ఈ రిజిస్ట్రేషన్‌లు ఎలా చేయాలన్న దానిపై డిజిటల్ అసిస్టెంట్లకు మరోదఫా శిక్షణ ఇవ్వనున్నారు.

## వారం - వర్జ్యం

తేది : 08-07-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
త్రయోదశి రా. 12.36
జ్యేష్ఠ రా. 3.14
వర్జ్యం సా. 4.17-5.59
దు.ఉ. 8.18-9.10, 2) రా. 11.59-12.51
శుభసమయం: ఉ. 6.15-7.00, సా. 6.30-7.00
రాహుకాలం - మ. 3.00-4.30

## వారఫలం

**మేషం :** మీలోని ప్రతిభాపాటవాలు వెలుగులోకి వస్తాయి. పోగొట్టుకున్న వస్తువులు, పత్రాలు లభ్యమవుతాయి.

**వృషభం :** సన్నిహితుల సాయంతో ముందుకు సాగుతారు. ముఖ్యమైన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి.

**మిథునం:** షేర్లు, భూముల క్రయ విక్రయాలలో ప్రోత్సాహకరంగా వుండును. సోదరులను కలిసి కష్టసుఖాలను పంచు కొంటారు.

**కర్కాటకం:** స్థిరమైన ఉద్యోగం లభిస్తుంది. కాంట్రాక్టులు దక్కించు కొంటారు. ఉద్యోగాలలో ఒడిదుడుకులు తొలగుతాయి.

**సింహం:** భూములు, గృహం కొనుగోలు చేస్తారు. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు. శుభవార్తలు.

**కన్య :** ఆప్తులను కలిసి ఆనందంగా గడుపుతారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**తుల :** సంతానం నాకు నూతన విద్యా, ఉద్యోగ అవకాశాలు పొందుతారు. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది.

**వృశ్చికం:** చాకచక్యంగా దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించుకొంటారు. ప్రముఖుల నుండి కీలకసమాచారం అందుతుంది.

**ధనుస్సు:** పనులలో ఏర్పడిన ఆటంకాలు తొలగుతాయి. దూర ప్రాంతాల నుండి ముఖ్య సమాచారం అందుతుంది.

**మకరం:** కుటుంబసభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. అనుకోని అవకాశాలు లభిస్తాయి. స్వల్పధనలాభం.

**కుంభం:** పోటీపరీక్షలు, ఇంటర్వ్యూలలో చురుకుగా పాల్గొంటారు. విందు, వినోదాలు శుభకార్యాలలో చురుకగా పాల్గొంటారు.

**మీనం :** రాజకీయ, కళా, పారిశ్రామిక రంగాలలోని వారికి ప్రోత్సాహకరంగా వుండును. ఆరోగ్యంపట్ల జాగ్రత్త అవసరం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోటి, హైదరాబాద్

# తిరుమల సమాచారం

## 16న ఆణివార ఆస్థానం
## - 15న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



**తిరుమల,జూలై 7ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినం 16వతేదీ బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఆలయం లోపల ఈ వేడుక జరిపిస్తారు. ఈ సందర్భంగా 15వతేదీ మంగళవారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపడ తారు. ఆలయ అర్చకులు, అధికారులు మహోయజ్ఞంలా ఈ కార్యక్రమంలో పాల్గొని ఆలయం అంతటా సుగంధపరిమళ ద్రవ్యంతో శుద్ధి చేయనున్నారు. ఆలయంలోపల బంగారువాకిలి నుండి ఉప ఆలయాలు, మహద్వారం వరకు నీటితో శుభ్రం చేయనున్నారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరిపసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం,గంధంపొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పరిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా సంప్రోక్షణ చేస్తారు, అష్టదళపాదపద్మారాధన సేవ రద్దయ్యింది. 16వతేదీ ఆలయంలో ఆణివార ఆస్థానం జరగనుంది. ఆ రోజు సాయంత్రం ఉభయదేవేరులతో కలసి మలయప్పస్వామి సువాసనల పుష్పపల్లకిపై ఊరేగుతారు.

## శ్రీవారి ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలి :తమిళనాడు గవర్నర్ రవి



**తిరుమల,జూలై 7ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని, శుభాలు కలగాలని ప్రార్థించినట్లు తమిళనాడు రాష్ట్ర గవర్నర్ రవీంద్ర నారాయణన్ రవి తెలిపారు. సోమవారం ఉద యం ఆలయం వద్దకు చేరుకున్న గవర్నర్ రవి కుటుంబసభ్యులకు టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం,అర్చకులు మహాద్వారం వద్ద స్వాగతం పలికారు ఆలయంలోనికి చేరుకున్న ఆయన విఐపి బ్రేక్ దర్శనంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్వామివారి ఆశీస్సులందుకున్నారు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## గోవిందరాజు ఉత్సవర్లకు కవచప్రతిష్ఠ



**తిరుపతి,జూలై 7 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో జ్యేష్టాభిషేకాల్లో రెండవరోజు సోమవారం శ్రీదేవిభూదేవిసమేత గోవిందరాజస్వామి ఉత్సవర్లకు కవచప్రతిష్ట చేశారు. సోమవారం ముధ్యాహ్నం శ్రీదేవిభూదేవిసమేత గోవిందరాజస్వామి ఉత్సవర్లను కల్యాణమండపంలోకి వేంచేపు చేశారు. అక్కడ వేదపండితులు శ్రీసూక్తం, భూసూక్తం, పురుషసూక్తం, నీలాసూక్తం, నారాయణసూక్తాలను పఠిస్తుండగా పాలు,పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు,చందనంతో ఉత్సవమూర్తులను అభిషికించారు. కవచప్రతిష్ట చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులు ఆలయ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయంలోనికి చేర్చారు. ఉత్సవమూర్తులు అరిగిపోకుండా పరిరక్షణకు జ్యేష్టాభిషేకాలు జరిపిస్తారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ విఆర్ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, ఆలయఅర్చకులు,సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో ఆర్మీ విశ్రాంత అధికారి యాదవ్

### ప్రభుత్వ సలహాదారు ఠాకూర్



**తిరుమల,జూలై 7ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామిని సోమవారం ఉదయం విశ్రాంత ఆర్మీ అధికారి పరమవీరచక్ర యోగేంద్రసింగ్‌యాదవ్, ఏపి ప్రభుత్వ సలహాదారుడు ఆర్‌పి ఠాకూర్ దర్శించుకున్నారు. సోమవారం ఉదయం విఐపి బ్రేక్‌లో వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు . టిటిడి అధికారులు స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## తిరుపతిలో కత్తులు,కర్రలతో సైకో వీరంగం : యాచకుడు మృతి

**తిరుపతి,జూలై 7ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యం యాత్రికులతో, భక్తులతో వాహనాలతో రద్దీగా ఉండే తిరుపతిలోని కపిలతీర్థం కూడలిలో సోమవారం ఉదయం ఓ మతిస్థిమితం లేని (40)వ్యక్తి కత్తులు,కర్రలతో వీరంగం చేశాడు. పుట్‌పాత్‌లపై ,కపిలతీర్థంముందు రోడ్డుపై కూర్చునివున్న యాచకులు,కొందరు భక్తులపై దాడికి పాల్పడ్డాడు. చేతిలోని కత్తి,కర్రలు పట్టుకుని వీరంగంతో కనిపించిన వారిపై దాడిచేశాడు. కత్తితో దాడిచేయడంతో అక్కడే ఉన్న యాచకుడు శేఖర్(55)తలకు బలమైన గాయాలయ్యాయి. మరో ముగ్గురు భక్తులు గాయపడ్డారు.స్థానికులు పోలీసు కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వడంతో అక్కడే ఉన్న ట్రాఫిక్ పోలీస్, అలిపిరి పోలీసులు అక్కడకు చేరుకుని సైకోను వల సాయంతో అదుపులోకి తీసుకున్నారు, కనిపించిన వారందరిపై దాడిచేస్తూ భయంగొల్పించాడు. నగరవాసులు పరుగులుతీశారు. తీవ్రంగా గాయపడిన వారిని రుయాకు తరలించగా చికిత్సపొందుతూ శేఖర్ మృతి చెందాడు. మరో ఇద్దరు భక్తులు చికిత్సపొందుతున్నారు. సోమవారం కావడం, కపిలతీర్థం భక్తులతో రద్దీగా ఉంటుంది.సైకో వీరంగంతో అక్కడ ఒక్కసారిగా ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. సైకోను అలిపిరి పోలీసులు అదుపులోకి తీసుకుని రుయా మానసిక వార్డులో చేర్చారు.

## విజయవాడ హెల్త్ యూనివర్సిటీ వద్ద విద్యార్థుల ఆందోళన

**విజయవాడ,జూలై7,ప్రభాతవార్తప్రతినిధి:**మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సిపి విద్యార్థి విభాగం ఆందోళన చేపట్టింది...సోమవారం చేపట్టిన నిరసన సందర్భంగా విద్యార్థి నేతలను అడ్డుకునేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నించాల్సి వచ్చింది. దాంతో ఆ ప్రాంతంలో స్వల్ప ఉద్రిక్తత నెలకుంది. ఈ క్రమంలో వర్సిటీ ప్రధాన ద్వారా వదేద భైఠాయించి తమ నిరసన కొనసాగించారు. వైఎస్సార్ సిపి విద్యార్థి విభాగం అధ్యక్షుడు పానుగంటి చైతన్య అధ్వర్యంలో పార్టీ నేతలు విద్యార్థులు,యువకులు,గుణదల నుండి హెల్త్ యూనివర్సిటీ దాకా భారీగా ర్యాలీకి వచ్చారు. అయితే ఈ సమాచారంతో అప్పటికే పోలీసులు భారీగా మొహరించారు. యూనివర్సిటీ వద్దకు చేరుకోగానే వాళ్ళను లోపలికి వెళ్ళనీయకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలో వాగ్వాదం, తోపులాటతో స్వల్ప ఉద్రిక్తత చోటు చసుకుంది. దీంతో విద్యార్థి నాయకులు యూనివర్సిటీ ప్రధాన ద్వారా వద్ద భైఠాయించి నిరసన తెలిపారు. వారిని అక్కడ నుంచి వెళ్ళిపోవాలని పోలీసులు హెచ్చరించారు. తమ నిరసన నిర్దిష్ట సమయం వరకు వ్యక్తం చేసి వెళ్తామని విద్యార్థినాయకులు బదులిచ్చారు. కొద్దిసేపటికి పోలీసుల సూచనల మేరకు వారు ఆందోళన నిర్వహించి ప్రశాంతంగా వెళ్ళిపోయారు.



గిరిజన రైతులతో చర్చిస్తున్న సిఐ యుగంధర్

## పామిడిలో గిరిజన రైతులు అరెస్ట్

### - కలెక్టర్ భూములను పరిశీలించి రస్తాను చూపించాలని డిమాండ్

### - అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం, ధర్నా

**పామిడి, జులై 07 ప్రభాతవార్త** ప్రజాప్రభుత్వంలో గిరిజనులకు రక్షణ కరువైందని మా భూములకు రస్తా చూపించాలని నెలల తరబడి జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలను సమర్పిస్తున్నప్పటికీ అధికారయంత్రాంగం అగ్రవర్ణ పెత్తందారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ మా పట్ల వివక్షతను చూపిస్తున్నారని మమ్మల్ని పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆందోళన వ్యక్తం చేసిన గిరిజన రైతులు రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేసి ధర్నా చేపట్టడంతో పోలీసులు వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన సంఘటన అనంతపురం జిల్లా పామిడిలో సోమవారం చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి వివరాలిలావున్నాయి.. మేమంతా నెలల తరబడి ఇస్తున్న ఫిర్యాదులపై స్పందించని ప్రజాసమస్యల పరిష్కార వేదికలు మాకొద్దని ఇక్కడి వ్యవస్థలన్నీ అగ్రకుల పెత్తందారులకు దాసోహమై గిరిజన రైతుల పట్ల వివక్షతను చూపిస్తున్నాయని మీరైనా మా మొరను ఆలకించాలని మండల పరిదిలోని రామగిరి ఎగువతండా గిరిజన రైతులు రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేసి ధర్నా చేపట్టారు. రామగిరి రెవెన్యూ పరిదిలోని సర్వేనెంబర్ 46, 51, 52, 53, 54, 61, 62, 75, 76, 77, 106బిలో 42 మంది గిరిజన రైతులకు 106 ఎకరాల భూములు ఉన్నాయని మేమంతా భూముల్లోకి వెళ్ళాలంటే రస్తా లేదని మా భూములకు రస్తా చూపించాలని జిల్లా కలెక్టర్, గుంతకల్లు ఆర్డీఓ, పామిడి తహశీల్దార్ కార్యాలయాల్లో ప్రజాసమస్యల పరిష్కార వేధికల ద్వార విన్నవించినప్పటికీ వారంతా స్పందించిన దాఖలాలు లేవన్నారు. జాతీయ, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్ల ఆదేశాలను గౌరవించి నిర్ణీత గడువులోపు గిరిజన రైతుల సమస్యకు పరిష్కారం చూపాలని వేడుకుంటున్నా అధికారయంత్రాంగం పట్టించుకోకపోవటంలో ఆంతర్యమేమిటో అంతుపట్టని విధంగా తయారైందన్నారు. ప్రభుత్వ భూములు, రెవెనూ రికార్డు, రస్తా ప్లాన్లు, గ్రామ దేవతల భూములను అగ్రకులాల వారు దౌర్జన్యంగా ఆక్రమించుకోవటం ద్వార మాకు సంబంధించిన 106 ఎకరాల భూములకు రస్తా లేక భూములన్నీ బీడుగా మారిపోయాయని వాపోయారు. అధికారులు అగ్రకుల భూస్వాములకే అనుకూలంగా వ్యహరిస్తూ మాకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మా భూములకు రస్తా చూపించి మాకు తీరని అన్యాయం చేస్తున్న అగ్రకుల పెత్తందారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో అక్కడకు చేరుకున్న సిఐ యుగంధర్ గిరిజన రైతులతో చర్చించి మీకు న్యాయం చేస్తామని ప్రస్తుతం ఇక్కడే జిల్లా కలెక్టర్ ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నారని మీరంతా ఆయన వద్దకు వెళ్ళాలని సూచించగా అనేకమార్లు వినతిపత్రా లను అందించినా పట్టించుకోని కలెక్టర్ మాకు న్యాయం చేస్తారన్న నమ్మకం లేదన్నారు.

## అభిప్రాయసేకరణతో తిరుమలలో మెరుగైన సేవలు

### - అన్నదానం, కల్యాణకట్ట, వసతి సదుపాయాలపై భక్తుల సంతృప్తి

**తిరుమల,జూలై 7ప్రభాతవార్తప్రతినిధి:** దేశం నలుమూలల నుండేగాక విదేశాల నుండి ప్రతిరోజూ కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి వస్తున్న భక్తుల నుండి తీసుకుంటున్న అభిప్రాయసేకరణతో తిరుమలలో అన్నదానం, కల్యాణకట్ట,వసతి విభాగాల్లో సదుపాయాలు మెరుగుపడ్డాయని భక్తులు తమ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలో కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించేందుకు క్యూలైన్లో వేచివుండటమేగాక క్షురకులకు డబ్బులిచ్చుకునే పరిస్థితి ఉండేదని, ఇప్పుడా అవసరం లేకుండా భక్తులు సాఫీగా తలనీలాలు త్వరగా సమర్పించుకునేలా చూడటం బావుందని భక్తులు తమ అభిప్రాయాలను చెబుతూన్నారు. ఇక కొండకు వచ్చిన ధనవంతుల నుండి సామాన్యభక్తులు వరకు వసతి కోసం తాపత్రయం పడటం కనిపిస్తుంది. అయితే తిరుమలలోఎలాంటి సిఫార్సులు లేకున్నా భక్తులు తమ ఆధార్‌కార్డు ఆధారంగా సిఆర్‌ఓ కేంద్ర కార్యాలయం వద్ద ఏఆర్‌పి కౌంటర్‌లలో తమ పేర్లు నమోదు చేసుకుంటే అర్ధగంటలోపే గది లభ్యత సులభంగా మారింది. ఇక రోజువారీగా తిరుమలకు వస్తున్న 90వేలమంది వరకు భక్తులు దర్శనానికి ముందు, దర్శనానంతరం కూడా తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనం, ఫుడ్‌కౌంటర్లలో 1.20లక్షల మంది వరకు అన్నప్రసాదాలు స్వీకరిస్తుండటం ఆనందం వెలిబుస్తున్నారు. అన్నప్రసాదాల రుచి.నాణ్యత తయారీ శుభ్రత వందరెట్లు



మెరుగైందని భక్తులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేయడం జరుగుతుంది. ఈ మార్పులన్నీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఆదేశాలతో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు ,టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి స్వీయపర్యవేక్షణతోనే సాధ్యమైందనేది టిటిడి వర్గాలు, భక్తులు, శ్రీవారి సేవకులు వ్యక్తం చేస్తున్న అనుభవం.తిరుమలలో ఇంకా ప్రైవేటు హోటళ్ళు, ఫాస్టుఫుడ్‌లలో కూడా శుచిగా, రుచిగా నాణ్యతతో భోజనం, దక్షిణభారతదేశం వంటకాలతో ఆహారపదార్థాలు వడ్డిస్తుండటం జరుగుతోంది. లక్షలాదిమంది భక్తులు రోజుకు వస్తున్న పుణ్యక్షేత్రంలో ఇంతటి మార్పులు రావడం టిటిడి ఇఒ,అదనపు ఇఒల స్వయం పర్యవేక్షణ,వారి కృషి ఫలితమేనని టిటిడి ఉద్యోగులు చెప్పడం ప్రత్యేకత. ఇక కొండకు చేరుకున్న సామాన్యభక్తులకు ముఖ్యమైన అంశం స్వామివారి దర్శనం వీలైనంత వరకు త్వరగా చేయించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వందమంది భక్తుల్లో 80మంది భక్తులు క్యూలైన్లలో నిరీక్షణ సమయం తగ్గించాలని, ఆలయంలోపలకు నాలుగైదు గంటల్లో చేరుకునేలా చూడాలని అభిప్రాయం వెల్లడిస్తున్నారు. సాధారణరోజుల్లోనే రోజుకు 90వేలమంది వరకు వస్తున్న భక్తుల సంఖ్య వారాంతం, ప్రత్యేకసెలవురోజుల్లో 1.20లక్షలవరకుచేరుకుంటున్నారు. ఇంతభారీగా భక్తులు చేరినా సౌకర్యాలు మెరుగుపడటం ఆనందించదగిన విషయంగా భక్తులు చెబుతున్నారు. అయితే సామాన్యభక్తులకు శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం మరింత త్వరగా చేయించేలా చూస్తే బావుంటుందనేది భక్తుల్లో వ్యక్తమవుతున్న తాజా అభిప్రాయాలు. ఇందుకు రకరకాల దర్శన విధానాల్లో భక్తులు రావడం కూడా ఉంది. నేరుగా తిరుమలకు చేరుకుంటే నాలుగైదు గంటల్లోనే తోపులాటలేని, సౌకర్యవంతమైన దర్శనం చేయిస్తే చాలని చెబుతున్నారు. తిరుమలలో ఇప్పటికే అన్ని రకాలుగా మెరుగైన సేవలందించడంలో మార్పులు తీసుకురావడం శుభపరిణామమని వేలాదిమంది భక్తులు తమ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. భక్తులు కూడా నిర్మోహమాటంగా తమ అభిప్రాయాలు వెల్లడించే అవకాశం కలిగింది. ఐవిఆర్‌ఎస్, వాట్సాప్(9399399 399), ఈ సర్వే ,శ్రీవారిసేవకులద్వారా అభిప్రాయ సేకరణ తీసుకోవడమేగాక 16అంశాలపై భక్తులు తమ అభిప్రాయాలు చెప్పడానికి వీలుగా క్యూఆర్ కోడ్ స్కానింగ్ కోసం ఓ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు.

## పంచాయతీ కార్యదర్శుల సమస్యలను తక్షణం పరిష్కరించాలి

### - ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షుడు, జెఎసి ఛైర్మన్ విద్యాసాగర్

**విజయవాడ,జూలై7,ప్రభాతవార్తప్రతినిధి:**పంచాయతీ కార్యదర్శుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు, జెఎసి ఛైర్మన్ ఎ విద్యాసాగర్ కోరారు.ప్రభుత్వం ఉద్యోగ సంఘాల సంయుక్త కార్యచరణ కమిటీకి ఇచ్చిన వాగ్దానం మేరకు పంచాయతీ కార్యదర్శులపై పని ఒత్తిడి తగ్గించాలని ప్రభుత్వాన్ని ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు, జెఎసి ఛైర్మన్ ఎ విద్యాసాగర్ కోరారు. రాష్ట్రస్థాయి పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గ సమావేశం విజయవాడలోని ఎపి ఎన్‌జిఒ హోమ్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ఉద్దేశంతోనే ఈ సమావేశం నిర్వహించామన్నారు. మొత్తం 6 గ్రేడ్‌లను 3 గ్రేడ్‌లకు కుదించాలనే ప్రభుత్వం నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులపై రోజురోజుకూ పెరుగుతోన్న ఒత్తిడిని తగ్గించేందుకు సమయపాలనలో మార్పులు చేయాలని కోరారు. పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్ల వీడియో కాలింగ్ చేయాలన్న విధానాన్ని తొలగించాలని, ఈ అంశంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వైవిడి ప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల పరిపాలనా వ్యవస్థలో చేపట్టిన సంస్కరణలు గ్రామాల అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. ఈ సమావేశంలో ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర కార్యదర్శి డివి రమణ తదితరులు పాల్గొన్నారు.

## మార్క్ ఫెడ్ నుండి పౌరసరఫరాల సంస్థకు 1000 కోట్ల రుణం బదలీ

### - మార్క్ ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఢిల్లీ రావు

**విజయవాడ,జూలై7,ప్రభాతవార్తప్రతినిధి:** ధాన్యం నగదు చెల్లింపులపై మరో మూడు రోజులలో మార్క్ ఫెడ్ నుండి పౌరసరఫరాల సంస్థకు 1000 కోట్ల రుణం బదలీ చేస్తున్నట్లు ఎపి మార్క్ ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డిల్లీ రావు తెలిపారు. ధాన్యం బకాయిల అంశంపై ఆయన సోమవారం నిర్వహించిన అధికారుల సమావేశంలో గత రబీ 2024- 25 సీజన్ కు సంబంధించి రైతుల నుండి వరి ధాన్యాన్ని సేకరించిన పౌర సరఫరాల సంస్థ కు రైతులకు ధాన్యం నగదు చెల్లింపులకు గాను రాష్ట్ర ప్రభుత్వం చొరవతో జీవో నెంబర్ 25ను విడుదల చేసిందన్నారు. తద్వారా రాష్ట్ర ప్రభుత్వ హామీతో, జాతీయ సహకార అభివృద్ధి సంస్థ నుండి ఏపి మార్క్‌ఫెడ్ రూ.1000 కోట్లు రుణం పొందడానికి అనుమతి మంజూరు చేయడం జరిగిందన్నారు.ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా ఏపి మార్క్‌ఫెడ్, జాతీయ సహకార అభివృద్ధి సంస్థను సంప్రదించడం జరిగినది. ఈ రుణం 2 నుండి 3 రోజుల్లో మార్క్‌ఫెడ్ సంస్థకు మంజూరు చేయబడుతుంది సదరు రూ.1000 కోట్ల రుణం మార్క్ ఫెడ్ కు అందిన వెంటనే పౌర సరఫరాల సంస్థకు బదలీ చేయబడతాయని డిల్లీ రావు తెలిపారు .తద్వారా పౌర సరఫరాల సంస్థ రైతుల నుండి సేకరించిన ధాన్యం నగదు చెల్లింపులు రైతులకు వెనువెంటనే జరుగుతాయని వివరించారు.

## మామిడి రైతులను ఆదుకోండి

### - సిఎం చంద్రబాబుకు సిపిఎం లేఖ

**విజయవాడ,జూలై7,ప్రభాతవార్తప్రతినిధి:** మామిడి రైతులను సంక్షోభం నుండి ఆదుకోడానికి నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యమంత్రి చంద్రబాబుకు లేఖ రాశారు. ఈ లేఖలో మామిడి రైతులకు కిలో రూ.12లు చొప్పున ధర ఇవ్వాలని అందులో రూ.4లు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తుందని, మిగతా మొత్తం కిలోకు రూ.8లు మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులు అందించాలని ప్రభుత్వం నుండి మీరు ఇచ్చిన ఆదేశాలు ఏమాత్రం అమలు కాలేదు. మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులు సిండికేట్‌గా ఏర్పడి కిలో రూ.4లకు మించి కొనడం లేదు. మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులు రైతులను నిలువునా ముంచుతున్నారు. కాబట్టి పరిశ్రమల గుత్తాధిపత్యం నుండి రైతుల్ని ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వ మార్కెటింగ్ ఏజెన్సీల ద్వారా ప్రత్యక్షంగా జోక్యం చేసుకొని కొనుగోలు చేయాలి. మీరిచ్చిన హామీలు అమలు చేసేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నాను. కర్ణాటక రాష్ట్రం కేంద్రం నుండి మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం క్రింద కిలో రూ.16లు చొప్పున 2లక్షల 50 వేల టన్నులు కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించారు. కేంద్రంలో మీకున్న పలుకుబడి ఉపయోగించి కిలో రూ.16లతో కొనుగోలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి కనీసం 500 కోట్లు నిధులు రాబట్టి కర్నాటకలో మాదిరి మామిడి రైతులను ఆదుకోవాలని కోరుచున్నాను. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ మొత్తాన్ని పరిశ్రమల ఖాతాల్లో కాకుండా నేరుగా రైతులకు ప్రత్యక్షంగా అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నట్లు" పేర్కొన్నారు. రాష్ట్రంలో మామిడి పంటకు ప్రధాన కేంద్రం ఉమ్మడి చిత్తూరు జిల్లా. సుమారు లక్ష ఎకరాల వరకు రైతులు తోతాపురి రకం సాగు చేస్తున్న విషయం మీకు తెలుసు. ప్రత్యేకించి తోతాపురి (బెంగళూరు) రకం మామిడి పండిస్తున్న రైతులు గత నాలుగు సంవత్సరాలుగా నష్టంలో ఉన్నారు. ఈ సంవత్సరం వాతావరణం అనుకూలించడం వల్ల మామిడి పంట దిగుబడి ఆశాజనకంగా ఉంది. మామిడి ఉత్పత్తి పెరగటంతో మామిడి కొనుగోలు ధర కిలో రూ.2 3లకే పరిమితం చేసి మామిడి గుజ్జు పరిశ్రమల యజమానులు సిండికేట్‌గా ఏర్పడి మామిడి రైతులను దోపిడీ చేసేందుకు పూను కున్నారన్నారు.

## విద్వేషాలను రెచ్చగొట్టడమే జగన్ పనిగా పెట్టుకున్నారు

**విజయవాడ,జులై 7,ప్రభాతవార్త ప్రతినిధి:** విద్వేషాలను రెచ్చగొట్టడమే మాజీ ముఖ్యమంత్రి జగన్ పనిగా పెట్టు కున్నా రని ఏపీ ఆరోగ్య శాఖా మంత్రి సత్య కుమార్ వ్యాఖ్యా నించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో మంత్రి పోస్టింగులు పెట్టారు. జగన్‌కు ఏం అంశంపై అవగాహన ఉండదని, మామిడి గురించి ఆయనకు ఏమీ తెలుసునన్నారు. మామిడిరైతుల పరామర్శ కంటూ వైకాంగ్రెస్ పార్టీ నేతలు సిగ్గు లేకుండా 10 వేల మందితో అనుమతి కోరార న్నారు.


**భారత్ డైనమిక్స్ లిమిటెడ్**
(భారత ప్రభుత్వ సంస్థ, రక్షణ మంత్రిత్వశాఖ)
గచ్చిబౌలి, హైదరాబాద్: - 500 032

Ref:BDL/CC/OT/GT/001/2025-26 తేది: 08.07.2025

ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండర్ ప్రకటన
స్వదేశీ పోటీ బిడ్డింగ్ ఆహ్వానిస్తూ

| క్ర. సం. | టెండర్ ID | వివరణ | అంచనా రూ.లలో |
|---|---|---|---|
| 1 | 65963 | BDL-KBU వద్ద EB-VII & స్టోరేజ్ క్యూబికల్స్ వద్ద ప్రస్తుతం వున్న ట్రావెర్స్ వాల్ పటిష్ఠపరచుట. | 589.07 లక్షలు |

తదుపరి వివరాలకు డ్యాష్ బోర్డ్ పై సెలక్ట్ ఆఫ్‌లైన్ టెండర్స్ https://bdltenders.abcprocure.com వెబ్‌సైట్ దయచేసి వీక్షించండి. బిడ్స్ ఆఫ్‌లైన్‌లో మాత్రమే దాఖలు చేయవలెను. "సవరణ ఏవైనా మా ఇ-పోర్టల్ ద్వారా మాత్రమే జారీ చేయబడును. మరియు వార్తా పత్రికలలో కాదు".
* బిడ్డర్లు BDL వెబ్‌సైట్ https://bdl-india.in/registration-contractors ప్రోస్పెక్ట్స్‌లో విక్రేత రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్ కొరకు దరఖాస్తు చేయవలసినదిగా కోరుతున్నాము.

అడిషనల్ జనరల్ మేనేజర్ (Corp Comml)



**నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్** NIWAS HOUSING FINANCE
(పూర్వపు) ఇండోస్టార్ హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌గా తెలిసినది, NHFPLగా ఇటుపై రిఫర్ చేయబడును)
నమోదిత కార్యాలయం : యూనిట్ నెం.305, 3వ అంతస్తు, వింగ్ 2/E, కార్పొరేట్ ఎవెన్యూ, అంథేరీ ఘట్‌కోపర్ లింక్ రోడ్, చాకల, అంథేరీ (ఈస్ట్), ముంబై-400093

**స్వాధీనతా ప్రకటన [నిబంధన 8(1) మరియు (2)]**

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్టు (యాక్ట్) 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు 2002 యొక్క (నిబంధన 3)తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను నెరవేర్చే నిమిత్తం ఇందులో పేర్కొన్న సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారి రుణగ్రహీత(లు) నోటీస్‌లో పేర్కొన్న మొత్తాన్ని సదరు నోటీస్ స్వీకరించిన తేదీ నుండి 60 రోజులలోగా బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించవలసినదిగా పిలుపునిస్తూ డిమాండ్ నోటీస్ జారీ చేసారు.
రుణగ్రహీత(లు) ఇట్టి మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనందున రుణగ్రహీత(లు) మరియు సాధారణ ప్రజానీకానికి, దిగువ సంతకందారు NHFPL అధీకృత అధికారి అయినందున సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు 2002 యొక్క నిబంధన 8తో చదువబడే చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద సంక్రమించబడిన అధికారాలను వినియోగిస్తూ ఈ దిగువ తెలిపిన స్థిరాస్తులను క్రింద పేర్కొనబడిన ప్రతీ ఆస్తి ఎదురుగా ఉన్న తేదీ స్వాధీనం చేసుకొన్నారని ఇందుమూలముగా నోటీస్ ఇవ్వడమైనది.
చట్టం యొక్క 13 సెక్షన్ యొక్క సబ్ సెక్షన్ (8) నియమాల ఏర్పాట్లు రుణగ్రహీత దృష్టికి తీసుకురావడం ఏమనగా అందలి నిర్దేశితాలను అనుసరించి రుణగ్రహీత లభ్యంగా గల సమయంలోగా తనఖా పెట్టబడిన ఆస్తులను తిరిగి పొందవచ్చును.
ప్రధానంగా రుణగ్రహీత(లు) మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా తెలుపబడిన ఆస్తికి సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఒకవేళ అలా జరిపిన పక్షంలో NHFPL వారికి దిగువ తెలిపిన బకాయి మొత్తం మరియు వడ్డీ మరియు ఆపై ఇతర ఛార్జీలు మొత్తాన్ని చెల్లించవలసి ఉంటుంది.

| రుణ ఖాతా నంబరు | రుణగ్రహీత(లు) & ఆస్తి వివరాలు | మొత్తం మరియు డిమాండ్ నోటీస్ తేదీ | స్వాధీనతా తేదీ | స్వాధీనతా స్టేటస్ |
|---|---|---|---|---|
| LNGUN0HL1 0230036834 | 1. హరి శంకర్ మురుగు (రుణగ్రహీత) 2. జ్యోతి మురుగు (సహ-రుణగ్రహీత) | రూ.8,72,443/- (రూపాయలు ఎనిమిది లక్షల డెబ్బై రెండు వేల నాలుగు వందల నలభై మూడు మాత్రమే) తేదీ: 16-జనవరి-2024 | 03-07-2025 | భౌతికంగా స్వాధీనం |

ఆస్తి కలిగి ఉన్నది : గుంటూరు జిల్లా, తెనాలి ఉప-జిల్లా తెనాలి మునిసిపల్ పట్టణం, సర్వే వార్డ్ నం.1, బ్లాక్ నం.16, ఎక.0-18 సెంట్లు కలిగి ఉన్న ఒకే కొనసాగింపు ఒకే ప్లాట్‌లోని, T.S. నం.670/2, ఎక.0-35 సెంట్లు, T.S. నం.571 సెంట్లు, T.S. నం.572/2లో ఎక.0-42 సెంట్లు, T.S. నం.572/2లో ఎక.0-43 సెంట్లు, T.S. నం.573/3లో, అతి దగ్గర ఇ.నం.13-17-13 వద్ద ఉన్న 100 చ.గజాల విస్తీర్ణం ఉన్న స్థలం దానిలోని అన్ని ఫిక్చర్‌లు మరియు ఫిట్టింగ్‌లతో. సరిహద్దులు ఈ విధంగా: తూర్పు: మునిసిపల్ బజార్ 20-11 అ., పడమర: వాసిరెడ్డి రమాదేవిచే ఇతరులకు అమ్మబడిన స్థలం, 20-11 అ., ఉత్తరం: విక్రేత యొక్క మిగిలిన స్థలం/రామిరెడ్డి విజయలక్ష్మి 45 అ., దక్షిణం: గుగ్గులోతు మోతీబాబు యొక్క స్థలం 43 అ.

ప్రదేశం : గుంటూరు, ఆంధ్రప్రదేశ్ సం/ అధీకృత అధికారి
తేదీ : 08.07.2025 నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున


## చేనేత, జౌళి శాఖలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**విజయవాడ, జూలై 7,ప్రభాతవార్తప్రతినిధి:** జాతీయ చేనేత అభివృద్ధి పథకం కింద స్మాల్ క్లస్టర్ డెవలప్ మెంట్ కార్యక్రమంలో భాగంగా ఎగ్జిక్యూటివ్ క్లస్టర్ డెవలప్ మెంట్, టెక్స్ టైల్ డిజైనర్స్ కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని చేనేత,జౌళి శాఖ కమిషనర్ జి. రేఖా రాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎగ్జిక్యూటివ్ క్లస్టర్ డెవలప్ మెంట్ (5 ఖాళీలు), టెక్స్ టైల్ డిజైనర్స్ (5 ఖాళీలు) పోస్ట్ ల భర్తీకీ ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. క్లస్టర్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్స్ పోస్ట్ కు దరఖాస్తుదారు హ్యాండ్లూమ్ టెక్నాలజీ, టెక్స్ టైల్ టెక్నాలజీ నందు డిగ్రీ డిప్లొమా తో పాటు రెండు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం, ఎంఎస్ వర్డ్, ఎక్సెల్. పవర్ పాయింట్, రికార్డులు, ఖాతా పుస్తకాల నిర్వహణ లో పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. టెక్స్ టైల్ డిజైనర్ పోస్ట్ కు డిజైన్లు రూపొందించే నైపుణ్యం కలిగి నిఫ్ట్ ఎన్ఐడి లేదా ఏదైనా ప్రఖ్యాత సంస్థ / ఇన్స్టిట్యూట్ నుండి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అలాగే కనీసం చేనేత విభాగంలో 2 సంవత్సరాలు టెక్స్ టైల్ విభాగంలో పనిచేసిన అనుభవం కలిగి ఉండాలన్నారు ఈ పోస్ట్ లకు అర్హత, అనుభవం, వయస్సు, నివాసం మొదలైన వాటి ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయబడును అని తెలిపారు. దరఖాస్తుదారులు ధృవపత్రాల కాపీలతో పాటు బయో డేటాను ప్రకటన వెలువడిన రోజు నుండి 21 రోజుల లోపు సమర్పించాలన్నారు.

వార్త

స్వార్థం కోసమే జీవించే వ్యక్తి, తన మరణం ద్వారా ప్రపంచానికి లాభాన్ని చేకూరుస్తాడు.

-టెర్టుల్లియన్

# అనుకున్న 'రాజకీయ' మే!

అనుకున్నంతా జరిగింది. అమెరికా రాజకీయ, సామాజిక యవనికపై మరో రాజకీయ పార్టీ పురుడు పోసుకుంది. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ అన్నంత పనీ చేసారు. అమెరికా రాజకీయాల్లో శూన్యత ఏర్పడితే ఎలాంటి పరిస్థితులు ఏర్పడతాయో ముందుగానే పసిగట్టి, ఏకంగా 'పోల్' నిర్వహించిన మస్క్ అమెరికన్‌ల సంక్షేమం కోసం ముందడుగువేశారు. అమెరికాలో కనీసం 80 శాతం మంది ప్రజానీకం కొత్త పార్టీకి ఆశీస్సులందిస్తారనే ఒకే ఒక నమ్మకంతో ఏర్పడిన 'అమెరికా పార్టీ' మస్క్ అనే మీడియా టైకూన్ ఆలోచనల నుంచి పుట్టింది. అమెరికా అంటేనే డెమోక్రటిక్ పార్టీ, రిపబ్లికన్ పార్టీల మధ్య అటునిటుగా సాగే విన్యాసాల మధ్య ఊగిసలాడే రాజకీయాలు నడిచే దేశం. ఇక్కడ మూడో పార్టీకి చోటుండదని గతంలో ఒకటి రెండు సార్లు తేలిపోయింది. ట్రంప్ మొండితనంతో రూపొందించుకున్న 'బిగ్ బ్యూటిఫుల్ బిల్' అన్ని అవాంతరాలు దాటి ఆయన సంతకంతోనే బాహ్య ప్రపంచాన్ని చూసింది. ఆ బిల్లుకు ప్రజల నుంచి పూర్తి వ్యతిరేకత వస్తుందని, ఆ బిల్లు అమలైతే అమెరికా ఖజానాకు బాగా నష్టం వస్తుందని ఎలోన్ మస్క్ ఎన్నికల ముందు నుంచీ ట్రంప్‌ను హెచ్చరిస్తూనే ఉన్నారు. ఆ బిల్లు అమలులోకి వస్తే తాను అమెరికన్ల సంక్షేమం కోసం అమెరికన్ పార్టీ పెడతానని మస్క్ ముందే ప్రకటించారు. ఎవరి పంతాలను వారు విడిచి పెట్టలేదు. మస్క్ చెప్పినట్లుగానే కొత్త రాజకీయ పార్టీ జూలై 5, 2025న అధికారికంగా ప్రారంభించారు. తొలి సందేశంలోనే ఆయన 'మీ స్వాతంత్ర్యాన్ని వెనక్కి తీసుకురావడానికి ఈ పార్టీ ఏర్పాటైనట్లు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఎందుచేతనో అమెరికాలో ప్రస్తుతం ప్రజాస్వామ్యం కొరవడినందున, ప్రజలకు స్వేచ్ఛనిచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నానని వివరించారు. యునైటెడ్ స్టేట్స్‌లోని సాంప్రదాయ ద్విపార్టీ వ్యవస్థను సవాలు చేసే లక్ష్యమే ఇక్కడ కనపడుతోంది. మస్క్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్', ద్వారా పార్టీకి బలమైన ప్రజా మద్దతు కూడగట్టడం సాధ్యమేనని తెల్చుకున్న తర్వాతనే మస్క్ పార్టీని ప్రకటించారు. 1.2 మిలియన్లకు పైగా ప్రతిస్పందనలను సంపాదించిన ఈ పోల్‌లో నిర్ణయాత్మక మెజారిటీ కనిపించింది. కొత్త రాజకీయ పార్టీకి అనుకూలమనే హేతుబద్ధత సూచించింది. అమెరికా పార్టీ అమెరికన్లకు సంపూర్ణ స్వేచ్ఛను పునరుద్ధరించడమే కాదు మధ్యేవాద ఓటర్లకు ప్రాతినిధ్యం వహించడం కూడా అవసరమని సంకల్పించింది. ప్రస్తుత రెండు పార్టీల వ్యవస్థకు చెక్ పెట్టాలని మస్క్ యోచన. తన ఆలోచనకు అమెరికన్ ప్రజల అంతరాంతరాలలో ఉన్న అభిప్రాయాలు కలిసి రాజకీయ పునరేకీకరణ జరుగుతుందని ఆయన నమ్మిక.


రుణనియంత్రణ, సైన్యం ఆధునీకరణ, కృత్రిమ మేధలో ప్రపంచం గర్వించే విధంగా అమెరికాను తీర్చిదిద్దడమే అమరికా పార్టీలక్ష్యంగా ప్రకటించడం విశేషం. ఏ ఉద్దేశ్యంతో మస్క్‌పార్టీ పెట్టినా ఇప్పుడు నేరుగా జరుపుతున్న యుద్ధం శ్వేత సౌధాధిపతి డోనాల్డ్ ట్రంప్ పైనే! మస్క్‌కు అమెరికా అధ్యక్షుడవ్వాలన్న కోరికా లేదు. అమెరికన్ కానందున ఆ అవకాశమూ లేదు. దేశీయ వ్యయ ప్రణాళికపై మస్క్ మాజీ మద్దతుదారు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో విడిపోయిన తర్వాత పార్టీ నిర్ణయం జరిగింది. పెరిగిన జాతీయ రుణం గురించిన ఆందోళన కారణంగానే మస్క్ ట్రంప్‌ను వ్యతిరేకించాడు. అయితే ట్రంప్ ఆలోచనలు వెర్రితలలు వేసి మస్క్ పీకల మీదకు తెచ్చాడు. ట్రంప్ ప్రణాళిక అంతా మస్క్ వ్యాపారాలను దెబ్బతీయడానికేనా అన్నట్లు తయారయ్యింది. చివరకు మస్క్‌కు అమెరికాలో నిలువ నీడలేకుండా తమ దేశాన్నుంచితరిమి కొట్టడానికి కూడా ట్రంప్ సాగిస్తున్నాడు. అంతటిస్థాయిలో వారిద్దరి మధ్య విబేధాలు పొడసూపాయి. రాబోయే ఎన్నికలలో మస్క్ పార్టీ గణనీయమైన పాత్ర పోషించే అవకాశాన్ని కాదనలేం. అమెరికన్ల ఆకాంక్షలను తీర్చాలన్న కృత నిశ్చయం కనపడుతోంది. కానీ కొత్తపార్టీ ఆవిర్భావం ఇప్పటికిప్పుడు చెప్పుకోదగిన ప్రభావం చూపకపోయినా రానురాను ట్రంప్ పాలనపై వ్యతిరేకపవనాలు ఏర్పడడానికి ఒక కారణం కావచ్చు. అంటే అమెరికా రాజకీయాల్లో ఎంతో కొంత అస్థిరతను తీసుకురాగలదు. ఈ పార్టీ నిర్దిష్ట సెనేట్ సీట్లు, హౌస్ జిల్లాలపై దృష్టి పెట్టవచ్చని, 23సెనేట్ సీట్లు, 810 హౌస్ జిల్లాలను లక్ష్యంగా చేసుకోవచ్చని మస్క్ ఇప్పటికే సూచించారు. ముందు ముందు చట్టాలను నిలువరించడంలో ఈ సీట్లు ఘననీయమైన ప్రభావం చూపగలరు. 'అమెరికాయే ఫస్ట్' అనే ఏకైక నినాదంతో ట్రంప్ కొత్త కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్ళడం మంచిదే కావచ్చు. కానీ ట్రంప్ దూకుడు, మొండితనం తో తీసుకుంటున్న నిర్ణయాలు మాత్రం అమెరికాయేతర దేశాలకు ముఖ్యంగా భారత దేశానికి చేటు తెచ్చే స్థాయికి చేరింది. ఇవి ఏ మేరకు అమెరికాకు మేలు చేస్తాయో కొంత కాలం వేచి చూడాల్సిందే! సంపన్నులకు ప్రయోజనాలు కల్పించడమే కాదు వృద్ధులకిచ్చే రాయితీల్లో కోత ట్రంప్ బిల్లులో విమర్శల నెదుర్కొంటోంది. మెడ్ ఎయిడ్ ప్రయోజనాల్లో కోత కూడా ప్రజలు హర్షించడం లేదు. పైగా ఈ బిల్లులో అమెరికా ఆర్థిక దివాళా కోరుతనాన్ని కనిపిస్తోంది. స్థూల జాతీయోత్పత్తిలో అమెరికా ప్రపంచంలోనే దేశంగా వెలుగొందుతున్న అమెరికా ఆర్థిక ప్రగతి లో ఏమాత్రం వెనుకబాటుతనం లేదు. కానీ కొత్త' వన్ బిగ్ బిల్లు' చలామణీలోకి వస్తే అమెరికాను అంధకారం లోకి తోసేస్తుందని ఎలాన్ మస్క్ చెప్పిన గతే పట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదు!

జీవితానికి విశ్వాసం పునాదిలా ఉండాలి. విశ్వాసం లేకుండా ఏ పని చేసినా వ్యర్థమే.



జి.ముర్రే

ఇతరులలో మంచిచూడలేకపోవడం, మనలో మంచితనం లేకపోవడాన్నే సూచిస్తుంది.



సోక్రటీస్

# ప్రజావాక్కు



### పిల్లలను ఆటలాడిద్దాం

క్రీడలు కేవలం ఉల్లాసానికే కాదుమానసిక వికాసం, శారీరక బలానికి ఎంతో అవసరం. తల్లిదండ్రులు తమ పిల్లల బాల్యాన్ని ఆటలకు దూరం చేస్తున్నారు. వసతులు లేమి, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లకొరత, పాఠశాలల్లో పోటీతత్వం ఇందుకు కారణాలుగా నిలుస్తున్నాయి. పాఠశాల స్థాయి నుంచి చదువులపై ఒత్తిడి అధికమవుతుంది. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు క్లాసులే క్లాసులు. అదనపు బోధనతో వారి విరామ సమయాన్ని ఉపాధ్యాయులు లాగేసుకుంటున్నారు. దొరికిన కాస్త విరామ సమయం స్మార్ట్‌ఫోన్లు ఆకర్షిస్తున్నాయి. ఈ ప్రతికూలతలు పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. ప్రతిపాఠశాలలోవ్యాయామ ఉపాధ్యాయులు నియామకం చేసి క్రీడాపరికరాలు అందజేయాలి.

- చల్లా చంద్రశేఖర్ రెడ్డి, కలువాయి, నెల్లూరు జిల్లా

### టైమ్ బోర్డును ఏర్పాటు చేయాలి

పల్లె నుండి పట్నం వరకు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రతి బస్సు ప్రయాణ మార్గంలో ఉన్న ప్రతి విద్యాసంస్థ వద్ద బస్సు ఆగేవిధంగా ప్రభుత్వం కృషి చేయాలి. విద్యార్థులు, ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ స్టాఫ్, బస్సులలో ప్రయాణం చేయడం జరుగుతుంది. ప్రతి విద్యా సంస్థ వద్ద రిక్వెస్ట్ బస్సు స్టాఫ్ ఏర్పాటు కూడా చేయాలి. అవసరమైన చోట బస్ షెల్టర్ కూడా ఏర్పాటు చేయాలి. బస్సుల సమయ పాలన సూపించే బోర్డు కూడా ఏర్పాటు చేయాలి. విద్యార్థులకు, సిబ్బందికి రాయితీ బస్సు పాసులు జారీ చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్ జిల్లా

### హామీలను నెరవేర్చాలి

ఎన్నికల సమయంలో వివిధ పార్టీలు మానిఫెస్టోలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం తప్పక నెరవేర్చాలి. ఎన్నికల సమయంలో మానిఫెస్టోను ఎన్నికల సంఘం నిర్ధారించాలి. హామీలు నెరవేర్చేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి. హామీలు నెరవేర్చని ప్రభుత్వం పార్టీ గుర్తింపును రద్దు చేయాలి. అలాగే ప్రభుత్వం ఏర్పడ్డాక బడ్జెట్ నిధులను ప్రజలకు చేరువయ్యేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం పారదర్శకంగా పని చేయాలి.

- డి. చాంద్ బాషా, కర్నూలు

### మెట్రో స్టేషన్లలో పబ్జీ ఆటలు

హైదరాబాద్‌లోని వివిధ మెట్రో స్టేషన్‌లలో మెట్ల దగ్గర యువత గుంపులుగా చేరి సెల్‌ఫోన్‌లో పేకాట, పబ్జీ లాంటి ఆటలు ఆడి చెడు మార్గంలో పయనిస్తున్నారు. మెట్రో ప్రయాణికులకు దారి ఇవ్వకుండా మెట్ల మీద కూర్చొని ధూమపానం, గంజాయి సేవిస్తున్నారు. సికింద్రాబాద్, కూకట్‌పల్లి మెట్రో స్టేషన్‌లలో వీరి ఆగడాలు శృతి మించి పోతున్నాయి. అమ్మాయిలను కూడా ర్యాగింగ్ చేస్తూ వికృత ఆనందం పొందుతూ వున్నారు. కాలేజీలకు వెళ్లి చదువుకోకుండా మెట్రో స్టేషన్‌లలో టైంపాస్ చేస్తూ వున్నారు. పోలీసుల నిఘా లేకపోవడం వల్ల వీరి ఆగడాలకు అంతులేదు. పోలీసు శాఖ మెట్రో అధికారులు స్పందించి వీరి ఆగడాలకు కళ్లెం వేయాలి.

-కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### ప్రపంచ శాంతికి పాటుపడాలి

క్వాడ్ ఇటీవల ఒకస్పష్టమైన వైఖరిని తీసుకుంటున్నట్లు తోస్తుంది. అది చైనాకి వ్యతిరేకంగా అని మాత్రమే చెప్పవచ్చు. దాని వైఖరి మూలంగానే ఇండో పసిఫిక్ అని అమెరికా తన వాణిజ్య సంబంధాలను మార్చుకుంది. అయితే ఇదేమి కాకతాలీయం కాకపోగా ఇప్పుడు కనపడుతున్న నిజమైన దృశ్యం. ఇకపోతే కోవిడ్ దరిమిలా చైనా తనఉత్పత్తి వ్యవస్థలు అతలాకుతలమయ్యాయి. తద్వారా తన ఆర్థిక వ్యవస్థకు తీరని నష్టం వాటిల్లింది. కానీ తిరిగి పుంజుకొని పాకిస్థాన్ వంటి దేశాల సహాయంతో అది తన ఆధిపత్యం చూపించాలి అనుకుంటుంది. ఇక్కడే భారత్ వంటి దేశాలు తమ అస్తిత్వం కాపాడుకుంటూనే ప్రపంచ శాంతికి సామరస్యాన్ని కాపడవలసి ఉంది.

- భారత అవినాష్, జనగామ

### లింగ సమానత్వం ఆందోళనకరం

మన జనాలకు ముఖ్యగా తెలుగు జనాలకు యాక్టర్ల పిచ్చి, సినిమాల పిచ్చి, ఫోటోల పిచ్చి చాలా ఎక్కువే. అటు పెళ్ళి మర్యాదలైన, ఇటు చామత్కారాలైన అతి కొంచెం కనపడుతూ వుంటుంది. అంలాటి సందర్భంగానే మొన్న శ్రీచాగంటి వారు అనుభవించింది. ప్రవచన కారులను పిలిచి, వారి ప్రవచనాలు విని ఆనందించే సమయములో, అదియును శ్రీ రోశయ్య గారి స్మరణ సభలో. ఫోటోల కోసం అర్రులు చాపే పెద్దలకు కొంచెమైనా ఆలోచన ఉండాలి. అందుకే అయన సుత్తిమెత్తగా మొట్టికాయలు వేశారు. దీన్ని కొందరు పెద్దలు, మీడియా 'ప్రవచనకర్తలఅసహనం'అంటూస్టేట్మెంట్‌లుఇవ్వడం మానుకోవాలి.

-గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)


# ఉపాధి నైపుణ్యావకాశాలకు కొత్త ఊపిరి

**మొత్తం బడ్జెట్ రూ.99,446 కోట్లు. ఈ మొత్తం బడ్జెట్ కేటాయింపు పథక మొత్తం కార్యాచరణ కాలానికి అంటే 2025 ఆగస్టు 1 నుండి 2027 జూలై 31 వరకు ఉత్పాదక రంగానికి విస్తరించిన ప్రయోజనాలతో సహా సంబం ధించినది. ఇది పూర్తిగా కేంద్ర బడ్జెట్ నుండి నిధులు పొందుతుంది. ఈ మొత్తం కేటాయింపు పథక పూర్తి కాలానికి సంబంధించినది, ప్రత్యేకంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి మాత్రమే కాదు అని అర్థం చేసుకోవడం ముఖ్యం. ఈ మొత్తం నుండి సంవత్సరాల వారీగా నిధుల పంపిణీ పథక వాస్తవ స్వీకరణ సృష్టించబడిన ఉద్యోగాల సంఖ్యపై ఆధారపడి ఉంటుంది. దీనికి స్పష్టమైన లక్ష్యాలు, నిర్దిష్టమైన అమలు పద్ధతులు, ప్రత్యేకమైన లక్షిత వర్గాలు ఉన్నాయి. ప్రధాన లక్ష్యాలు ఏమిటంటే 2025 ఆగస్టు 1 నుండి 2027 జూలై 31 వరకు రెండు సంవత్సరాల కాలంలో దేశవ్యాప్తంగా 3.5 కోట్ల ఉద్యోగాలను సృష్టించడానికి ప్రోత్సాహాన్ని అందించడం. మరొక ముఖ్యమైన లక్ష్యం, కార్మికులను అధికారిక రంగంలోకి తీసుకురావడం.**

భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మక కార్యక్రమాలలో ఉద్యోగ అనుసంధాన ప్రోత్సాహక పథకం ఒకటి. ఇది కేంద్ర బడ్జెట్ 2024-25లో 4.1 కోట్ల యువతకు ఉపాధి, నైపుణ్య అవకాశాలను సులభతరం చేయడానికి ఉద్దేశించిన ఐదు పథకాల మెగా ప్యాకేజీలో భాగంగా అధికారికంగా ప్రకటించారు. గతంలో వివిధ ఉపాధికల్పన ప్రోత్సాహక పథకాలు (మహమ్మారి సమయంలో ఆత్మ నిర్భర్ భారత్ రోజ్‌గార్ యోజన వంటివి) ఉన్నప్పటికీ ఈ పథకం దీర్ఘకాలిక ఉద్యోగ కల్పన, అధికారికీకరణ, కొత్త ఉద్యోగులకు వారి యజమానులకు ప్రత్యక్ష మద్దతుపై ప్రత్యేక దృష్టి సారించిన ఒక విన్నూత్న కార్యక్రమం. ముఖ్యంగా ఉత్పాదక రంగానికి బలమైన ప్రాధాన్యత ఇస్తుంది. కేంద్ర మంత్రి వర్గం ఈ పథకాన్ని 2025 జూలై 1న ఆమోదించి బడ్జెట్ 2024-25లో ప్రకటించినప్పటికీ ప్రయోజనాలకు అర్హత, వాస్తవ అమలు 2025 ఆగస్టు 1 నుండి ప్రారంభమవుతుంది. ఈపథకం ప్రయో జనాలు 2025 ఆగస్టు 1 నుండి 2027 జూలై 31 మధ్య సృష్టించబడిన ఉద్యోగాలకు వర్తిస్తాయి. మొత్తం బడ్జెట్ రూ.99,446 కోట్లు. ఈ మొత్తం బడ్జెట్ కేటాయింపు పథక మొత్తం కార్యాచరణ కాలానికి అంటే 2025 ఆగస్టు 1 నుండి 2027 జూలై 31 వరకు ఉత్పా దక రంగానికి విస్తరించిన ప్రయోజనాలతో సహా సంబం ధించినది. ఇది పూర్తిగా కేంద్ర బడ్జెట్ నుండి నిధులు సమకూరుస్తుంది. ఈ మొత్తం కేటాయింపు పథక పూర్తి కాలానికి సంబంధించినది, ప్రత్యేకంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి మాత్రమే కాదు అని అర్థం చేసుకోవడం ముఖ్యం. ఈ మొత్తం నుండి సంవత్సరాల వారీగా నిధుల పంపిణీ పథక వాస్తవ స్వీకరణ సృష్టించబడిన ఉద్యోగాల సంఖ్యపై ఆధారపడి ఉంటుంది. దీనికి స్పష్టమైన లక్ష్యాలు, నిర్దిష్టమైన అమలు పద్ధతులు, ప్రత్యేకమైన లక్షిత వర్గాలు ఉన్నాయి. ప్రధాన లక్ష్యాలు ఏమిటంటే 2025 ఆగస్టు 1 నుండి 2027 జూలై 31 వరకు రెండు సంవత్సరాల కాలంలో దేశవ్యాప్తంగా 3.5 కోట్ల ఉద్యోగాలను సృష్టించడానికి ప్రోత్సాహాన్ని అందించడం. మరొక ముఖ్యమైన లక్ష్యం, కార్మికులను అధికారిక రంగంలోకి తీసుకురావడం. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ రిజిస్ట్రేషన్‌తో ప్రయోజనాలను అనుసంధానించడం ద్వారా వారికి సామాజిక భద్రతా ప్రయోజనాలను అందించడం. ఈ పథకం, కొత్త

డి జె మోహన రావు

ఉద్యోగులు అధికారిక శ్రామిక శక్తిలో చేరడానికి యజమానులు అదనపు, స్థిరమైన ఉద్యోగాలను సృష్టించడానికి ఆర్థిక సహాయం అందిస్తూ తద్వారా ఉద్యోగ సామర్థ్యాన్ని, సామాజిక భద్రతను పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది. దీనితో పాటు ఉత్పాదక రంగంలో ఉద్యోగ కల్పనకు ప్రత్యేక ప్రోత్సాహాన్ని ఇవ్వడం ద్వారా ఈ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. మొదటిసారి అధికారిక రంగంలోకి ప్రవేశించే యువకులకు ప్రత్యక్ష ఆర్థిక సహాయం అందించడమంటే వారి జీవనోపాధి స్వర్గతుల్యం చేయడమే.




ఈ ప్రతిష్టాత్మక లక్ష్యాలను సాధించడానికి పథకాన్ని రెండు విభిన్న భాగాలుంటే, వారిలో ప్రథమ భాగం తొలిసారి ఉద్యోగంలో చేరే వారికి ప్రోత్సాహకాలు అందించడంపై దృష్టి సారిస్తుంది. ఇందులో అధికారిక శ్రామిక శక్తిలో చేరి ఈపీ ఎఫ్ఓలో నమోదు చేసుకున్న మొదటిసారి ఉద్యోగులను గుర్తిస్తారు. అర్హత కోసం, ఉద్యోగులు నెలకు రూ. 1 లక్ష వరకు సంపాదించాలి. ప్రోత్సాహకం రెండు వాయిదాలలో పంపిణీ చేస్తారు. మొదటి వాయిదా, ఒక నెల ఈపీఎఫ్ వేతనానికి సమానం (గరిష్టంగా రూ. 15,000) ఆరు నెలల సేవ తర్వాత అందించబడు తుంది. రెండవ వాయిదా 12 నెలల సేవ తర్వాత ఉద్యోగి ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత విడుదల చేస్తారు. ఈ భాగం కింద అన్ని చెల్లింపులు లబ్ధిదారుడి పాన్ అనుసంధానిత ఖాతాకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా చేస్తారు. కొత్తగా చేరే వారిలో పొదుపును ప్రోత్సహించడానికి ప్రోత్సాహ కంలో కొంత భాగం నిర్ణీత వ్యవధికి తర్వాత నిలిపివేస్తారు. ద్వితీయ భాగం యజమానులకు ముఖ్యమైన సహాయాన్ని అందిస్తుంది. అర్హత పొందడానికి, యజమానులు ఈపీఎఫ్ఓలో నమోదు చేసుకుని అదనపు స్థిరమైన ఉద్యో గాలను సృష్టించినట్లు నిరూపించాలి. 50 మంది కంటే తక్కువ ఉద్యోగులు ఉన్న చిన్న సంస్థల కోసం, కనీసం ఇద్దరు అదనపు ఉద్యోగులను కనీసం ఆరు నెలల పాటు నిరంతరంగా నియమించుకోవాలి. 50 లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న పెద్ద సంస్థలు, అదే వ్యవధిలో కనీసం ఐదుగురు అదనపు ఉద్యోగులను నియమించుకోవాలి. యజమానులకు అందించే ప్రోత్సాహకం కొత్త ఉద్యోగులకు నెలకు రూ. 1 లక్ష వరకు జీతం ఉన్న వారికి వర్తిస్తుంది. యజమానులు అదనపు ఉద్యోగికి నెలవారీ ఆర్థిక సహాయాన్ని పొందుతారు. ఇది ఉద్యోగి ఈపీఎఫ్ వేతనం స్లాబ్‌పై ఆధారపడి ఉంటుంది. 10,000 రూపాయల వరకు వేతనాలకు రూ. 1,000, 10,000 రూపాయల నుండి 20,000 రూపాయల వరకు వేతనాలకు 2,000 రూపాయల, 20,000 రూపాయల నుండి 1 లక్ష రూపాయల వరకు వేతనాలకు 3,000 రూపాయల. ఈ ప్రోత్సాహకం చాలా రంగాలలో ప్రతి అదనపు ఉద్యోగికి రెండు సంవత్సరాల వరకు వర్తిస్తుంది. అయితే ఉత్పాదక రంగంలోమాత్రం ఇది మూడవ, నాల్గవ సంవత్సరాలకు కూడా కొనసాగిస్తారు. ఈ చెల్లింపులు కూడా యజమానుల పాన్ అనుసంధానిత ఖాతాలకు నేరుగా బదిలీ చేయబడతాయి. ఈ పథకం వ్యూహాత్మకంగా రెండు ప్రధాన వర్గాలను లక్ష్యంగా చేసుకుంది. ముఖ్యంగా అధికారిక శ్రామిక శక్తిలో ప్రవేశించి ఈపీఎఫ్ఓలో నమోదు చేసుకున్న వ్యక్తులకు. ఈ విభాగంలో సుమారు 1.92 కోట్ల మంది లబ్ధి పొందుతారని అంచనా. రెండవది ఇది యజమానులను లక్ష్యంగా చేసు కుంది. ముఖ్యంగా ఉత్పాదక రంగంలో ఉన్న వారితో సహా అన్ని రంగాలలో ఉన్న వారిని. వీరు ఈపీఎఫ్ఓలో నమో దు చేసుకుని, కొత్త సిబ్బందిని నియమించుకోవడం, నిలుపుకోవడం ద్వారా అదనపు ఉద్యోగాలను సృష్టించే వ్యాపారాలు, సంస్థలు. ఈ యజమాని ప్రోత్సాహకాల ద్వారా సుమారు 2.6 కోట్ల ఉద్యోగాలను సృష్టించడానికి ప్రోత్సాహం లభిస్తుందని పథకం ఆశిస్తోంది. ●

# జనగణన సమాజ నిర్మాణానికి పునాది

వెంకటరమణ గిలకత్తుల

ప్రతి సమాజ అభివృద్ధికి గణాంకాలు ముఖ్యఆధారాలు. ప్రజల జనాభా, వయస్సు, లింగ నిష్పత్తి, విద్యాస్థాయి, ఉపాధి, నివాస పరిస్థితులు వంటి అంశాలపై సమగ్ర సమాచారం లేకుండా పాలనా ప్రణాళికలు రూపుదిద్దుకోలేవు. ఈ నేపథ్యంలో జనగణన అనేది దేశంలోని ప్రతి పౌరుడిని లెక్కించి, వారి వివరాలు సేకరించే సమగ్ర, శాస్త్రీయ ప్రక్రియగా నిలుస్తుంది. ఇది ప్రజల సంక్షేమానికి, అభివృద్ధి లక్ష్యాల సాధనకు, పారదర్శక పాలనకు ముఖ్యమైన ఆధారంగా మారుతుంది. భారతదేశంలో ఈ ప్రక్రియను హోం మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని రిజిస్ట్రార్ జనరల్ సెన్సస్ కమిషనర్ కార్యాలయం నిర్వహిస్తుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సేకరించిన వ్యక్తిగత సమాచారం గోప్యతతో నిర్వహించబడుతుంది. జనగణన అనేది ఒక దేశం లేదా ప్రాంతంలో నివసించే ప్రజల గణాంకాలను ఒకే సమయంలో, అధికారికంగా, సులభ పద్ధతిలో సేకరించే వ్యవస్థ. భారతదేశంలో మొట్టమొదటి అధికారిక జనగణన 1872లో లార్డ్ మాయో పాలనలో ప్రారంభమైంది. ఆపై 1948 జనాభా గణనచట్టం ప్రకారం ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జనగణన నిర్వహించడం చారిత్రక సంప్రదాయంగా మారింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 82 ప్రకారం, ప్రతి జనగణన అనంతరం పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) చట్టాన్ని అమలు చేస్తుంది. ఈ డేటా దేశ జనాభాలోని సామాజిక, ఆర్థిక, ప్రాంతీయ, వృత్తిపరమైన మార్పులను ప్రతిబింబిస్తుంది. స్వీయ లిఖిత ఫారాలు (ఆన్‌లైన్ లేదా పోస్టు), ఇంటింటి గృహాల సర్వేలు, అధికారిక పన్ను, ఓటరు రికార్డుల ఆధారంగా సమాచారం సేకరణ జరుగుతుంది. డీ ఫాక్టో పద్ధతిలో వ్యక్తి జనగణన రోజున ఎక్కడ ఉంటే అక్కడ లెక్కింపు జరుగుతుంది. డీ జ్యూర్ పద్ధతిలో సాధారణ నివాస స్థలాన్ని ఆధారంగా తీసుకుంటారు. ఆధునిక పద్ధతులైన మ్యాపింగ్, రిమోట్ సెన్సింగ్, డిజిటల్ డేటా ప్లాట్‌ఫామ్‌లు లెక్కింపును వేగ





వంతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇవి సమాచారాన్ని ఖచ్చితంగా, సమగ్రంగా సేకరించేందుకు మార్గం వేస్తాయి. జనగణన ద్వారా ప్రభుత్వం ప్రజల అవసరాలను అంచనా వేసి విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, పారిశ్రామికీకరణ వంటి రంగాల్లో సంక్షేమ పథకాలను రూపొందించగలుగుతుంది. రాష్ట్రాల సరిహద్దులు, నియోజకవర్గాల పునర్విభజన, రిజర్వేషన్ల సవరణ వంటి రాజకీయ నిర్మాణాలకు ఇది బేస్‌లైన్‌గా ఉపయోగపడుతుంది. అలాగే, ఆర్థిక సంఘం రాష్ట్రాలకు మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన నిధుల కేటాయింపు కూడా జనగణన డేటాపైనే ఆధారపడుతుంది. అంతేకాక, అంతర్జాతీయ ప్రమాణాలు, గ్లోబల్ డెవలప్‌మెంట్ ఇండెక్సులు రూపొందించడంలో ఈ గణాంకాల పాత్ర కీలకం. జనగణన ఒక శాస్త్రీయ ప్రక్రియ అయినప్పటికీ, దానిని అమలు చేయడంలో పలు సవాళ్లు ఎదురవుతాయి. వ్యక్తిగత గోప్యత, డేటా భద్రత అత్యంత ప్రాముఖ్యం. వలసదారులు, నిరాశ్రయులు, గిరిజనులు, కొండ, లోయ ప్రాంతాల్లో ఉన్న వర్గాలను లెక్కించడంలో ప్రత్యేక చర్యలు అవసరం. కోవిడ్ వంటి మహమ్మారి పరిస్థితులు జనగణన ప్రక్రియను అంతరాయం కలిగించగలవు. అపోహలు, తప్పుడు సమాచారాలవంటి సమస్యలకు పరిష్కారంగా ప్రజల్లో అవగాహన పెంపు, మీడియా, విబివీలు, ప్రజాపాలకులతో సమన్వయం అవసరం. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పారదర్శకత, వేగం, ఖచ్చితత్వం మెరుగుపరచవచ్చు. జనగణన అనేది కేవలం గణాంక లెక్కింపే కాదు ఇది దేశఅభివృద్ధికి మార్గదర్శి, ప్రజాస్వామ్యానికి పరిపూర్ణ నాంది. ఇది సమాజంలోని మార్పులను అర్థం చేసుకోవడంలో, పాలనను ప్రజల అవసరాలకు అనుగుణంగా మార్చడంలో కేంద్ర బిందువుగా నిలుస్తుంది. ఆధునిక సాంకేతికతతో, చట్టపరమైన భద్రతతో, ప్రజల భాగస్వామ్యంతో కూడిన సమగ్ర జనగణన దిశగా భారత దేశం పురోగమించాలి. ఎందుకంటే గణాంకాలు లేని అభివృద్ధి అనేది దిశా రహిత ప్రయాణం. ఈ ప్రక్రియలో ప్రతి పౌరుడు చురుకైన భాగస్వామిగా ఉండాలి. ●

# అన్నదాతల ఆత్మహత్యలు ఇంకెంతకాలం?



డా॥ ఎ. నాగరాజ నాయుడు

నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలో రైతులు లాభంలోఉన్నారా? వారు చేసే వ్యవసాయం లాభార్జనతో ఉన్నదా? దేశంలో రైతాంగానికి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కావాల్సింది ఏమిటి? ఒకటి వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం తద్వారా రైతు ఆదాయాన్ని పెంచడం. స్వాతంత్ర్యం అనంతరం దేశంలో 500 శాతం వ్యవసాయ ఉత్పత్తులు పెరిగినాయి. రెండవది వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర అమలు చేయడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం. ఇక్కడనే మన రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అనేక దశాబ్దాల వెనక్కి తిరిగి చూసుకుంటే హరిత విప్లవం ద్వారా దేశంలో వ్యవసాయ ఉత్పత్తి భారీగా పెరిగినప్పటికీ వ్యవసాయదారుల స్థితిగతులు మాత్రం రానురాను దిగజారిపోతున్నాయి. రైతుకు గనుక స్వామినాథం కమిటీ సూచన తరహాలో గిట్టుబాటు ధర ఇస్తే అది వినియోగదారుల ధరల పెరుగుదల రూపంలో భారం అవుతుందనేది ప్రభుత్వ విధానం. అయితే అసలు సమస్య వినియోగదారులది కాదు. కార్పొరేట్ యాజమాన్యాలది. ఎలాగంటే రైతాంగానికి కనీసం మద్దతు ధర ఇవ్వడం వల్ల నగర ప్రాంతాల్లో వినియోగదారులకు ధరలు పెరగాయనుకుందాం. ఈ వినియోగదారుల్లో అత్యధికులు కార్మికులు ఉద్యోగులే ఉంటారు. వీరి ధరల భారాన్ని భరించలేక తమ యాజమాన్యాలను అధిక వేతనాల కోసం డిమాండ్ చేస్తారు. అది అసలు కథ అంటే రైతుకు మద్దతు ధర ఇవ్వడం వల్ల ఉద్యోగాలు కార్మికులు అధిక వేతనాల కోసం కార్పొరేటర యాజమాన్యం మీద ఒత్తిడి తెస్తారు. కార్పొరేట్లకు ఇబ్బంది కలుగుతుంది. కాబట్టే ప్రభుత్వం మద్దతు ధరలకు సుముఖంగా లేదు. కార్మికులను ఉద్యోగులను సాధ్యమైనంత తక్కువ వేతనాలతో పని చేయించుకోవడం కార్పొరేట్ల స్వభావం. లాభాలను పెంచుకోవడం కోసం వారికి ఇది అవసరం. దీనికోసం నగర ప్రాంతాల్లో నిత్యవసరాల ధరలు సాధ్యమైనంత తక్కువ ఉండటం కూడా వారికి అవసరం. ఇందుకోసమే కార్పొరేట్ అనుకూల ప్రభుత్వాలు రైతు ప్రయోజనాలను ఆర్థిక స్థితిగతులను పక్కనపెట్టి వారి ఉత్పత్తులను తక్కువ ధరలకు నగరాలకు తరలిస్తున్నాయి. నేడు అమలు జరుగుతున్న ప్రభుత్వ రైతు విధానాల సారాంశం ఇదే. గ్రామాలను కొట్టి నగరాలకు పెట్టడమే. నగరాలకు పెట్టడం అంటే అంతిమంగా నగర ప్రాంత కార్పొరేట్లకు దోచి పెట్టడమే. ఈ క్రమంలో గత మూడు దశాబ్దాలుగా రైతులు నష్టపోతూనే ఉన్నారు. వ్యవసాయ రంగంలో బతకడం కష్టమైతేనే రైతు వలసకూలీగా మారి నగర బాటపడతాడు. కార్పొరేట్లకూ కావాల్సింది ఇదే. నగరాలలో మానవ వనరుల సరఫరా అధికంగా ఉండాలి. అంటేనే ఉపాధి కోసం పోటీ పెరుగుతుంది. అలా పెరిగితేనే ఉద్యోగాలకు ఇచ్చే వేతనాలను తగ్గించే అవకాశం కార్పొరేటర్లుకూ కలుగుతుంది. నేడు



దేశంలో జరుగుతున్న ఆర్థిభివృద్ధి చాలా మటుకు పట్టణ సేవారంగ ఆధారితమైంది. 45 శాతం మంది భారతీయులకు వ్యవసాయం ఉపాధి కల్పిస్తున్నప్పటికీ జిడిపిలో వ్యవసాయ రంగవాటా కేవలం 15శాతమే. అందువలనవ్యవసాయదారుల ఆదాయాలు అత్యల్ప స్థాయిలో ఉన్నాయి. 55 శాతం రైతు కుటుంబాలు అప్పుల బాధతో ఉన్నాయని 2021-22లో నాబార్డ్ తెలియజేసింది. వ్యవసాయ కుటుంబాల సగటు రుణభారం 91231 రూపాయలని 2025లో ప్రభుత్వ నివేదికలు తెలియజేస్తున్నాయి. 13.08 కోట్లమంది రైతులు వాణిజ్య బ్యాంకులకు రూ.2767346 కోట్లు బకాయిలు చెల్లించాలి. సహకార బ్యాంకులకు 3.34కోట్ల రైతులు రూ.2,65,419 కోట్లు బకాయిలు ఉన్నారు. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు 2.31కోట్ల మంది రైతులు రూ. 3,19,881 కోట్లు బకాయిలు పడ్డారు. ఇలా రైతు కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ప్రధానమంత్రి కిసాన్ యోజన్ లబ్ధిపొందే రైతులు 2022లో 10.47 కోట్ల మంది కాగా 2023 వాటికి 8.1కోటికి తగ్గిపోయారు. 2025నాటికి 9.85కోట్ల మంది లబ్ధిపొందారని ప్రభుత్వ లెక్కలు తెలియజేస్తున్నాయి. ఇలా రైతుకు అందుతున్న సహాయాలు మాత్రం తగ్గిపోతున్నాయి. ఫలితంగా రైతులకు ఆత్మహత్యలే శరణమయ్యాయి. 2014 నుంచి 2022 వరకు 100474 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో ప్రకారం గత దశాబ్ద కాలంలో 112000 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం దీనిని పాలకులు పట్టించుకోకపోవడం అత్యంత దయనీయమైన పరిస్థితి. ధరల యంత్రాంగాన్ని ఎవరు నియంత్రిస్తారుకార్పొరేట్లు అంటే కార్పొరేట్ల చేతుల్లో రైతులు చావు దెబ్బతింటున్నా పాలకులు కార్పొరేట్‌ల జోలికిపోరు. రైతుల ఉత్పత్తులకు మద్దతు ధర లభించకపోవడంతో1990-91 లో వ్యవసాయ రంగం వాటా జిడిపిలో 35శాతం కాగా 2022-23లో 15 శాతానికి పడిపోయింది. వ్యవసాయ రంగంపై ఆధారపడిన శ్రామిక జనాభా మాత్రం 60 శాతానికి తగ్గలేదు. ఆర్థిక అభివృద్ధి జరిగేటప్పుడు శ్రామికజనాభా సాధారణంగా వ్యవసాయ రంగం నుంచి ముందుగా పారిశ్రామిక రంగం వైపు, తరువాత సేవల రంగం వైపు బదిలీ జరగాలి. అలా జరగడం లేదు. ఇది ఆర్థిక అభివృద్ధి ప్రక్రియ కాదు. ప్రభుత్వ నియంత్రణ లేనందువలన ఉత్పత్తి ఉద్యోగిత వస్తు ఉత్పత్తి మార్కెట్ కార్పొరేట్ రంగ నియంత్రణలో ఉన్నందువలన ఉత్పత్తి ప్రక్రియ అంతా కార్పొరేటర్ల లాభాల కోసమే ఇలా జరుగుతున్నది. కరోనా కాలంలో మన రైతులు వారి ఉత్పత్తులను ప్రపంచంలో నూరు దేశాలకు పైగా పంపించి సహాయపడినారు. ప్రధానమంత్రి అనేక సందర్భాల్లో దేశంలోని రైతులను ప్రశంసించినప్పటికీ తమ పంటలకు హామీ ధరలు ఉండాలని దీర్ఘకాలంగా రైతులు చేస్తున్న డిమాండ్నుమాత్రం పట్టించుకోలేదు. వ్యవసాయ రాయితీలను అందించడంలో చైనా అగ్రస్థానంలో ఉంది. భారతదేశం మాత్రం వ్యవసాయ మార్కెట్ శక్తుల దయాదాక్షిణ్యాలకు రైతులను వదిలేసింది. ప్రపంచవాణిజ్య సంస్థ ఒప్పందాల ప్రకారం మనవ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతులకు ఆటంకం ఏర్పడుచున్నది. ఎటు చూసినా సరళీకృత ఆర్థికవిధానాల వలన మార్కెట్ శక్తులు మాత్రమే లాభపడుతున్నారు. రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వాలని చట్టబద్ధత కల్పించాలని రైతులు అడుగుతున్నా కేంద్రప్రభుత్వం ససేమిరా ఒప్పుకోవడం లేదు. కనీసమద్దతు ధర చట్టబద్ధత కోసం ఎంతోమంది రైతులు ప్రాణత్యాగం కూడా చేశారు. గతమూడు దశాబ్దాలలో మూడు లక్షలమంది రైతులు ఆత్మహత్యచేసుకోవడం ఎవరిపాపం? మనది నాలుగవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థ అయినప్పటికీ దేశానికి అన్నం పెట్టే రైతు పరిస్థితి మాత్రం దయనీయంగా ఉంది. ●

# గుంటూరు వార్త

## యంయిడి 4వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జూలై7, ప్రభాతవార్త:** వర్సిటీ పరిధిలో యంయిడి కోర్సు 4వ సెమిస్టర్‌కు ఏప్రిల్‌లో జరిగిన పరీక్షల ఫలితాలను సిఇ ఆలపాటి శివప్రసాదరావు సోమవారం విడుదల చేశారు. 207మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వారిలో 174మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. అలాగే జనవరిలో జరిగిన ఎంబిఏ ఇంటర్నేషనల్ బిజినెస్ స్టడీస్ మొదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాలను కూడా విడుదల చేశామన్నారు. 53మంది పరీక్షలు రాయగా వారిలో 46మంది ఉత్తీర్ణత సాధించారు. రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకునే వారు ఈనెల14వ తేదీలోగా ఒక్కో పేపర్‌కు రూ.1860 చెల్లించాలన్నారు.

# మిషన్ గ్రీన్ ఏర్పాటుకు చర్యలు : మేయర్ రవీంద్ర

**గుంటూరు తూర్పు, జులై 7 (ప్రభాతవార్త) :** నగరంలో మిషన్ గ్రీన్ ద్వారా గ్రీన్ గుంటూరు ఏర్పాటుకు నగరంలో వీధి వ్యాపారుల క్రమబద్ధీకరణకు స్ట్రీట్ వెండింగ్ జోన్ల ఏర్పాటుపై సోమవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం జరిగింది. నగర మేయర్



కోవెలమూడి రవీంద్ర, కమీషనర్ పులి శ్రీనివాసులు కార్పోరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రానున్న కాలంలో గుంటూరు నగరాన్ని పర్యావరణహిత నగరంగా తీర్చి దిద్దుకోవడానికి నగరంలో విస్తృతంగా మొక్కలు నాటే ప్రక్రియ చేపట్టామని తెలిపారు. వార్డుల వారీగా కార్పోరేటర్లు ద్వారా మొక్కల పంపిణీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. నగరంలో రోడ్లు, డ్రైన్లను ఆక్రమణ చేసుకొని ట్రాఫిక్, పారిశుద్ధ్యానికి ఆటంకంగా ఉన్న వీధి వ్యాపారులతో త్వరలో వెండింగ్ జోన్ల ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఆయా ఆక్రమణలను తొలగించే చర్యలు తీసుకోవాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. అనధికార నిర్మాణాలు, పారిశుద్ధ్య సమస్యలపై కూడా ప్రత్యేక కార్యాచరణ చేపడతామని తెలిపారు.



స్టేట్ హోల్డర్స్, సీనియర్ సిటిజన్స్, ప్రజా ప్రతినిధుల సూచనలు, సలహాల మేరకు త్వరలో నగర సుందరీకరణ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. కమీషనర్ మాట్లాడుతూ ఈ సీజన్‌లో దశల వారీగా 5 లక్షల మొక్కలను నాటి సంరక్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటికే వార్డుల వారీగా మొక్కలు నాటే ప్రక్రియ జరుగుతుందన్నారు. నాటిన మొక్కలను సంరక్షించడానికి జిఎంసితో పాటు నగరంలోని ప్రముఖ సంస్థలు ముందుకు రావాలని కోరారు. నగరంలో ఇప్పటికే అస్తవ్యస్తంగా ఉన్న వీధి వ్యాపారులను చట్ట ప్రకారం వారి హక్కులను భంగం కల్గకుండా క్రమబద్ధీకరణ చేస్తూ 2 ప్రాంతాల్లో వెండింగ్ జోన్ల ఏర్పాటు చేశామన్నారు. జోన్లలో వ్యాపారులకు నిర్దేశించిన మార్గదర్శకాలు పాటించని వారికి గుర్తింపు కార్డులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం మిషన్ గ్రీన్, వెండింగ్ జోన్ల ఏర్పాటుపై స్టేక్ హోల్డర్స్, రేట్ పేయర్స్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పలు సూచనలు, సలహాలు అందించారు. సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఏడిహెచ్ జె.శాంతి, ఎంహెచ్ఓ రామారావు, స్టేక్ హోల్డర్స్, రేట్ పెయర్స్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## అర్జీలను నిర్ధేశిత గడువులోగా పరిష్కరించాలి : కమిషనర్ పులి శ్రీనివాసులు

**గుంటూరు తూర్పు, జులై 7 (ప్రభాతవార్త) :** స్థానిక సమస్యల పరిష్కారం కోస నగరపాలక సంస్థలో చేపట్టే డయల్ యువర్ కమీషనర్, పిజిఆర్ఎస్‌లో ప్రజలు అందించే అర్జీలు, ఇతర సేవలు నిర్ధేశిత గడువులోగా పరిష్కారం చేయాలని నగర కమీషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కమీషనర్ ఛాంబర్‌లో డయల్ యువర్ కమీషనర్, కౌన్సిల్ హాల్లో పిజిఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ తొలుత డయల్‌యువర్ కమీషనర్ ద్వారా ప్రజల నుండి అందిన 30ఫిర్యాదులు తీసుకుని, అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుండి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేరు వేరుగా లిస్టు తయారు చేయాలన్నారు. డయల్ యువర్ కమీషనర్‌కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్ళాలన్నారు. అర్జీల పరిష్కార పురోగతిపై కమీషనర్ ఛాంబర్‌కు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు తీసుకుని కమీషనర్ అధికారులతో మాట్లాడుతూ పిజిఆర్ఎస్, ఇతర వేదికల ద్వారా ప్రజలు ఇస్తున్న అర్జీలను సక్రమంగా పరిష్కారం చేయాలని, ఆయా అర్జీలను ర్యాండమ్‌గా క్షేత్రస్థాయి పరిశీలన చేస్తామన్నారు. అర్జీలు బియండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్ళడానికి వీలు లేదన్నారు. అలా వెళ్ళిన విభాగ సూపరింటెంట్, సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని అదనపు కమీషనర్‌ని ఆదేశించారు. ప్రతి విభాగంలో పిజిఆర్ఎస్, గ్రీవెన్స్, అర్జీల పరిష్కారంపై ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాలన్నారు. అర్జీల పరిష్కారంపై జిఎంసి పిఎంయు బృందం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా పట్టణ



ప్రణాళిక విభాగం 9, ఇంజనీరింగ్ విభాగం 17, రెవెన్యూ విభాగం 6, ప్రజారోగ్య విభాగం 3, ఉపాసెల్ విభాగం 2, అకౌంట్స్ విభాగానికి సంబంధించి 2ఫిర్యాదులు మొత్తం 39ఫిర్యాదులు అందాయన్నారు. కార్యక్రమంలో అదనపు కమీషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమీషనర్ బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా ప్రభుత్వంతోనే సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు క్రైమ్,జూలై 7,ప్రభాతవార్త :** రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వంతోనే సంక్షేమ పథకాలు సాధ్యమని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.స్థానిక 23వ



డివిజన్ లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మాధవి నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డివిజన్‌లో పర్యటించి,ప్రజా సమస్యలు తెలుసుకొని,సంక్షేమ పథకాలు అమలు గురించి వాకబు చేయగా ప్రజలు జగన్ ప్రభుత్వంలో కన్నా,ఎన్డీయే కూటమి పాలనలో రెట్టింపు సంక్షేమాన్ని పొందుతున్నామని హర్షం వ్యక్తంచేశారు.ఆటో డ్రైవర్లను పలకరించగా గత ప్రభుత్వంలో గుంటల మయంగా మారిన గుంటూరు నేడు రోడ్లు వేయడం వలన ప్రయాణం సాఫీగా సాగతుందని,ప్రమాదాలు కూడా తగ్గాయని తెలిపారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు గ్రామాల్లో పర్యటించి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం,పెన్షన్ల పెంపుదల పై ప్రజల నుండి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయని,ఆగస్టు 15నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నామని,అన్నదాత సుఖీభవ అమలు చేసి రైతులను ఆదుకుంటామన్నారు.వడ్డెర సోదరుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని,వారిని ఆర్థికంగా పైకి తీసుకొని రావడమే ధ్యేయంగా పనిచేస్తుందని,రాష్ట్ర ప్రభుత్వం వడ్డెరలను గుర్తించి వడ్డెర్ల ఆరాధ్య దైవమైన వడ్డే ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని జీవో విడుదల చేసిందని,బీసీ ల సంక్షేమానికి పెద్ద పీఠ వేసే ప్రభుత్వం తమదని ఎమ్మెల్యే మాధవి తెలిపారు.కార్యక్రమంలో లామ్ వర్ధనరావు,గంటా మౌలిక,సాధు రాజేష్,మల్లేశ్వరరావు, యాకోబు, నవమి,గోపి,గంధం చలపతిరావు,తోట సాంబశివ రావు,సయ్యద్ ఇంతియాజ్, బాబురావు, మస్తాన్‌వలీ,అబ్దుల్లాఖాన్,పులి వృది వ,బుడే భాయ్, బంగారు బాబు,రత్నకుమారి , దిలవార్ షేక్,గంటా సాయి,మొవ్వ వేణు, కందునూరి కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

## మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ 2.0 సమావేశం పండుగ వాతావరణంలో వేడుకగా జరపాలి

**బాపట్ల,జులై07,ప్రభాతవార్త:** మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ 2.0 సమావేశం పండుగ వాతావరణంలో వేడుకగా జరపాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశం నిర్వహణపై సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేయాలన్నారు.ఏక్ పేడ్ మాకే నామ్(అమ్మ పేరుతో ఒక మొక్క) విద్యార్థులు నాటేలా అవగాహన కల్పించాలన్నారు.పాఠశాలల ప్రాంగణాలు లేదా ఇళ్ల వద్ద నాటే మొక్కల బాధ్యత విద్యార్థులదేనన్నారు.విద్యార్థులకు అవసరమైన మొక్కలు సిద్ధంగా ఉంచామని, మంగళవారం నాటికి నర్సరీల నుండి



పేరెంట్స్ అండ్ టీచర్స్ 2.0 సమావేశాన్ని జయప్రదంగా నిర్వహించడానికి ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు.విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులకు ముందుగా సమాచారం పంపాలన్నారు. విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన సూచించారు. విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు గౌరవప్రదంగా వారిని ఆహ్వానించాలన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాలు అరికట్టడానికి విద్యార్థుల్లో అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల జీవితాలను కాపాడటమే లక్ష్యం కావాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,818 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయన్నారు. అందులో ఒకటి నుంచి 10వ తరగతి వరకు ఒక లక్ష, 59,108 మంది విద్యార్థులు ఉన్నారని చెప్పారు. విద్యార్థి మిత్ర బహుమానాలను అందుకున్న విద్యార్థులంతా నూతన దుస్తులు ధరించి పాఠశాలకు హాజరు కావాలన్నారు. జూనియర్ కళాశాలలోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఆయా మండలాలకు చేరుతాయన్నారు. వాటిని విద్యార్థులకు పంపిణీ చేయాలని ఆయన సూచించారు. తల్లికి వందనం పథకం కింద నగదు పంపిణీ ప్రక్రియ జిల్లాలో జరుగుతోందన్నారు. మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్ లో విద్యార్థుల ప్రగతి నివేదిక, హెల్త్ కార్డుల పంపిణీ చేపట్టాలన్నారు. షైనింగ్ స్టార్ అవార్డులు పొందిన విద్యార్థులు, పూర్వ విద్యార్థులను పిలిపించి వేదికపై మాట్లాడించాలన్నారు. విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేలా ఈ కార్యక్రమాన్ని సమర్థంగా చేపట్టాలన్నారు. ఈ సమావేశాలలో ముందస్తుగా విద్యార్థుల తల్లిదండ్రులకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. పండుగ వాతావరణంలో సమావేశాలు నిర్వహించాలని అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డిఈఓ పురుషోత్తం, ఎస్ఎస్సి ఏపీసి నాగిరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, డిపిఓ ప్రభాకర్ రావు, అటవీశాఖ అధికారి వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలోనే అభివృద్ధి,సంక్షేమం

### -ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ,జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన

**నూజెండ్ల,జులై7,ప్రభాతవార్త:** గత వైకాపా ప్రభుత్వంలో అభివృద్ధి,సంక్షేమం కుంటుపడటమే కాకుండా రాష్ట్రం గాడితప్పితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో అభివృద్ధి,సంక్షేమాన్ని సమపాళ్లలో నడిపిస్తున్నారని ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికీ తెలుగుదేశం



కార్యక్రమం మండలంలోని జంగాలపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చీఫ్ విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావుతో కలిసి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు,అభివృద్ధి గురించి వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. పాలనపై ప్రజలను అభిప్రాయాలను ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసంతో రాష్ట్రం పూర్తిగా నాశనం అయిందని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది సమయంలో ఇచ్చిన హామీల మేరకు చాలా వరకు అమలు చేస్తున్నామన్నారు. ఏడాది పాలనలో పింఛన్ల పెంపు,తల్లికి వందనం,ఉచిత గ్యాస్ సిలిండరు పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు. త్వరలో రైతులకు అన్నదాత సుఖీభవ, ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇతరత్రా పథకాలన్నింటిని సీఎం చంద్రబాబు అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని చెప్పారు. కూటమి పాలనకు వస్తున్న ప్రజా మద్దతును ఓర్వలేని మాజీ సీఎం జగన్‌రెడ్డి తప్పుడు ప్రచారాలకు తెరతీస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## షెడ్యూల్ ప్రకారమే నూటా ఎన్నికలు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జూలై7, ప్రభాతవార్త:** వర్సిటీలో అధ్యాపక సంఘం (నూటా) ఎన్నికలు ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 9వ తేదీన జరుగుతాయని ఎన్నికల అధికారి ఆచార్య యస్.మురళీమోహన్ స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి పోస్టులకు మాత్రమే ఎన్నికలు నిర్వహించనున్నారు. మిగిలిన పోస్టులకు ఒకొక్కరే నామినేషన్‌లు దాఖలు చేయగా వారికి పోటీ లేకపోవడంతో ఏకగ్రీవం అవుతాయి. కాగా ఎన్నికలు వాయిదా వేయాలని అధ్యక్ష, కార్యదర్శి పోస్టులకు నామినేషన్‌లు వేసిన ఆచార్య కె.సుమంత్‌కుమార్, ఆచార్య జగదీష్ నాయక్‌లు ఎన్నికల అధికారికి వినతిపత్రం అందజేశారు. ఆ వినతిని వర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్ళగా షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలని సూచించినట్లు సమాచారం. అయితే ఎన్నికల సమయంలో పరీక్షలు ఉండటంతో పోలింగ్ సమయాన్ని పొడిగించేందుకు ఎన్నికల అధికారి నిర్ణయం తీసుకున్నారు.

## నేటి నుంచి పీజీ రెండవ సెమిస్టర్ పరీక్షలు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జూలై7, ప్రభాతవార్త:** వర్సిటీ పరిధిలో మంగళవారం నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల రెండవ సెమిస్టర్ పరీక్షలు జరుగనున్నాయి. ఈ పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30గం.లవరకు ఈ పరీక్షలు జరుగుతాయి.

## పల్నాడు రాజకీయాల్లో జూలకంటి కుటుంబానికి ప్రత్యేక గుర్తింపు

### - ఒకే ఇంటి నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలుగా ఎన్నిక

**కారంపూడి, జులై 7 ప్రభాతవార్త:** బ్రహ్మనాయుడు ఏలిన పల్నాడు ప్రాంత రాజకీయాలలో జూలకంటి కుటుంబానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. పల్నాడు ప్రాంతంలో జూలకంటి కుటుంబం అనగానే గుర్తొచ్చే పేరు జూలకంటి నాగిరెడ్డి. పల్నాడు ప్రజలు నాగిరెడ్డిని పల్నాటి బాలచంద్రుడిగా పిలుచుకుంటారని పెద్దలు




చెప్తుంటారు. సహజంగా ఒక ఇంట్లో ఒకరు ఎమ్మెల్యేగా ఎన్నిక అవ్వడం గొప్ప విషయం. అలాంటిది పల్నాడు చరిత్రలో ఒకే ఇంటి నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలుగా ఎన్నిక కావడం గొప్ప వరమని చెప్పవచ్చు. 1967 నుంచి జూలకంటి కుటుంబం రాజకీయాలలో తనదైన ముద్ర వేస్తూ వచ్చింది. పల్నాడులో కీలకమైన మాచర్ల, గురజాల నియోజకవర్గంలో శాసనసభ్యులుగా పనిచేసే అవకాశం ఆ కుటుంబానికే దక్కిందని చెప్పవచ్చు. నాడు అమ్మ జూలకంటి దుర్గాంబ, నాన్న జూలకంటి నాగిరెడ్డి, నేడు వారి తనయుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. జూలకంటి నాగిరెడ్డికి పల్నాడు ప్రాంత వాసులు ముద్దుగా పల్నాటి బాలచంద్రుడు, పల్నాటి పులిగా అభివర్ణిస్తారు. పల్నాడు జిల్లా వెల్దుర్తికి చెందిన జూలకంటి నాగిరెడ్డి రైతు కుటుంబం నుంచి వచ్చారు. ఆయన సొంతూరు వెల్దుర్తి కావడంతో సొంతూరు నుంచే రాజకీయాన్ని మొదలుపెట్టారు. ప్రజలకు దగ్గరగా ఉంటూ నిజాయితీతో పనిచేశారని ఇప్పటికీ ఆయన గురించి నిత్యం ప్రజలు చెప్పుకోవడం విశేషం. ప్రజలకు అందుబాటులో ఉంటూ పేద ప్రజలకు సహాయం చేయడంలో జూలకంటి నాగిరెడ్డి పల్నాడు ప్రాంతంలో మంచిపేరు తెచ్చుకున్నారని చెప్పొచ్చు. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే మాచర్ల నియోజకవర్గంలో ఆ రోజుల్లో జూలకంటి నాగిరెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీకి దేశవ్యాప్తంగా గుర్తింపు ఉన్నప్పటికీ అలాంటి సమయంలోనే నాగిరెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అవినీతి మరక లేని జూలకంటి నాగిరెడ్డిని గుర్తించిన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు 1983లో జూలకంటి నాగిరెడ్డికి టీడీపీ తరఫున గురజాల నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం కల్పించగా జూలకంటి నాగిరెడ్డి టీడీపీ నుంచి విజయం సాధించారు. జూలకంటి కుటుంబం దీర్ఘకాలం నుంచి పల్నాడు రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించింది. ఆ తరువాత 1999లో జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాతృమూర్తి జూలకంటి దుర్గాంబ మాచర్ల టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి సమీప కాంగ్రెస్ అభ్యర్థి పిన్నెల్లి లక్ష్మారెడ్డిపై 1951 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. తాజాగా 2024 ఎన్నికల్లో జూలకంటి కుటుంబం నుంచి టిక్కెట్ దక్కించుకున్న బ్రహ్మానందరెడ్డి సమీప ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై 33,318 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించడంతో పల్నాడు రాజకీయ చరిత్రలో జూలకంటి కుటుంబానికి ప్రత్యేక విశిష్టత లభించింది. జూలకంటి కుటుంబం నుంచి ఒకే ఇంట్లో ముగ్గురు ఎమ్మెల్యేలుగా ఎన్నిక కావడం గొప్ప విషయంగా చెప్పవచ్చు. దీంతో పల్నాడు ప్రజలు నాడు ప్రజాసేవకై అమ్మ, నాన్న, నేడు బ్రహ్మానందరెడ్డి అని పల్నాడు ప్రజలు భావిస్తున్నారు.

## అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలి


**బాపట్ల,జులై07,ప్రభాతవార్త:** అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులను ఆదేశించారు.బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 55 మంది అర్జీదారులు తమ సమస్యలను ఎస్పీకి విన్నవించారు. కుటుంబ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, ఆస్తి తగాదాలు, స్థల వివాదాలు ఇతర పలు సమస్యలపై వచ్చిన ప్రజల అభ్యర్థనలను ఎస్పీ కూలంకషంగా విని, అర్జీలను పరిశీలించి, సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి అర్జీదారుల సమస్యలను త్వరితగతిన చట్టపరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ



సందర్భంగా జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులతో మాట్లాడుతూ బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను నిర్దేశిత గడువులోనే సంతృప్తికరరీతిలో పరిష్కరించాలన్నారు. పునరావృత అర్జీలు రాకుండా శాశ్వత పరిష్కారాలు చూపాలని స్పష్టం చేశారు. అర్జీలను పరిష్కరించేందుకు తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో బాపట్ల డిఎస్పీ రామాంజనేయులు, చీరాల డిఎస్పీ మోయిన్, పీజీఆర్ఎస్ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## త్రికోటేశ్వరునికి రూ.24,02,549-00ల తొలి ఏకదశికి ఆదాయం

**నరసరావుపేట, జూలై 7 ప్రభాతవార్త :** మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన కోటప్పకొండ పై వేంచేసియున్న త్రికోటేశ్వర స్వామికి తొలి ఏకదశికి రూ.24.02,549ల ఆదాయం లభించింది. వివరాలను ఆలయ ఇవో చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. పండుగ సందర్భంగా టిక్కెట్ల రూపంలో రూ.9,09,090-00లను, ప్రసాదాల అమ్మకాల ద్వారా రూ.4,39,380-00ల ఆదాయం లభించిందన్నారు. అన్నదానానికి భక్తులు రూ.86,051-00 సమర్పించారు. అదే విధంగా హుండీలపై వచ్చిన ఆదాయం రూ.9,68,028-00లు వచ్చిన్నట్లు ఇవో తెలిపారు. దీంతో పాటు బంగారం, వెండి, డాలర్స్ వంటివి కానుకలుగా రాలేదని ఇవో చంద్రశేఖర్ రావు వివరించారు.



## ప్రాంగణ నియామకాల్లో ఆర్‌విఆర్‌జేసి ఇంజనీరింగ్ కళాశాల 20మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు

**గుంటూరు విద్య ,జూలై 7,ప్రభాతవార్త :** ఇటీవల తమ కళాశాల్లో పలు కంపెనీలు నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 20మంది విద్యార్థులకు 3నుంచి 6లక్షల ప్యాకేజీతో కూడిన ఉద్యోగాలు లభించడం ఆనందదాయకమని ఈ ఏడాది 2024-25 విద్యా సంవత్సరానికి ఇప్పటి వరకు 852మంది విద్యార్థులకు ప్రసిద్ధి చెందిన వివిధ కంపెనీల్లో అధిక ప్యాకేజీతో కూడిన ఉద్యోగాలు లభించాయని కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్,ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్,డాక్టర్ జగదీష్ పేర్కొన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ బెంగళూరు కు చెందిన ఎక్సెల్ ఆర్ కంపెనీలో 9మంది, ప్రిధిని ఇన్‌ఫ్రాటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 7గురు,ఎవరెస్ట్ ల్యాబ్‌లో ఇద్దరు, బెటర్‌క్యాస్టింగ్స్ కంపెనీలో ఇద్దరు,మొత్తం 20మంది విద్యార్థులు ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం డాక్టర్ కె.రవీంద్ర,డాక్టర్ ఎన్.వి. శ్రీనివాస రావు, వివిధ శాఖాధిపతులు, సిహెచ్ శ్రీనివాసరావు, డాక్టర్ కె.సురేష్‌బాబు తదితరులు ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.


**NATIONAL SEEDS CORPORATION LIMITED**
(A Government of India Undertaking)
"An ISO 9001:2015 & ISO 14001:2015 Company"
REGIONAL OFFICE, 17-11,Tukaram Gate, Lalaguda,
Secunderabad-500017.(TG) PH: 040 -27731152, 27730635
Mail ID- rm.secunderabad@indiaseeds.com

**E-TENDER NOTICE**

E-Tenders are invited for **"PIECE RATE WORKS OF DIFFERENT OPERATION OF PROCESSING AND PACKING OF SEEDS AT AREA OFFICES UNDER REGIONAL OFFICE, SECUNDERABAD"**. The Bid may be Seen & downloaded from NSC portal/website https://indiaseeds.enivida.com and www.indiaseeds.com. The last date for submission of Bids is **19.07.2025 at 02.00 P.M. and will be opened on same day at 02.30 P.M.** The detailed terms and conditions can be seen from tender schedule / website. Any changes will be placed only on NSC web-site.

F. No. Engg 11(01)/Rate Contract/
NSC: HYD/25-26
DATED: 07.07.2025

(GAJANAND SINGH)
REGIONAL MANAGER


## ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలి : కమీషనర్ పులి శ్రీనివాసులు



**గుంటూరు తూర్పు, జులై 7 (ప్రభాతవార్త) :** నల్లచెరువు రోడ్డులో అవుట్పాల్ డ్రైన్ పూడికతీత పనులు చేపట్టనున్నందున మంగళవారినికి కల్లా ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని జీఎంసీ కమీషనర్ పులి శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ వర్షాల వలన డ్రైనులు పొంగి మురుగు రోడ్లు మీదకు లోతట్టు ప్రాంతాల్లో ప్రజల నివాసాల్లోకి వెళ్ళడం వలన పలు సమస్యలు ఎదరవుతున్నాయన్నారు. నగరంలో ఇప్పటికే వార్డుల వారీగా మేజర్, మైనర్ డ్రైన్లతో పూడిక తీత పనులు చేపట్టామన్నారు. నల్లచెరువు రోడ్డులో ఎత్తు రోడ్ నుండి జాతీయ రహదారి వరకు చేపట్టనున్న పూడికతీత పనుల్లో భాగంగా డ్రైన్ల మీద ఇరువైపులా ఉన్న ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలన్నారు. తొలగించుకోని ఆక్రమణలను జిఎంసి పట్టణ ప్రణాళిక సిబ్బంది తొలగిస్తారని, అందులో జరిగే నష్టానికి ఆక్రమణదారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

# ప్రజారోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## -తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్

**గుంటూరు తూర్పు, జులై 7 (ప్రభాతవార్త) :** ప్రజారోగ్య భద్రత కూటమి ప్రభుత్వ లక్ష్యమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. సోమవారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును



అందించారు. నగరంలోని 12వ వార్డుకు చెందిన కురంగుంట్ల త్రిలోకేశ్వర్‌రెడ్డి కుమార్తె రెండేళ్ళ చిన్నారి ధనలక్ష్మీ అనారోగ్యానికి గురయ్యారు. దీంతో తల్లిదండ్రులు ప్రైవేటు వైద్యశాలకు తీసుకువెళ్ళి చికిత్స చేయించారు. వైద్యానికి లక్ష రూపాయలు ఖర్చు కావడంతో అప్పుల్లో కూరుకుపోయారు. ఈ నేపథ్యంలో తమను ఆదుకోవాలంటూ ఎమ్మెల్యే నసీర్‌ను తల్లిదండ్రులు స్పందించారు. దీంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా తాము అండగా నిలుస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వెంటనే సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించి మంజూరయ్యే వరకు స్వయంగా పర్యవేక్షించారు. దీనికి సంబంధించి రూ.2,08,477విలువైన రిలీఫ్ ఫండ్ నిధులు మంజూరు కావడంతో బాలిక తల్లిదండ్రులకు చెక్కును ఎమ్మెల్యే నసీర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే గుంటూరు తూర్పు నియోజకవర్గంలో షుమారు రూ.3కోట్ల విలువైన సీఎం నిధులు అందించామని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రజారోగ్యానికి పెద్ద పీఠ వేస్తున్నామని, ఇది తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.

# కోర్టు నిర్మాణానికి అనువైన స్థలం ఎంపిక చేయండి

## పలు ప్రాంతాలను పరిశీలించి అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, జులై7, ప్రభాతవార్త:** పట్టణంలో జూనియర్ సివిల్‌కోర్టు భవనం నూతన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి సోమవారం పరిశీలించారు. మున్సిపల్ అధికారులు, బార్



అసోసియేషన్ సభ్యులతో కలసి పట్టణంలోని పలు ప్రాంతాలలోని ఖాళీ స్థలాలను పరిశీలించారు. వాటిపై సభ్యులు సానుకూలంగా స్పందించకపోవడంతో అందరికి అనువైన, సరైన ప్రదేశం ఎంపిక చేయాలని ప్రత్తిపాటి అధికారులను ఆదేశించారు. నూతన కోర్టు భవనం నిర్మాణ స్థలం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రధాన రోడ్లకు దగ్గరగా ఉండేవిధంగా చూడాలని అన్నారు. న్యాయమూర్తులకు రక్షణ, ప్రజలు, న్యాయవాదులు రాకపోకలకు, పార్కింగ్ సదుపాయానికి ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. స్థల ఎంపిక పూర్తయిన వెంటనే భూమి పూజ చేసి వీలైనంత త్వరగా భవన నిర్మాణం పూర్తయ్యేలా చూడాలన్నారు. నిధులు గురించి ఆలోచించకుండా అధికారులు తక్షణమే స్థలం ఎంపిక, నిర్మాణంపై దృష్టి పెట్టాలని ప్రత్తిపాటి ఆదేశించారు. ప్రత్తిపాటితో పాటు మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, మున్సిపల్ కమీషనర్ పి శ్రీహరిబాబు, మున్సిపల్ డిఈ షేక్ అబ్దుల్ రహీం, టిడిపి నాయకులు షేక్ కరిముల్లా, గంగా శ్రీనివాసరావు, బేరింగ్ మౌలాలి, మురకొండ మల్లిబాబు, జంగా సుజాత,బార్ అసోసియేషన్ సభ్యులు ఈవూరి బ్రహ్మానందం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్‌కు 8ఫిర్యాదులు

**పొన్నూరు, జూలై 7,ప్రభాతవార్త:** ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి వివిధ సమస్యలకు సంబంధించి ఎనిమిది అర్జీలు అందినట్లు తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. వీటిలో రెవెన్యూకు సంబంధించి-4అర్జీలు, సర్వేకి సంబంధించి-4అర్జీలు అందినట్లు చెప్పారు. వీటిని పరిష్కారం నిమిత్తం ఆయా శాఖలకు పంపినట్లు తెలిపారు. ప్రతి సోమవారం జరిగే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, తహశీల్దార్ కార్యాలయం సూపరింటెండెంట్ ఆలేటి మాధవి, ఓఈపిఆర్డీ మల్లికార్జునరావు, వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

## - ఏఐటియుసి నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు

**పొన్నూరు, జూలై 7,ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం కార్మికులకు అనుకూలంగా ఉన్నటువంటి 40కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి యజమానులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న




నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ చర్యకు నిరసనగా ఈ నెల 9వ తేదీన నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి నియోజకవర్గ అధ్యక్షుడు ఆరేటి రామారావు కోరారు. అందులో భాగంగా స్థానిక ఐలాండ్ సెంటర్‌లో భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. ధర్నాకు పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గుమ్మడి రోశయ్య అధ్యక్షత వహించారు. ధర్నాలో ఆరేటి రామారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ వల్ల కార్మికులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. సమ్మెకు అన్ని రంగాలకు సంబంధించిన కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతోపాటు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కోరారు. ఏఐటియుసి జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఏడుకొండలు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు అనేక పోరాటాల ద్వారా సాధించుకున్నామని, ఆ సంక్షేమ బోర్డు ద్వారా గతంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి, నారా చంద్రబాబునాయుడులు సంక్షేమ బోర్డు నుండి ఆర్థిక సాయాన్ని అందజేశారన్నారు. గత వైకాపా కాలం నుంచి సంక్షేమ బోర్డు అలంకారప్రాయంగానే మారిందన్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో కార్మికులకు ఒరిగిందేమీ లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మళ్ళీ భవన నిర్మాణ సంక్షేమ బోర్డును ద్వారా న్యాయం చేస్తామని చెప్పారన్నారు. అయితే సంవత్సరం గడుస్తున్నా ఇంత వరకు కూటమి ప్రభుత్వం కూడా పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం కార్మికులకు న్యాయం చేయాల్సి ఉండగా అన్యాయం చేస్తుందన్నారు. దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ ధర్నాలో మిక్కిలి జాన్, శ్రీనివాసరావు, శివాజి, సూరిబాబు, కోటేశ్వరరావు, రామయ్య, సంజీవరావు, సుబ్బారావు, హెబ్రీజర్‌బాబు తదితరులు ప్రసంగించారు. అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి 9వ తేదీన జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# అంజుమన్ షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణానికి దాతలు స్పందించాలి

**పొన్నూరు, జూలై 7,ప్రభాతవార్త:** పట్టణ అంజుమన్ కమిటి ఆధ్వర్యంలో నిర్మాణం జరుగుతున్న అంజుమన్ షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి సహకరించాలని అంజుమన్ కమిటి అధ్యక్షుడు మగ్బుల్‌బేగ్ కోరారు. పట్టణానికి చెందిన షేక్ యాసిన్‌బాబా తమ తల్లిదండ్రులు కరీంభాయ్, అమీరున్నీసా జ్ఞాపకార్థం ఒక షాపు నిర్మాణానికి ముందుకు వచ్చారు. అందులో భాగంగా రూ.1లక్ష అడ్వాన్స్‌గా చెల్లించారు. ఈ సందర్భంగా మగ్బుల్‌బేగ్ మాట్లాడుతూ ఈ షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణం పూర్తయి ఆదాయం సమకూరితే పేద ముస్లీంల అభ్యున్నతికి, వారిని ఆదుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. అంజుమన్ కమిటి ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించి పేదలను ఆదుకోవాలన్న సదుద్దేశంతోనే ఈ షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణానికి చేపట్టామన్నారు. ఇప్పటికే అనేకమంది దాతలు వచ్చారని, అయితే ఇంక మరికొంత మంది వస్తే బాగుంటుందన్నారు. సహకరించిన దాతలందరికీ మగ్బుల్‌బేగ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పఠాన్ పిరోజ్‌ఖాన్, షేక్ బాజ్జి, మహమ్మద్ గౌస్, షేక్ మౌలాలి, అబ్దుల్ మజీద్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



# 12వ తేది నుండి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల నిరవధిక సమ్మె

**బాపట్ల, జులై07, ప్రభాతవార్త:** మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జూలై 12 నుండి అత్యవసరాలు మంచినీళ్ళు, విద్యుత్తు లాంటి విధులు నిర్వహిస్తున్న కార్మికులు కూడా నిరవధిక సమ్మెలోకి వెళ్లి ఆందోళన



ఉధృతం చేస్తామని సిఐటియు బాపట్ల జిల్లా నాయకులు తిరుమలరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని త్రవ్య కాలవ వంతెన పై నిలబడి మానవహారం గా ఏర్పడి నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 17 రోజుల సమ్మె ఒప్పందాలను అమలు చేయకుండా వేతనాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జూలై 12 నుండి అత్యవసరాలు మంచినీళ్ళు, విద్యుత్తు లాంటి విధులు నిర్వహిస్తున్న కార్మికులు కూడా నిరవధిక సమ్మెలోకి వెళ్లి ఆందోళన ఉధృతం చేస్తామని అన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమిస్కిల్డ్ వేతనాలు అమలుచేయాలని, జీవో నెంబర్ 36 ప్రకారం 24,500 వేతనం అమలుచేయాలి, తక్షణం తల్లికివందనం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమపథకాలు అమలుచేయా లన్నారు. గత సంవత్సరం 17రోజుల సమ్మె ఒప్పందాలు అమలుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు బాపట్ల పట్టణ అధ్యక్షులు ఓ. లక్ష్మణరావు, సిఐటియు నాయకులు కె.శరత్ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ బాపట్ల జిల్లా నాయకులు రత్నం, నాని, చక్రవర్తి యూనియన్ బాపట్ల పట్టణ అధ్యక్షులు మురళీకృష్ణ, నాయకులు హరిబాబు, ప్రమీల, అశోక్ సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు

# డ్రిల్ మాస్టర్ శ్రీనివాసరావు మృతి బాధకరం

**పిట్టలవానిపాలెం, జులై07, ప్రభాతవార్త:** మండలపరిధిలోని గోకరాజు నల్లిబోయినవారిపాలెం గ్రామానికి చెందిన నల్లిబోయిన శ్రీనివాసరావు (డ్రిల్ మాస్టర్) మరణించటం ఎంతో బాధకరమని బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. సోమవారం ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని వారి కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అఫ్జల్, గోకరాజు శ్రీదర్ వర్మ, వెంకట పతి రాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు పమిడి శ్రీనివాసరావు, నాయకులు పమిడి వెంకట్రామయ్య , అశోక కుమార్, అంజిబాబు, నాగరాజు, బత్తుల శ్రీనివాసరావు, నర్రా గోపి రాజు మరియు తెలుగు దేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# సుపరిపాలన కూటమికే సాధ్యం

## -వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ మాదల వెంకటేశ్వరరావు

**పొన్నూరు, జూలై 7,ప్రభాతవార్త:** రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ మాదల వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని దొప్పలపూడి గ్రామంలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను, నెరవేర్చిన వాగ్దానాలను వివరించారు. ఈ సందర్భంగా మాదల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం తెచ్చిన నల్ల చట్టాలను తొలగించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో విధ్వంస పాలన సాగించిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.4వేల పింఛన్, ఉచితంగా గ్యాస్ సిలెండర్లు, తల్లికి వందనం, మెగా డిఎస్సీ నిర్వహించడం, తదితర వాగ్దానాలను నెరవేర్చడం జరిగిందన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామన్నారు. అందుకు సంబంధించి ఇప్పటికే కమిటీ ఏర్పాటు చేసిన విషయాని న్ని మాదల గుర్తు చేశారు. ఈ కార ్యక్రమంలో నాయకులు బొర్రు రామారావు, చలమశెట్టి సీతారామయ్య, గణిపిశెట్టి రామకృష్ణ, సొపాటి వెంకట్రావు, దొప్పలపూడి సాంబశివరావు, దొప్పలపూడి రాజా, సజ్జా బ్రహ్మయ్య, దొప్పలపూడి నాగరాజు, మల్లంపాటి శ్రీనివాస్, మండవ కృష్ణ, కొచ్చర బాబూరావు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు చేబ్రోలులో శిక్షణా కార్యక్రమాలు

**పొన్నూరు, జూలై 7,ప్రభాతవార్త:** చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 8వ తేదీన మండలంలోని మండలస్థాయి అధికారులకు, ఇతర సిబ్బందికి మండలస్థాయిలో శిక్షణాకార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి.ఉహారాణి తెలిపారు. ఉదయం 9గంటల నుంచి ఈ శిక్షణా కార్యక్రమం ప్రారంభ మవుతుందన్నారు. మండలస్థాయి అధికారులు, పంచాయితీ కార్య దర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు తప్పని సరిగా శిక్షణా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఒక్కరోజు జరిగే శిక్షణా కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది పాల్గొని శిక్షణ పొందాలని, తద్వారా ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు.



# నేడు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు

**చిలకలూరిపేటటౌన్, జులై7, ప్రభాతవార్త:** పట్టణంలో పలు ప్రాంతాలలో విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించే కారణంగా టౌన్2 పరిధిలోని పోలిరెడ్డిపాలెం, లక్ష్మీనరసింహ కాలనీ, మదర్‌థెరిస్సా కాలనీ, బ్యాంక్ కాలనీ ప్రాంతాలలో ఉదయం 9గంటలనుంచి మధ్యాహ్నం 2గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్‌శాఖ డిఈఈ ఆర్ అశోక్‌కుమార్ సోమవారం తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిదిగా ఆయన కోరారు.

# గ్రీవెన్స్‌కు 15 ఫిర్యాదులు

**తెనాలి, జులై 6 (ప్రభాతవార్త) :** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకి స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయానికి సోమవారం అత్యధికంగా 15ఫిఆర్యదులు వచ్చాయి. రెవెన్యూ విభాగానికి సంబంధించి



7, మున్సిపాలిటీకి సంబంధించి 3, పోలీస్ విభాగం 2, పంచాయితీ విభాగానికి 1 ఫిర్యాదులు వచ్చాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై సబ్ కలెక్టర్ సంజనా సిన్హాకు వినతిపత్రాలు అందజేశారు. మొత్తం 15 ఫిర్యాదులు రావటం జరిగిందని, వాటిని ఆయా విభాగాల అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరిస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) ద్వారా ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి ప్రణాళికా బద్ధంగా వాటిని పరిష్కరిస్తామని తహశీల్దార్ కె.వి.గోపాలకృష్ణ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ లో పాల్గొని ప్రజలు నుండి ఫిర్యాదులు స్వీకరించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి 8ఫిర్యాదులు అందాయని, ఆయా విభాగాల అధికారులతో మాట్లాడి ఫిర్యాదులు పరిష్కరిస్తామన్నారు.

# విద్యార్థుల సమస్యలపై ఏఐఎస్ఎఫ్ నిరసన

**తెనాలి, జులై 7 (ప్రభాతవార్త) :** విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ




సందర్భంగా జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందంటూ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు.

# ఘనంగా కొండవీడలో మొహరం ఉత్సవాలు

**కొండవీడు(యడ్లపాడు) జులై 7, ప్రభాతవార్త :** ఇమామ్ హుసేన్ సంస్మరణార్థం ముస్లిం సోదరులు 10వ రోజు పవిత్రంగా జరుపుకొనే పెద్దషరగర్(ఊరేగింపు)మరియు అగ్ని గుండంలో నడక వంటి కార్యక్రమాలను ఘనంగా ఆదివారం అర్థ రాత్రి నిర్వహించారు. చారిత్రిక ప్రాధాన్యం కలిగిన కొండవీడులో పూర్వీకులు కాలం నుంచి మొహరంను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని తిలకించుటకు జిల్లాలోని పలు ప్రాంతాల నుండి భక్తులు అధికసంఖ్యలో పాల్గొ న్నారు. మొహరం పండుగకు అత్యంత ప్రాధాన్యమిచ్చే షియా తెగకు చెందిన వారు ఇక్కడ అధికంగా ఉండటంతో ఇక్కడి ముస్లింలు ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా పూర్వీకుల అచారాలను భక్తి శ్రద్ధలతో అచరించుతున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుండి భక్తులు ఇక్కడికి విచ్చేసి, పీర్లను దర్శించుకొని అగ్ని గుండంచుట్టూ ప్రదక్షిణలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. శనివారం సాయంత్రం ప్రారంభమైన కార్యక్రమాలు అసలి ఘట్టం సోమవారం తెల్లవారుజాము వరకు నిర్వహించారు. అగ్నిగుండములో పీర్లు పట్టుకొని విశాలంగా పరచిఉన్న నిప్పుల గుండములో ముజావర్లు ఉపవాసాలతో ఉండి హుస్సేన్, హుస్సేన్‌లను స్మరిస్తూ పూలపాన్పుపై తిరుగాడినట్లు నడుచు దృశ్యాన్ని తిలకించుటకు అప్రాంతం అంతయు కిక్కిరిసిపోయింది. ముజావర్లతోపాటు మొక్కులు ఉన్న మరో కొంతమంది తిరిగారు. భారీగా ప్రజలు వచ్చి తిలకించినట్లు గ్రామస్తులు తెలుపుతున్నారు. ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి బందోబస్తు నిర్వహించామని ఎస్సై టి శివరామకృష్ణ తెలిపారు.



# కొండవీడు మొహరం ఉత్సవాల్లో పాల్గొన్న ప్రత్తిపాటి

**యడ్లపాడు, జులై 7, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొండవీడు గ్రామంలో ఘనంగా నిర్వహించే మొహరం ఉత్సవాల్లో శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. త్యాగానికి ప్రతీక అయిన మొహరం వేడుకలు ముస్లింలకు అత్యంత ముఖ్యమైనవని అన్నారు. మహమ్మద్ ప్రవక్త మనవడు హుస్సేన్ అత్మత్యాగానికి గుర్తుగా ముస్లిం సోదరులు జరుపుకునే సంతాప కార్యక్రమాల్లో భాగమైన పీర్ల ఊరేగింపు ప్రారంభించారు. ఊరేగింపును జాగ్రత్తగా గమనించాలని, పూర్తయ్యే వరకు ఎక్కడా ఎలాంటి ఘటనలు లేకుండా చూడాలని స్థానిక పోలీస్ సిబ్బందిని అదేశించారు. కార్యక్రమంలో అయన వెంట టీడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, కామినేని సాయిబాబు, బండారుపల్లి సత్యనారాయణ పలువురు గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో మొహరం పండుగ

**యడ్లపాడు, జులై 7, ప్రభాతవార్త :** మండలంలోని పలుగ్రామాలలో మొహరం పండుగను ముస్లీం సోదరులు భక్తిశ్రద్దలతో నిర్వహించారు. యడ్లపాడు, వంకాయలపాడు, కారుచోల, తిమ్మాపురం, బోయపాలెం, కొండవీడు గ్రామాలలోని పీర్లచావడులలో పీర్లను ఉంచి రోజువారీ ప్రత్యేకకార్యక్రమాలను ముజావర్లు నిర్వహించారు. 11రోజుల పాటు భక్తిశ్రద్దలతో నిర్వహించే పండుగను 10వరోజు అగ్ని గుండమును ఏర్పాటుచేసి పీర్లను చేతబూని తిరిగారు. భక్తులు అధికంగా పాల్గొని ఎవరికివారు తోచినట్లుగా నిప్పుల గుండముకు కట్టెలను సమకూర్చారు. చివరి రోజు గ్రామాలలో భారీ ఊరేగింపులు నిర్వహించారు.



# ఈనెల 12వ తేదిన ప్రత్తిపాటి గార్డెన్స్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం

**చిలకలూరిపేట, జులై7, ప్రభాతవార్త:** మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో ఈనెల 12వ తేది శనివారం ఉదయం 8గంటలకు ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్తిపాటి గార్డెన్స్ లోపెదకాకాని శంకర నేత్ర వైద్యశాల బృందంచే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్‌మోహన్, పఠాన్ సమద్‌ఖాన్ మద్దుమాల రవి, గంజి



శ్రీనివాసరావు, మాధవ్‌సింగ్, శిబిర నిర్మాహకులు కంచర్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని తెలియచేశారు. అదేవిధంగా త్వరలో 42రకాల వైద్య పరీక్షలు చేసే ఆధునిక పరికరం డిహెచ్ఓఎస్ ద్వారా వైద్య పరీక్షలు చేయడం జరుగుతుందని వివరించారు. దీనిని సామాన్య ప్రజలకు త్వరలో అందుబాటులోకి తేనున్నట్లు వారు వివరించారు.

# పట్టణంలో ఇమ్మడి చైతన్య ఇంటిలో దొంగల దోపిడి - రూ 1.60 లక్షల నగదు, 70 గ్రాముల బంగారం, 3 కిలోల వెండి, పట్టుచీరెలు దోపిడి

**చిలకలూరిపేట, జులై7, ప్రభాతవార్త:** పట్టణంలోని వేజెండ్ల రాములు వీధిలో నివాసం ఉంటున్న ఇమ్మడి చైతన్య వారి కుటుంబసభ్యులు ఇంటికి తాళం వేసి అవనిగడ్డకు వెళ్లారు. కాగా సోమవారం ఉదయం అక్కడనుంచి ఇంటికి తిరిగి వచ్చి చూడగా ఇంటితాళాలు, తలుపులు పగులగొట్టి ఉండటంతోపాటు ఇల్లంతా చిందరవందరగా ఉందని గుర్తించి షాక్‌కు గురయ్యారు. దోపిడి దొంగలు ఇంటికి తూర్పువైపున ఉన్న వాకిలి తలుపులు పగులగొట్టి ఇంటిలోకి ప్రవేశించి ఇంటిలో ఉన్న రెండు బీరువాలు పగులగొట్టి అందులో ఉన్న రూ 1.60 లక్షల నగదు, 70 గ్రాముల బంగారం, 3 కిలోల వెండి, 40పట్టుచీరెలు అపహరించుకుపోయినట్లు చైతన్య పోలీసులకు పిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. గుంటూరునుంచి వేలిముద్రల నిపుణుల బృందం చైతన్య నివాసానికి వచ్చి ఆధారాలను సేకరించారు. దగ్గరలో ఉన్న సిసి కెమేరాల ద్వారా దొంగతనం జరిగిన తీరును పట్టణ సిఐ పి రమేష్ ఆధ్వర్యంలో పట్టణ ఎస్ఐ, బృందం దర్యాప్తు చేస్తున్నారు.



# శ్రీ విద్య మిత్రమండలి ఆధ్వర్యంలో 34మంది విద్యార్థులకు రూ1,75,000 ఆర్థిక సహాయం

**చిలకలూరిపేట, జులై7, ప్రభాతవార్త:** శ్రీ విద్య మిత్రమండలి ఆధ్వర్యంలో పట్టణంలోని పెన్షనర్స్ హల్ ఆవరణలో నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతిలో గత సంవత్సరం



మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ 5వేల వంతున 33 మందికి ఉపకార వేతనాలను శ్రీ విద్య మిత్రమండలి అధ్యక్షురాలు మర్రి లలిత అందచేశారు. 593 మార్కులతో నియోజకవర్గంలో ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థినికి రూ 10వేలు అందచేశారు. ఈ సందర్భంగా మర్రి లలిత మాట్లాడుతూ తనకు పరిచయం ఉన్న 75మంది మహిళలతో 2008వ సంవత్సరంలో ఒక గ్రూప్‌గా ఏర్పడి వారి వద్దనుంచి డబ్బులు ఏర్పాటు చేసుకొని బాగా చదువుకునే విద్యార్థిని, విద్యార్థులు, ఆర్థిక పరమైన ఇబ్బందులతో చదువు కొనసాగించ లేనివారికి ఆర్థిక సహాయం అందించడమే ఈ గ్రూప్ ముఖ్య ఉద్దేశమని వివరించారు. అప్పటినుంచి ఇప్పటివరకు ప్రతి సంవత్సరం వందలాది మంది విద్యార్థులకు ఈ ఆర్థిక సహాయం అందచేసినట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో మిత్రమండలి కోశాధికారి కృష్ణకుమారి, సభ్యులు ధనలక్ష్మీ, ఉషారాణి, లక్ష్మీ ప్రసన్న, పద్మావతి, రాజేశ్వరి, సుభాషిణి, కోటి సుబ్బారావు, సుజాత, సిహెచ్ సుబ్బారావు, లావు నాగ సంజీవరావు, ఉమామహేశ్వరరావులు పాల్గొన్నారు.

# 10న గురుపూర్ణిమ మహోత్సవాలు

**పొన్నూరు, జూలై 7,ప్రభాతవార్త:** పట్టణంలోని తెలగపాలెం శ్రీ సహస్రలింగేశ్వరస్వామి వారి దేవాలయం సమీపంలో వేంచేసియున్న సద్గురు శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో ఈ నెల 10వ తేదీన గురుపూర్ణిమ సందర్భంగా వివిధ రకాల ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శ్రీ షిరిడి సాయిబాబా మందిరం కమిటి అధ్యక్షుడు తోట ఆదినారాయణ తెలిపారు. 8వ తేదీన ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం వరకు శ్రీ సాయి సచ్చిరిత్ర పారాయణం, 9వ తేదీన ఉదయం 9.30గంటల నుంచి శ్రీ సాయి నామ జపము జరుగుతాయన్నారు. 10వ తేదీన కాకడ హారతి, పంచామృత అభిషేకాలు, అష్టోత్తర పూజా కార్యక్రమాలు, భజన, ధూప్ హారతి, పల్లకీసేవ, వేజ్ హారతి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి కృపకు పాత్రులు కావాలని ఆదినారాయణ కోరారు.

# మంత్రి నారా లోకేష్ సహకారంతో బడ్డీకొట్టులు, టిఫిన్, తోపుడు బళ్లు, ప్లాట్ ఫామ్ రిక్షాలు అందజేత

**మంగళగిరి, జూలై 7, ప్రభాతవార్త :** మంగళగిరి నియోజకవర్గంలో చిరు వ్యాపారుల ఆర్థికాభివృద్ధికి మంత్రి నారా లోకేష్ ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. మంత్రి నారా లోకేష్ సహకారంతో మంగళగిరి పట్టణం, మంగళగిరి రూరల్ మండలాలకు చెందిన పలువురికి బడ్డీకొట్టులు, టిఫిన్, తోపుడు బళ్లు, ప్లాట్ ఫామ్ రిక్షాలు అందజేశారు. మంగళగిరి మండలం నవులూరు గ్రామానికి చెందిన పఠాన్ ఫాతిమా, పలగాని వెంకమ్మ, ఎర్రబాలెం గ్రామానికి చెందిన షేక్ ఆషా, మంగళగిరి పట్టణంలోని 26వ వార్డుకు చెందిన షేక్ హుస్సేన్సాలకు టిఫిన్ బళ్లు, నవులూరు గ్రామానికి చెందిన మల్లెల భారతికి తోపుడు బండి, మంగళగిరి పట్టణం 5వ వార్డులోని టిడ్కోకు చెందిన



నాయుడు సుబ్బారావుకు, 28వ వార్డుకు చెందిన పఠాన్ ఫాతిమాకు బడ్డీకొట్టులు అందజేశారు, మంగళగిరి పట్టణం 21వ వార్డుకు చెందిన షేక్ సుభాని, ప్రకాశం మహాంకాళికి ప్లాట్ ఫామ్ రిక్షాలను అధికారం అందజేశారు. తమ కుటుంబ జీవనోపాధికి అవసరమైన బడ్డీకొట్టులు, టిఫిన్, తోపుడు బళ్లు, ప్లాట్ ఫామ్ రిక్షాలు అందజేయాలని మంత్రి నారా లోకేష్ ను కోరగా వెంటనే స్పందించిన ఆయన వెంటనే బళ్లు తయారు చేయించి నాయకుల చేతుల మీదుగా శనివారం అందజేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఎల్లప్పుడూ చేయూత అందిస్తూనే ఉంటున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల కోసం మంత్రి నారా లోకేష్ చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు అమోఘం అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, పట్టణ ఉపాధ్యక్షులు వాసా పద్మ, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి అబ్దుల్ మజీద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్ర ప్రైమ్ ఆధ్వర్యంలోఉచిత వైద్య శిబిరాలు

**గుంటూరు క్రైమ్, జూలై 7, ప్రభాతవార్త :** పేదల ఆరోగ్యం కోసం ఆం ధ్ర ప్రైమ్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిఆరలు నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దేగల ప్రభాకర్ అన్నారు. గోరంట్ల రామాలయం వద్ద ఆంధ్రప్రైమ్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరానికి ముఖ్యఅతిధిగా ఏపిఐడిసి ఛైర్మన్ దేగల ప్రభాకర్ హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరానికి సుమారు 430మంది రోగులు



వైద్యసేవలు పొందగా, అవసరమైన వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ దేగల ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ గోరంట్ల వాస్తవ్యులైన డాక్టర్ జల్లేపల్లి తేజస్వీ పేదలకు సేవ చేయాలనే గొప్ప ఉద్దేశ్యంతో ఈ క్యాంప్ నిర్వహించారన్నారు. సాధారణంగా ఓపి ఫీజు కనీసం రూ.1000లు వరకు ఉండే హాస్పటల్స్ ఉన్న ఈకాలంలో ప్రైమ్ హాస్పటల్ ద్వారా ఉచితంగా దయాగ్నో సిస్, ఈసీజీ, మెడిసన్ వంటి సేవలు అందించబడుతున్నాయన్నారు. ప్రతి మూడునెలలకు ఒకసారి ఈ వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. డాక్టర్ జల్లేపల్లి తేజస్వి మాట్లాడుతూ వైద్య శిబిరంలో గుండె సంబంధిత ఈసీజీ, 2డి ఎకో వంటి టెస్టులు బయట కనీసం రూ.2000 వరకు ఖర్చుఅవుతుందని, అలాంటి టెస్టులను ఇక క్కడ ఉచితంగా చేస్తున్నామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కార్పొరేటర్ ఎర్రంశెట్టి పద్మావతి, నూకవరపు బాలాజీ, ఎర్రంశెట్టి వేణు, రాజేష్ తదితరులు సహకరించారన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు జల్లెపల్లి తేజస్వీ, కాసుల సాయి రాజశేఖర్, చెరుకూరి జగదీష్, బడుగు పవన్‌కుమార్, గుంటుపల్లి నవీన్, జి. మాధవిలత, పేరం కుప్పస్వామి, నాయకులు యర్రగోపు నాగేశ్వరరావు, ఘంటసాల శేఖర్, వై. శ్రీను, యం. బాలు, రాగం సదాశివరావు, బొక్కిసం శివరామ్, మేకల బాబురావు, పొన్నెగంటి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# సుమేధలో ఘనంగా విద్యార్థి నాయకత్వ కార్యక్రమం

**గుంటూరు విద్య, జూలై 7, ప్రభాతవార్త :** కష్టపడి, ఇష్టపడి చదివితే ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను అందుకుంటారని దూరదర్శన్ ఆకాశవాణి పూర్వ వార్తా విభాగాధిపతి డాక్టర్ గుత్తికొండ కొండలరావు అన్నారు. స్థానిక ఎన్‌జిజివో కాలనీలోని సుమేధ హైస్కూల్లో "సుమేధ స్టూడెంట్ లీడర్‌షిప్" కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా విచ్చేసి ప్రసంగించారు. వ్యాఖా ్యన సరస్వతీ, ప్రాసరత్న ఏవికె సుజాత కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కొండలరావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ గాంధీ, కలామ్ వంటి సామాన్యులు అసామాన్యులుగా ఎలా రూపాంతరం చెందారో మనం కూడా అలా అభివృద్ధి




పథంలో పయనించాలన్నారు. గుంటూరు కార్యాలయ జిఎస్టీ సహాయ కమిషనర్ కె. కేధారేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు తన విజయగాధని తెలియచేసి చైతన్య పరిచారు. సుమేధ హైస్కూల్ వ్యవస్థాపకులు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యఅతిధి కీలకోపన్యాసం చేసిన జి. కొండలరావు కి కృతజ్ఞతలు తెలిపి, విద్యార్థుల తరపున ఘన సన్మానం చేశారు. అనంతరం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు మాత్రమే కాదని రేపటి నాయకులు కూడా అని అభివర్ణించారు. ఎస్పీఎల్‌గా దూదేకుల మహబూబ్ సుభాని, ఏఎస్పీఎల్-1గా ద్రోణం రామ్ పవన్ తేజ, ఏఎస్పీఎల్ 2గా గుణశ్రీ అవంతిక పాఠశాల ఎన్నికల్లో పోటిచేసి గెలుపొందిన వారిచే ప్రతిజ్ఞ చేయించి, అతిధులచే విద్యార్థులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రిన్సిపాల్ కె. రాంబాబు, ఆనం మెడికల్ హబ్ ఛైర్మన్ ఆనం సంజీవరెడ్డి, ధర్మపీఠం నిర్వాహకులు డాక్టర్ ఎస్. చంద్రశేఖర్, ఎస్. సంతోష్, అధ్యక్షులు శశికిరణ్, ఉపాధ్యక్షులు ప్రహరి ్షత, సహాయ కార్యదర్శి యర్రంశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వారాహీ విద్య ఉపాసనా విద్య

**గుంటూరు కల్చరల్. జూలై 7 ప్రభాతవార్త :** స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికగా వారాహి వైభవం అనే అంశంపై సుందర సత్సంగ్ సభ్యులు, సుందర చైతన్యానంద స్వామి శిష్యులు పూజ్యశ్రీ కె.వి. కోటేశ్వరరావు ప్రవచనాన్ని ప్రారంభిస్తూ సనాతన ధర్మం మహా వాఙ్మయం కలిగిందన్నారు. వారాహిమాత కలికల్మష నాశిని, మంగళదాయని, నరక నివారిణి, వారాహి విద్య ఉపాసనా విద్యాహానికి, పరానికి, పరమార్థానికి ఉపయోగపడే విద్య పరమ పావనమైన భక్తి, సత్కర్మలతో బ్రహ్మజ్ఞాన స్థితి లభిస్తుంది. వారాహి అమ్మవారిని ఉపాసిస్తే కలికల్మషాలు నశించి



తరిస్తారు. ఎవరి రుణమైన తీర్చవచ్చుగాని మన మహారు ్షల రుణాన్ని తీర్చలేము, మనకు జీవిత పరమార్థాన్ని తెలియజేసి సంస్కారాలను అందజేసిన వారు మన రుషులు, పంచభూతాలు పరమాత్మా స్వరూపమైనప్పుడు ప్రపంచంలోని ప్రతి వస్తువు పవిత్రమైనదే కదా. మన దృష్టి జ్ఞానమైనప్పుడు ప్రతి దానిలో పరమాత్మ సాక్షాత్కారం లభిస్తుందన్నార. కార్యక్రమాలను తొలుత ఆలయ పాలకమండలి ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి వూటుకూరి నాగేశ్వరరావు, సుందర సత్సంగ్ సభ్యులు మన్నవ రవిప్రసాద్, పి. శివారెడ్డి, ఏకాంబరేశ్వరరావు, బసవేశ్వరరావు, కాట్రగడ్డ శాంతి, వి. లక్ష్మి పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

# పోలీసు విధులలో డ్రైవర్ బాధ్యత కీలకం

**-శిక్షణలో నేర్చుకున్న మెళకువలను ఆచరించాలి-కుటుంబ బాధ్యత దృష్టిలో ఉంచుకొని అప్రమత్తతతో వ్యవహరిస్తూ వాహనాన్ని నడపాలి -బాపట్లజిల్లా ఎస్పీ తుషార్ డూడి**

**బాపట్ల, జులై7, ప్రభాతవార్త:** పోలీస్ విధులలో డ్రైవర్ బాధ్యత కీలకమైనదని జిల్లా ఎస్పీ తుషార్ డూడి అన్నారు. జిల్లా పోలీస్ వాహన డ్రైవర్లకు నిర్వహించే డ్రైవర్ ప్రొఫిషియెన్సీ స్కిల్ ఎన్హాన్స్‌మెంట్ క్యాప్సూల్ కోర్స్ ను సోమవారం స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జిల్లా ఎస్పీ ప్రారంభించారు. శిక్షణలో భాగంగా ప్రదర్శించిన వాహన విడిభాగాలను ఎస్పీ పరిశీలించారు. అధునాతన డ్రైవింగ్ నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, ప్రమాద నివారణ సాంకేతికతలు, వాహనాల నిర్వహణ, వీవీఐపీ కాన్వాయ్ ప్రోటోకాల్స్ పాటించడం, అత్యవసర పరిస్థితులలో డ్రైవర్లు మరింత భద్రంగా, వృత్తిపరమైన పరిపక్వతతో విధులు నిర్వహించేందుకు అవసరమైన నైపుణ్యాలను మెరుగుపరచడం వంటి అంశాలపై ఈ కోర్సు ద్వారా శిక్షణ ఇవ్వబడుతుంది. జులై 7వ తేదీ నుండి 10వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు పోలీస్ డ్రైవర్లకు ఈ కోర్సు నిర్వహించబడుతుంది. సిబ్బందిని రెండు బ్యాచ్‌లుగా విభజించి, ఒక్కో బ్యాచ్ కు రెండు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణ తరగతిలో 40 మంది పోలీస్ డ్రైవర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయనే విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ప్రధానంగా మానవ తప్పిదాలు మరియు వాహన నిర్వహణ లోపాల వలన రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. వాహనాల పనితీరు, బ్రేక్‌లు, టైర్లు వంటి అంశాలను ఎప్పటికప్పుడు



పరిశీలించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన తెలిపారు. ప్రతి డ్రైవర్ తన వాహనం పరిస్థితిని సరిగ్గా తెలుసుకొని, వాహనం ఎంత వేగంలో నడపాలో స్పష్టంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలీస్ విధులు ఎప్పుడు ఏ విధంగా ఉండబోతాయో ముందుగానే ఊహించలేమని, అత్యవసర పరిస్థితులలో, సుదూర ప్రాంతాలకు అధికారులను, సిబ్బందిని తీసుకెళ్లవలసి వచ్చినప్పుడు వాహనాన్ని ఎక్కువసేపు నడపడం వలన అలసట కలగవచ్చని, నిద్రమత్తులోకి జారుకునే అవకాశం ఉంటుందన్నారు. అటువంటి సమయంలో వాహనంలో ఉన్న అధికారికి విషయం తెలిపి, తక్షణం విశ్రాంతి తీసుకోవాలన్నారు. నిద్రమత్తులో ఉన్నప్పటికీ వాహనం నడపగలమనే ఓవర్ కాన్ఫిడెన్స్ ప్రమాదకరమని గుర్తించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు మనం పాటించినా, ఎదుటివారు పాటించకపోవడం వల్ల కూడా ప్రమాదాలు జరగవచ్చని, అందువలన ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సాధారణ మనిషి రెండు కన్నులతో చూస్తే, పోలీస్ వాహనం నడిపే డ్రైవర్ నాలుగు కన్నులతో చూసేంత అప్రమత్తత కలిగి ఉండాలని సూచించారు. ముందు, వెనుక, చుట్టూ పర్యావరణాన్ని గమనిస్తూ వాహనం నడపాలన్నారు. వాహనాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, మంచి పనితీరులో ఉంచుకోవాలని, ఏదైనా రిపేర్ అవసరమైతే వెంటనే చేయించుకోవాలన్నారు. మీపై ఆధారపడే కుటుంబ సభ్యులను గుర్తుంచుకొని అప్రమత్తంగా వాహనం నడపాలన్నారు. మీ వాహనంలో ప్రయాణిస్తున్న అధికారిని సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చే బాధ్యత డ్రైవర్ పై ఉందన్నారు. జిల్లాలోని పోలీస్ వాహన డ్రైవర్లు సురక్షితంగా వాహనాలను నడిపించేందుకు రెండు రోజుల పాటు ప్రొఫిషియెన్సీ స్కిల్ ఎన్హాన్స్‌మెంట్ క్యాప్సూల్ కోర్స్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, ఇందులో నేర్పించిన మెళకువలను అంకితభావంతో నేర్చుకొని ఆచరించాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్.డి.ఎస్.పి పి.విజయ సారధి, బాపట్ల మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ భాను వెంకట రంగారావు, ఎమ్.టి ఆర్ఐ శ్రీకాంత్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పి.ఎం.సూర్య ఘర్ పథము క్రింద ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేయాలి

**బాపట్ల, జులై7, ప్రభాతవార్త:** పి.ఎం.సూర్య ఘర్ పథము క్రింద ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో



పీఎం సూర్యఘర్ పథకాన్ని పూర్తిస్థాయిలో ఆమలు చేయడానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, డివిజనల్ అభివృద్ధి అధికారులు సంయుక్తంగా కృషి చేయాలని ఆయన చెప్పారు. పీఎం సూర్య ఘర్ కార్యక్రమం రిజిస్ట్రేషన్లు ముందంజలో ఉన్న జె పంగులూరు మరియు నగరం మండల పరిషత్ అభివృద్ధి అధికారులను జిల్లా కలెక్టర్ అభినందించారు. సంతమాగులూరు, మార్టూరు, కొరిశపాడు, కొల్లూరు, బాపట్ల, వేమూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు సూర్యఘర్ రిజిస్ట్రేషన్లు చేయడం లో నిర్లక్ష్యంగా ఉన్నారని పద్ధతి మార్చుకోవాలని కలెక్టర్ హెచ్చరించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు మరియు డి.ఆర్.డి.ఏ ఏ.పి.ఎంలు గ్రామస్థాయిలో ఈ కార్యక్రమం పై విస్తృత ప్రచారం కల్పించాలని ఆయన చెప్పారు. జిల్లాలో పి4 కార్యక్రమం బాగా ఆమలు జరిగిందని ఈ విషయంపై ముఖ్యమంత్రి నుండి అభినందనలు వచ్చాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, డి.ఆర్.డి ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మీ, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వర రావు, జిల్లారవాణా శాఖ అధికారి పరంధామ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శివ పార్వతి, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాధా మాధవి ,బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి పి. గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

# అర్జీదారుల సమస్యలు పునరావృతం కాకుండా చూడాలి


బాపట్ల, జులై07, ప్రభాతవార్త: అర్జీదారుల సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని



అధికారులను బాపట్ల జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలలనుండి అర్జీదారులు కలెక్టర్‌కు వినతి పత్రాలు ఇచ్చి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దేశానికే తలమానికంగా సుపరిపాలన ఏకైక లక్ష్యం

**బాపట్ల, జులై 07, ప్రభాతవార్త:** దేశానికే తలమానికంగా సుపరిపాలన ఏకైక లక్ష్యమని బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనను పురస్కరించుకుని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషి ఎనలేదన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్న కూడా తల్లికివందన అమలు చేశాము, దేశంలో ఎక్కడా లేనివిధంగా పెన్షన్లు ఇస్తున్నాం, ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నాం, అన్న క్యాంటీన్ ప్రారంభించాం ఆర్థిక వనరులు సమకూర్చుకొని అహర్నిశలు కష్టపడి కూటమి



తెలుగుదేశం కార్యక్రమాన్ని సోమావారంపట్టణంల ోని 29, 28, 27 వార్డులలో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు నిర్వహించిఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల గురించి ఎమ్మెల్యే వివరించారు. కూటమి ప్రభుత్వ ఏడాది పరిపాలన సూపర్ సిక్స్ పథకాల పై ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకి ఇచ్చిన హామీలను సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రతి ఇంట్లో వెలుగులు నింపేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం బాధ్యతా సాహిత్యంగా వ్యవహరించడం వల్లే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిందని దాని నుంచి బయట పడేందుకు ప్రభుత్వం అద్భుతమైన కార్యక్రమాలు చేస్తుందని తెలియజేశారు. బాపట్ల నియోజకవర్గాన్ని పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తామని, నిరుపేద లేని సమాజ స్థాపనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యం అని ఉద్ఘాటించారు. పి4 విధానాన్ని రాష్ట్రంలో ప్రవేశ పెట్టి పేదలను ఆదుకునే దిశగా కూటమి ప్రభుత్వం ముందుగు సాగుతోందని స్థానిక ప్రజలకు తెలియజేసారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా చూస్తూ రాష్ట్ర రాజధాని, పోలవరం ప్రాజెక్ట్ కు నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలనే దృఢ సంకల్పంతో ఎన్డిఏ సర్కారు పనిచేస్తోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివ సాంబి రెడ్డి, బాపట్ల పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్ ఛార్జ్ మందపాటి ఆంద్రెయ, యూనిట్ ఇన్ ఛార్జ్ చాపా సోమయ్య, పట్టణ వైస్ ప్రెసిడెంట్ బుర్లె రామ సుబ్బారావు, 29వ వార్డు ప్రెసిడెంట్ పులి శ్రీనివాసరావు, 28వ వార్డు ప్రెసిడెంట్ కొట్రా జానకిరామయ్య, 27వ వార్డు ప్రెసిడెంట్ చాపా ప్రశాంత్ , క్లస్టర్ యూనిట్ , బూత్ ఇన్ ఛార్జ్ లు మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సిఏ ఫలితాల్లో 10 ఆలిండియా ర్యాంకులు సాధించిన మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు

**గుంటూరు విద్య, జూలై 7, ప్రభాతవార్త :** ఇటీవల ఐసిఏఐ ప్రకటించిన సిఏ ఫైనల్, సిఏ ఇంటర్ మరియు సిఏ ఫౌండేషన్ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు 10ఆలిండియా ర్యాంకులు సాధించి సత్తా చాటారని మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థల అడ్మిన్ అడ్వైజర్ సిఏ మట్టుపల్లి మోహన్ పత్రికా విలేకర్ల సమావేశంలో తెలిపారు. సిఏ ఫైనల్‌లో 5ర్యాంకులు, సిఏ ఇంటర్‌లో 2ర్యాంకులు, సిఏ ఫౌండేషన్ లో 3ర్యాంకులు వచ్చాయని మోహన్ తెలిపారు. ఇంతటి మంచి ఫలితాలు సాధించి మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థకు మంచిపేరు తెచ్చిన విద్యార్థులందరికీ సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు, మాస్టర్‌మైండ్స్ టీమ్ మెంబర్స్‌కి సిఏ మోహన్ ధన్యవాదాలు తెలిపారు.

# కూటమి ప్రభుత్వానికి అభిప్రాయ భేదాలకంటే అభివృద్దే ముఖ్యం : సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**- రూ 5.40 కోట్లతో పట్టణంలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం - తాగునీటి సరఫరా సమస్యలను పరిష్కరించండి అధికారులను ఆదేశించిన ప్రత్తిపాటి**

చిలకలూరిపేట, జులై7, ప్రభాతవార్త: వార్డుల సమస్యలపై కౌన్సిలర్లు దృష్టి పెట్టాలని, ప్రజల నుంచి వచ్చే పిర్యాదుల పరిష్కారంలో చురుకుగా వ్యవహరించాలని ప్రత్తిపాటి సూచించారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో సోమవారం వార్డు కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ ఇతర పార్టీల కౌన్సిలర్లు చెప్పినా, చెప్పకపోయినా స్థానికులతో మాట్లాడి ఆయా వార్డులలోని సమస్యలను కూడా అధికారులే పరిష్కరించాలని అన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందని, ప్రజాభిప్రాయాలను గౌరవిస్తుంది తప్ప స్వార్ధపరుల భేధాభిప్రాయాలను కాదని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. అధికారులు, సిబ్బంది పట్టణాభివృద్ధి, ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, చెత్తసేకరణ, వీధిలైట్లు, రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణం, కాలువల శుభ్రత, తాగునీటి సరఫరాపై పిర్యాదులు రాకుండా చూసుకోవాలని వారిని ఆదేశించారు. రూ 5.54 కోట్లతో డ్రైనేజీల నిర్మాణం, పట్టణంలో చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్ధిక సంఘం రెండవ విడత నిధులు రూ 1.90 కోట్లతో కౌన్సిలర్లు తమ వార్డులలో ప్రజలకు అత్యవసరమైన పనులన్నీ పూర్తిచేయాలని అన్నారు. 2025-26 ఆర్ధిక సంవత్సరానికి



సంబంధించి మంజూరైన జిపిఎస్, ఎల్ఆర్ఎస్ గ్రాంట్ రూ 3.50 కోట్లతో సిసి రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణంతో పాటు తాగునీటి సరఫరా, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని, అందుకు అవసరమైన ప్రణాళికలను అధికారులు సిద్దం చేయాలని ప్రత్తిపాటి ఆదేశించారు.

**ఆక్రమణల తొలగింపుపై వెంటనే దృష్టి పెట్టండి : అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి**

పట్టణంలో ఆక్రమణలపై వెంటనే దృష్టి పెట్టాలని, రోడ్ల విస్తరణకు ఉన్న అడ్డంకులను తొలగించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని ప్రత్తిపాటి అధికారులను ఆదేశించారు. నరసరావుపేట సెంటర్ నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వరకు, చెక్‌పోస్ట్ నుంచి కళామందిర్ కూడలి వరకు, బెంగుళూరు బేకరి నుంచి నరసరావుపేట అమృత డాబా వరకు ఉన్న ఆక్రమణలను



వెంటనే తొలగించాలని, రోడ్ల విస్తరణ పనులు చేపట్టాలని ప్రత్తిపాటి అధికారులను ఆదేశించారు. తాగునీటి బోర్లు వేయాలన్న ప్రజల విజ్ఞప్తులను పరిశీలించాలని, దాతలు, అసిస్ట్ వంటి స్వచ్ఛంద సంస్థలను సంప్రదించి బోర్లు వేయించాలన్నారు. పట్టణంలో నిరుపయోగంగా ఉన్న బావులను వెంటనే శుభ్రపరచాలని, నీటిని శుభ్రంగా తోడేసి మరలా వాటిపై చెత్తవేయకుండా ఇనుప కంచెలతో మూసివేయాలని ప్రత్తిపాటి సూచించారు. ఈ సందర్బంగా ఇటీవల హర్యానాలో జరిగిన మున్సిపల్ ఛైర్మన్ల సమావేశంలో పాల్గొని తన వాణిని వినిపించిన మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫానిని ప్రత్తిపాటి సత్కరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ పతి శ్రీహరిబాబు, మున్సిపల్ డిఈ షేక్ అబ్దుల్ రహీం, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

# వరల్డ్ స్కూల్ సమ్మిట్-2025లో శ్రీపూజిత స్కూల్‌కు "బెస్ట్ స్కూల్" అవార్డు

**గుంటూరు విద్య, జూలై 7, ప్రభాతవార్త :** స్థానిక పట్టాభిపురంలోని శ్రీపూజిత స్కూల్ థాయిల్యాండ్ రాజధాని బ్యాంకాక్‌లో జరిగిన వరల్డ్ స్కూల్ సమ్మిట్ -2025లో బెస్ట్ స్కూల్ విత్ హోలిస్టిక్ ఎడ్యుకేషన్ అవార్డు సాధించింది. ఈ అవార్డును స్కూల్ యంగ్ డైరెక్టర్ కంచర్ల హరికృష్ణ ప్రసాద్ బ్యాంకాక్ వెళ్లి 5వ తేదిన స్వయంగా అందుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ కంచర్ల పద్మావతి మాట్లాడుతూ ఈ ఘనత సాధించడానికి కారణం డైరెక్ ్టర్ కంచర్ల హరికృష్ణ ప్రసాద్ చిన్న వయస్సులోనే అసాధారణ నాయకత్వం, పాఠశాల విద్యలో కొత్త ఆవిష్కరణలను ప్రవేశపెట్టడం, శ్రేష్ఠత విషయంలో ఆచంచలమైన నిబద్ధత కలిగిఉండటం వలనే సాధ్యపడిందన్నారు. డైరెక్టర్ కంచర్ల హరికృష్ణప్రసాద్ మరో అరుదైన ఘనత కూడా సాధించారు. 'మేరీలాండ్ స్టేట్ యూనివర్సిటీ-అమెరికా' చే బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో "డాక్టరేట్" పట్టా సాధించారు. అరుదైన ఘనతలను సాధించి బ్యాంకాక్‌నుండి స్వదేశానికి వచ్చిన డైరెక్టర్ హరికృష్ణ ప్రసాద్‌కు స్కూల్ యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు ఘనంగా ఆహా ్వనం పలికి అభినందించారు. కేక్ కట్‌చేసి విద్యార్థులు తమ ఆనందాన్ని వ్యక్తపరుచుకున్నారు.



# వంగవీటి మోహనరంగా కులాలకు అతీతమైన పేదల మనిషి

## ఇర్లపాడు మోహనరంగా విగ్రాహావిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి

నాదెండ్ల,జులై7,ప్రభాతవార్త: వంగవవీటి మోహనరంగా పేదల మనిషి అని, ఆయన ఏ ఒక్క కులానికో పరిమితం కాదని మాజీమంత్రి, స్దానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. సుపరిపాలనతో తొలిఅడుగు కార్యక్రమంలో బాగంగా ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం, ఇర్లపాడు గ్రామాలలో సోమవారం నిర్వహించారు. ఇర్లపాడు గ్రామంలో గ్రామానికి చెందిన నాయకులు కృష్ణారావు,



కృష్ణం నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ప్రత్తిపాటి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంగవీటి రంగా సమాజం కోసం కష్టపడిన వ్యక్తి అని, ఆయన ఎప్పుడూ ప్రజల హృదయాలలో నిలిచి ఉంటారని ప్రత్తిపాటి తెలిపారు. రంగా కుమారుడు రాధా తనకు మంచి మిత్రుడని 2019 ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రచారానికి వచ్చారని, 2024 ఎన్నికలలో కూడా ప్రచారానికి రమ్మని ఆహ్వానించినట్లు ప్రత్తిపాటి తెలిపారు. నిస్వార్దంగా ఆలోచించే నాయకుడు వంగవీటి రాధా అని, ప్రజల కోసం కూటమి ప్రభుత్వానికి తన సంపూర్ణ మద్దతు రాధా ప్రకటించారని ఈ సందర్భంగా వివరించారు. రంగా విగ్రహ దాతలకు, కార్యక్రమ నిర్వాహకులను ప్రత్తిపాటి ప్రత్యేక అభినందనలు తెలియచేశారు.

**పవన్ వ్యాఖ్యలు ఆయన రాజకీయ పరిణితికి నిదర్శనం**

మార్కాపురంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ రాజకీయ పరిణితితో మాట్లాడారని, రాష్ట్ర ఆర్దిక వ్యవస్ద బాగుపడాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, చంద్రబాబుకే సాధ్యమన్న ఆయన వ్యాఖ్యలను ప్రజలు స్వాగతించాలని ప్రత్తిపాటి సూచించారు. పవన్‌కళ్యాణ్ మద్దతు, బిజెపి సహకారంతోనే చంద్రబాబు రాష్ట్రాన్ని ముందుకు ప్రగతిపధంలోకి నడుపుతున్నాడని ప్రత్తిపాటి చెప్పారు. జగన్ దెబ్బకు బలైపోయిన రాష్ట్రాన్ని తిరిగి నిలబెట్టే సామర్ధ్యం చంద్రబాబుకే ఉన్నాయన్నారు. పవన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకే జగన్ సహ వైసిపి నేతలు భారీ మూల్యం చెల్లించుకున్నారని ప్రత్తిపాటి తెలిపారు. కూటమి ప్రభుత్వ ఏర్పాటులో పవన్‌కీలక పాత్ర పోషించారని అన్నారు. చంద్రబాబు, పవన్‌లు సమిష్టిగా జగన్ దుర్మార్గాలను ఎదిరించి పోరాడబట్టే కూటమికి 164 సీట్లు లభించాయని ప్రత్తిపాటి తెలిపారు.

**దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమం, చంద్రబాబు అమలు చేస్తున్నారు**

దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పేదల సంతోషం కోసం చంద్రబాబు



సంక్షేమ పధకాలు అమలుచేస్తున్నారని, రూ 4వేల ఫించన్ ఇస్తున్న ఏకైక నాయకుడు చంద్రబాబేనని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలుంటే అందరికి రూ 13వేల వంతును ప్రభుత్వం అందించిందని అన్నారు. రూ 2వేలను పాఠశాల అభివృద్ధికి కేటాయించి, తల్లిదండ్రుల సూచనల ప్రకారమే విద్యాసంస్దలను అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. అర్హులైన వారికి తల్లికి వందనం, ఫించన్లు అందకుంటే సచివాలయ సిబ్బందే భాద్యులవుతారని అన్నారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, నిరుద్యోగ భృతి అమలవుతాయని ప్రత్తిపాటి తెలిపారు. జలజీవన్ మిషన్‌క్రింద ప్రతి గ్రామానికి తాగునీరు అందుతుందని అన్నారు. బనకచర్ల ప్రాజెక్ట్ పూర్తయితే నియోజకవర్గానికి తాగు, సాగునీటి సమస్య ఉండదని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రభుత్వం రోడ్ల నిర్మాణం పూర్తిచేసిందని అన్నారు. కూటమి నాయకులు ప్రజలలో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి విచ్చేయాలని, ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన మంచిన ప్రజలు గుర్తించాలని ప్రత్తిపాటి కోరారు. ఇర్లపాడు, అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామాలలోని తాగునీటి సమస్య త్వరలో పరిష్కారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకలు నెల్లూరి సదాశివరావు, బండారుపల్లి సత్యనారాయణ, గుర్రం నాగపూర్ణచంద్రరావు, పూనాటి కోటేశ్వరరావు, కామినేని నాగేశ్వరరావు, కామినేని రామాంజనేయులు, కృష్ణమ నాయుడు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తోట రాజారమేష్, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇంగ్లీష్ విభాగంలో పీహెచ్‌డి ప్రదానం

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జులై7, ప్రభాతవార్త:** వర్సిటీలోని ఇంగ్లీష్ విభాగంలో ఆచార్య బి.కరుణ పర్యవేక్షణలో పరిశోధన చేసినందుకు దీపావత్ బాలూ నాయక్ కు పీహెచ్‌డి డిగ్రీని ప్రదానం చేసినట్లు రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ తాత్కాలిక కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. ఎ కంపారిటివ్ స్టడీ ఆఫ్ ఎల్‌యస్‌ఆర్‌డబ్ల్యూ ప్రొఫిషియెన్సీ అయాంగ్ ట్రైబల్ అండ్ నాన్ ట్రైబల్ స్టూడెంట్స్ ఇన్ సెలెక్ట్ డిస్ట్రిక్ట్స్ ఆఫ్ సౌత్ కోస్టల్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై బాలూ నాయక్ పరిశోధన చేశారు.



# కారంపూడిలో ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

**కారంపూడి, జులై 7 ప్రభాతవార్త:** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధిపతి, దళపతి పద్మశ్రీ మంద కృష్ణ మాది జన్మదిన వేడుకలు, ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కారంపూడి మండలంలో ఘనంగా నిర్వహిచారు. మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో ఎమ్మార్పీఎస్ దిమ్మెను ఏర్పాటు చేసి దండోరా జెండాను ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌ఛార్జి కోటేశ్వరరావు ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో జెండా వందనాలను నిర్వహిస్తున్నారన్నారు. మంద కృష్ణ మాదిగ 31 సంవత్సరాల సుదీర్ఘ కాల పోరాటంతో రిజర్వేషన్లు సాధించుకోగలిగామన్నారు. కారంపూడి మండలం అధ్యక్షుడు తాళ్లూరు జీవరత్నం మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ దండోరా జెండాను ఆవిష్కరించడం, మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలకు కేక్ కటింగ్ చేసి సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఇన్‌ఛార్జి, మండల నాయకులు, టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ముత్తయ్య, మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాలువ పేరయ్య ఒప్పిచర్ల గ్రామ అధ్యక్షుడు ఉపాధ్యక్షుడు మండల ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



# కారంపూడిలో ఘనంగా మొహర్రం

**కారంపూడి, జులై 7 ప్రభాతవార్త:** కుల మతాలకు అతీతంగా మొహర్రం పండుగను మండలంలోని ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. కారంపూడి, గాదెవారిపల్లి, పెద్దకొదమగుండ్ల, చింతపల్లి, పేటసన్నెగండ్ల గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ వేషధారణలతో పలువురు ఆకట్టుకున్నారు. పీర్లను గత రాత్రి నుంచి గ్రామంలో ఊరేగింపు నిర్వహించి పీర్ల చావిడికి తరలించారు. మొహర్రం సందర్భంగా పీర్లను గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు

నరసరావుపేట, జూలై 7 ప్రభాతవార్త : మండలంలోని పాలపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య, పులిమి రామిరెడ్డి, మార్కెట్‌యార్డు ఛైర్మన్ పూనాటి శ్రీనివాసరావులు పాల్గొన్నారు. అదే విధంగా పట్టణంలోని 17వార్డు పరిధిలోని వరవకట్టలో పట్టణ నాయకులు కొట్టా కిరణ్, గూడూరు శేఖర్, బాజీ , నాగజ్యోతి, షేక్ మాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో గడిచిన ఏడాది కాలంలో అన్ని వర్గాలకు ప్రజలకు చేసిన మంచిని, అందించిన సంక్షేమ పథకాలు , రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వ అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే తల్లికి వందనం కార్యక్రమం ద్వారా ఇంటిలో చదువుకునే ప్రతి బిడ్డకు రూ.13వేలు అందించటం జరిగిందన్నారు. అదే విధంగా ప్రతి నెల పెంచిన పెన్షన్ 1వ తేదిన క్రమం తప్పకుండా అందిస్తున్నామని తెలిపారు. రైతులను ఆదుకునేందకు ఈ ఏడాది రూ.20వేలను అందించే కార్యక్రమం ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మరి కొద్ది రోజులలో అందుబాటులోకి వస్తుందని టిడిపి నాయకులు వివరించారు. మంచిప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని, అండగా ఉండాలని ఈ సందర్భంగా నాయకులు విజ్ఞప్తి చేసారు.



# నియోజకవర్గంలో పర్యటించిన వైకాపా జిల్లా అధ్యక్షులు గోపిరెడ్డి

నరసరావుపేట, జూలై 7 ప్రభాతవార్త : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సోమవారం నియోజక వర్గంలో పర్యటించారు. పట్టణంలోని 31 వార్డుకు చెందిన వైఎస్సార్‌సిపి సీనియర్ నాయకులు పొలం కోటిరెడ్డి కనుమూసారు. సమాచారం తెలుసుకుని డా.గోపిరెడ్డి వారి భౌతికకాయానికి సందర్శించి పూలమాలలు వేసి నివాళి తెలిపారు. ఆయన మృతి పట్ల సంతాపం, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ వారి కుటుంబానికి అండగా నిలుస్తుందన్నారు. కోటిరెడ్డి పార్టీకి చేసిన సేవలను గుర్తు చేసారు. డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెంట స్దానిక పార్టీ వార్డు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



# జంగాలపల్లె రోడ్డులో జ్యోతి స్పన్ పోల్స్ ఫ్యాక్టరీ ప్రారంభించిన చీఫ్‌విప్ జీ.వీ

**నూజెండ్ల,జులై7,ప్రభాతవార్త:** మండలంలోని జంగాలపల్లె రోడ్డులో నూతనంగా నిర్మించిన శ్రీ



జ్యోతి స్పన్ పోల్స్ ఫ్యాక్టరీని ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ మక్కెన, మేనేజింగ్ డైరెక్టర్ సాయి దంపతులు, ముత్తినేని వెంకటేశ్వర్లు, ముత్తినేని గిరిబాబు, రాధాకృష్ణ, మణి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంతో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం

**కొల్లిపర,జూలై 7 ప్రభాతవార్త:** ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని ప్రకృతి వ్యవసాయాధికారి మాధవి అన్నారు.సోమవారం



స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో రైతు సాధికార సంస్థ ఆద్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయల పంటలను కొల్లిపర మండలటీమ్ ప్రదర్శన నిర్వహింసారు.ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతోనే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు .కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యానిట్ ఇన్‌ఇన్‌చార్జ్‌లు నాగజ్యోతి,సుధారాణి,రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు పెంచటంతో పర్యావరణం పరిరక్షించుకోవచ్చు

**-ప్రధానోపాధ్యాయుడు శ్రీమన్నారాయణ**

**కొల్లిపర,జూలై 7 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని పెంచటం వలన పర్యావరణం పరిరక్షించుకోవటంతో పాటు, ప్రజారోగ్యానికి కూడా మేలు కలుగుతుందని ప్రధానోపాధ్యాయుడు



శ్రీమన్నారాయణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని వల్లభాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వనమహోత్సవంలో భాగంగా విజ్ఞాన్ యూనివర్సిటీ అగ్రికల్చర్ విద్యార్థులతో కలసి ఆయన మొక్కలు నాటారు.ఈ సందర్భంగా శ్రీమన్నారాయణ మాట్లాడుతూ వర్షాలు పడాలంటే చెట్లను తప్పనిసరిగా పెంచాలన్నారు.కార్యక్రమంలో వీఆర్ఓ ఆళ్ళ సుష్మా,పీడీ నాగమోహన్, ఉపాధ్యాయులు డేవిడ్,సాంబశివరావు, గోపి, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలకు చట్ట పరిధిలో తగిన పరిష్కారం : గుంటూరుజిల్లా ఎస్పీ సతీష్

**గుంటూరు తూర్పు, జులై 7 (ప్రభాతవార్త) :** జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదులు-పరిష్కారాల వ్యవస్థ కార్యక్రమంనకు విచ్చేసిన ప్రజల వద్ద ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలకు చట్ట పరిధిలో తగిన పరిష్కారం చూపిస్తామని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా నలమూలల నుండి విచ్చేసిన ప్రజలతో పోలీస్ అధికారులు ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేస సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. అదనపు ఎస్పీ కె.సుప్రజ, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఫిర్యాదుల వద్దకు వెళ్ళి వారి ఫిర్యాదులు స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అదనపు ఎస్పీలు జి.వి.రమణమూర్తి, కె.సుప్రజ, ఏ.హనుమంతరావు, మహిళా పోలీస్ స్టేషన డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# మాచర్ల పట్టణంలో ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

**మాచర్ల, జులై 7 ప్రభాతవార్త:** ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మాచర్ల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హాజరై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి, కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంద కృష్ణ మాదిగ చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. రిజర్వేషన్ ప్రకటించి మాదిగ జాతికి వెన్నుదన్నుగా నిలబడిన కూటమి ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. భవిష్యత్తులో మాదిగలు మరింతగా పురోగమించాలని కోరారు. మంద కృష్ణ మాదిగకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మాచర్లలో దోమల నివారణకు చర్యలు

**మాచర్ల, జులై 7 ప్రభాతవార్త:** మాచర్ల పురపాలక సంఘ పరిధిలోని వార్డులలో దోమల నివారణకు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్



డి.వేణుబాబు తెలిపారు. పురపాలక సంఘ పారిశుధ్య విభాగ కార్మికులు ఆయా వార్డులలో కలియ తిరిగి యాంటీ లార్వా మందును స్ప్రే చేయించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా కార్యక్రమాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

# మంత్రి నారా లోకేష్ సహకారంతో బడ్డీకొట్టులు, టిఫిన్, తోపుడు బళ్లు, ప్లాట్ ఫామ్ రిక్షాలు అందజేత

**మంగళగిరి, జులై 7, ప్రభాతవార్త :** మంగళగిరి నియోజకవర్గంలో చిరు వ్యాపారుల ఆర్థికాభివృద్ధికి మంత్రి నారా లోకేష్ ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. మంత్రి నారా లోకేష్ సహకారంతో మంగళగిరి పట్టణం, మంగళగిరి రూరల్ మండలాలకు చెందిన పలువురికి బడ్డీకొట్టులు, టిఫిన్, తోపుడు బళ్లు, ప్లాట్ ఫామ్ రిక్షాలు అందజేశారు. మంగళగిరి మండలం నవులూరు గ్రామానికి చెందిన పఠాన్ ఫాతిమా, పలగాని వెంకమ్మ, ఎర్రబాలెం గ్రామానికి చెందిన షేక్ ఆషా, మంగళగిరి పట్టణంలోని 26వ వార్డుకు చెందిన షేక్



హగిమున్నీసాలకు టిఫిన్ బళ్లు, నవులూరు గ్రామానికి చెందిన మల్లెల భారతికి తోపుడు బండి, మంగళగిరి పట్టణం 5వ వార్డులోని టిడ్కోకు చెందిన నాయుడు సుబ్బరావుకు, 28వ వార్డుకు చెందిన పఠాన్ ఫాతిమాకు బడ్డీకొట్టులు అందజేయగా, మంగళగిరి పట్టణం 21వ వార్డుకు చెందిన షేక్ సుభాని, ప్రకాశం మహంకాళికి ప్లాట్ ఫామ్ రిక్షాలను ఆదివారం అందజేశారు. తమ కుటుంబ జీవనోపాధికి అవసరమైన బడ్డీకొట్టులు, టిఫిన్, తోపుడు బళ్లు, ప్లాట్ ఫామ్ రిక్షాలు అందజేయాలని మంత్రి నారా లోకేష్‌ని కోరగా వెంటనే స్పందించిన ఆయన వెంటనే బళ్లు తయారు చేయించి నాయకుల చేతుల మీదుగా శనివారం అందజేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఎల్లప్పుడూ చేయూత అందిస్తూనే ఉంటున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల కోసం మంత్రి నారా లోకేష్ చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు అమోఘం అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, పట్టణ ఉపాధ్యక్షులు వాసా పద్మ, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి అబ్దుల్ మజీద్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ సంకల్పంపై అధికారులు దృష్టి పెట్టాలి

**-ఎంపీడీఓ విజయలక్ష్మీ**

కొల్లిపర,జూలై 7 ప్రభాతవార్త: స్వచ్ఛ సంకల్పంపై దృష్టి పెట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎంపీడీఓ విజయలక్ష్మీ అన్నారు.సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా విజయలక్ష్మీ మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్డు ప్రక్కన చెత్తా చెదారం పెరిగిపోతుందని పంచాయతీ కార్మికుల చేత వాటిని తొలగించాలన్నారు.స్వచ్ఛ సంకల్పం అత్యంత ప్రాధాన్యత కార్యక్రమంగా పరిగణించి దానిపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు.గ్రామాల పరిశుభ్రతే స్వచ్ఛ సంకల్పం ధ్యేయమన్నారు.ప్రతి గ్రామంలో మురుగునీరు నిల్వ లేకుండా చూచుకోవాలన్నారు.నైదిబ్బలు రోడ్డు ప్రక్కన వేయటం వలన మురుగునీరు స్తంబించే అవకాశం ఉందని వాటిని తొలగింపుపై ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలన్నారు.దోమల నిర్మూలనకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.సమావేశంలో ఈవోపిఆర్‌డి భార్గవ్,సీనియర్ అసిస్టెంటు శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.



# దుర్గి మండలంలో ఇంటింటికి టీడీపీ

**మాచర్ల, జులై 7 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ అదధినేత, ఏపీ సీఎం నారా చంద్రబాబు ఆదేశాల మేరకు దుర్గి మండల పరిధిలోని కంచరగుంటలో సుపరిపాలనలో తొలి అడుగులు ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే



జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమం, నియోజక వర్గంలో తాగు, సాగునీరు, ప్రాజెక్టుల పరిస్థితులు, భవిష్యత్తులో రాబోయే ప్రాజెక్టుల గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరికపూడిసెల ప్రాజెక్టు పనుల జాడ ఎక్కడ?

**- బహుజన సమాజ్ పార్టీ నేత సైదులు**

**మాచర్ల, జులై 7 ప్రభాతవార్త:** మాచర్ల నియోజకవర్గంతోపాటు, ప్రకాశం జిల్లాలోని కొన్ని మండలాలు సాగు, తాగునీటి కోసం నాలుగు దశాబ్దాలుగా పాలకులు బూటకపు హామీలతో ప్రజలను మభ్య పెడుతున్నారని బహుజన సమాజ్ పార్టీ నేత గుండాల సైదులు అన్నారు. వరికపూడిసెల ప్రాజెక్టు పూర్తి చేసి ప్రజల దాహార్తిని తీరుస్తానని హామీ ఇచ్చిన నేతలు గద్దెనెక్కగానే వాటిని మరిచిపోతున్నారని ఎద్దేవ చేశారు. ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించినా పనులు మాత్రం ముందుకు సాగడం లేదన్నారు. జల్‌జీవన్ మిషన్ కింద 1200 కోట్లు కేవలం కాంట్రాక్టరు కోసమే తప్ప ఏమాగ్రం ఉపయోగం లేదని, ఆ డబ్బులు ప్రాజెక్టు పనులకు కేటాయిస్తే తాగు, సాగు నీటి సమస్య పరిష్కరించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సైదులు యాదవ్, పట్టణ అధ్యక్షులు పఠాన్ జానీ, జిల్లా కార్యదర్శి పూసలపాటి మల్లికార్జునాచారి తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్ సేవల కోసం అదనపు వసూళ్లు మానుకోవాలి

**- జనసేన నియోజకవర్గ అధికార ప్రతినిధి నక్షత్ర ప్రసాదరావు**

**మాచర్ల, జులై 7 ప్రభాతవార్త:** ప్రభుత్వం ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు కోసం టెలిఫోన్ ఎక్చేంజి, బ్యాంకు, పోస్టాఫీసులలో ప్రజలకు అవకాశం కల్పించారు. ఈ సేవలకు ప్రభుత్వం నిర్దేశిత రుసుమును నిర్ణయించారు. కానీ మాచర్ల పోస్టాఫీసులో ఆధార్ సేవల కోసం రూ.100 అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నారని జనసేన నియోజకవర్గ అధికార ప్రతినిధి నక్షత్ర ప్రసాదరావు అన్నారు. దీనిపై అధికారులు విచారణ చేసి ప్రజలపై అదనపు భారం లేకుండా చేయాలని ప్రసాదరావు కోరారు. ఈ సమావేశంలో షేక్ అబ్దుల్ షరీఫ్, బార్లపూడి మల్లికార్జునరావు, సంకూరి నరసింహారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రమాదకర స్థితిలో తాడేపల్లిలోని కొత్తూరు ట్రాన్స్‌ఫార్మర్

**తాడేపల్లి,జూలై 7,ప్రభాతవార్త :** తాడేపల్లి కొత్తూరులోని వైఎస్సార్ అండ్ కె.వి.ఆర్.వాటర్ ప్లాంట్ పక్కన గల ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెత్తాచెదారంతో పేరుకుపోయింది.నిత్యం ఎంతో రద్దీగా ఉండే ప్రాంతం ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూతా పేరుకుపోయిన చెత్తాచెదారం వలన ప్రమాదకరంగా మారింది.ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెత్త వేయడం వల్ల అది ఎప్పుడు అగి న్కి అహుతి అవుతుందోనని స్థానికులు భయంతో వణికిపోతున్నారు.ఇకనైనా సదరు మున్సిపాలిటి వారు మేల్కొని ఆ చెత్తను తొలగించి ఏ విధమైన చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.




# ఎఫ్ ఆర్టీఐ రాష్ట్ర సలహాదారునిగా బత్తుల మురళి

**నరసరావుపేట, జూలై 7 ప్రభాతవార్త :** రాష్ట్ర ఎఫ్ ఆర్టీఐ సలహాదారునిగా పట్టణానికి చెందిన బత్తుల మురళి నియమితులయ్యారు. జాతీయ అధ్యక్షులు ప్రత్తిపాటి చంద్రమోహన్ వారికి సోమవారం నియమాక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా బత్తులమురళి మాట్లాడుతూ సమాచార హక్కుచట్టం, హ్యుమన్ రైట్స్‌తో పాటు లోకాయుక్త పై అవగాహన కల్పిస్తున్న ఫోరమ్ ఫర్ ఆర్టీఐలో తనకు రా ష్ట్ర సలహాదారునిగా అవకాశం కల్పించిన పెద్దలకు కృతఘ్నతలు తెలిపారు. స్నేహితుల సహకారంతో ఎన్నోసంవత్సరాలుగా అన్నదానం వంటి ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సంస్థ సిద్దాంతాలు, ఆశయాలకొరకు కృషి చేస్తానని ఈ సందర్భంగా బత్తుల మురళి తెలిపారు. పలువురు ప్రముఖులు మురళికి అభినందనలు పేర్కొన్నారు.



# నాగమ్మ మహిళా గ్రూపు సభ్యులకు న్యాయం చేయాలని వినతిపత్రం

**నరసరావుపేట, జూలై 7 ప్రభాతవార్త :** ఇనిమెట్ల గ్రామంలో నాగమ్మ మహిళా గ్రూపుకు సంబంధించి జరిగిన మోసానికి తగినన్యాయం చేయాలని ఎంఆర్‌పిఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షులు చింతిరాల మీరయ్య అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం బాధిత గ్రూపు సభ్యులతో కలిసి జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఝాన్సీరాణి కి వారు వినతిపత్రం అందించి మాట్లాడారు. యానిమేటర్‌గాఉన్న మస్తాన్‌వలి బలహీన వర్గాలకు చెందిన మహిళలు సభ్యులుగా ఉన్న నాగమ్మ గ్రూపు



నుండి రూ.5,50,000లు తీసుకొని వారిని మోసం చేసారని తెలిపారు. జిల్లా అధికారులు 20రోజుల వ్యవధిలో బాధితులకు మస్తాన్‌వలి నుండి మొత్తం సొమ్మును రికవరీ చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసారు. కనీసం బ్యాంకు అధికారులు సైతం స్పందించక పోవటం దారుణమని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగే వరకు ఎంఆర్‌పిఎస్‌ఎస్ పోరాటం చేస్తుందని జిల్లా అధ్యక్షులు చింతిరాల మీరయ్య తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కోటేశ్వరరావు, గురవయ్య, రమేష్, ప్రశాంత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాలోని టెక్సాస్‌లో జలప్రళయం

## 82కి పెరిగిన మృతుల సంఖ్య



**టెక్సాస్, జూలై 7:** అమెరికాలోని టెక్సాస్‌లో వరదలు జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. వరదల తీవ్రత ఎంతగా ఉందంటే ఎన్నో ఇళ్లు నీళ్లలో కొట్టుకుపోయాయి. ఈ జల విపత్తులో ఎంతోమంది ప్రాణాలను కోల్పోయారు. కుండపోత వర్షాల కారణంగా సంభవించిన ఈ ఆకస్మిక వరదల్లో చనిపోయిన వారి సంఖ్య 82కు పెరిగింది. మరో 41 మంది గల్లంతయ్యారు. టెక్సాస్‌లోని కెర్ కౌంటీ, టెక్సాస్ హిల్ కంట్రీలలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాలు వరదల్లో కొట్టుకుపోవడం వల్ల, ఆయా చోట్ల 68 మంది మృతదేహాలు లభించాయి. వీరిలో 28 మంది పిల్లలే ఉండటం విషాదకరమని పోలీసు అధికారి లారీ లీథా తెలిపారు. రాష్ట్రంలోని ట్రావిస్, బుర్నెట్, కెండాల్, టోమ్ గ్రీన్, విలియమ్సన్ కౌంటీలలోనూ 10 మంది చనిపోయారని చెప్పారు. టెక్సాస్ హిల్ కంట్రీ నదీ తీరంలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరానికి హాజరైన 10 మంది బాలికలు, ఒక వ్యక్తి ఆచూకీ గల్లంతైందని పోలీసులు ప్రకటించారు. వారి క్యాబిన్లు వరదల్లో కొట్టుకుపోయాయని తెలిపారు. వారి ఆచూకీని గుర్తించే వరకు సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. వరదలు కారణంగా సెంట్రల్ టెక్సాస్ ప్రాంతం భౌగోళికంగా సమస్యాత్మకంగా ఉంటుంది. అందుకే సహాయక చర్యలు చేపట్టడం రెస్క్యూ టీమ్‌లకు పెద్ద సవాల్‌గా మారిందని అధికారులు తెలిపారు. గ్వాడలూపే నదిపై మిలిటరీ హెలికాప్టర్ సాయంతో సహాయక చర్యలుచేపట్టారు. ఈ విపత్తుపై టెక్సాస్ గవర్నర్ గ్రెగ్ అబాట్ తొలిసారిగా కీలక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వరదల్లో 41 మంది గల్లంతయ్యారని, ఈ సంఖ్య మరింత పెరగొచ్చని ఆయన వెల్లడించారు. రాబోయే రెండు, మూడు రోజుల్లో మృతుల సంఖ్య మరింత పెరగొచ్చని టెక్సాస్ ప్రజా భద్రతా విభాగం కల్నల్ ఫ్రీమన్ మార్టిన్ వెల్లడించారు. తదుపరిగా మంగళవారం వరకు భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని, వాటి వల్ల మరోసారి భీకర వరదలు సంభవించవచ్చని ఆయన హెచ్చరించారు. నదులు కూడా ఉప్పొంగి ప్రమాదకర వరదలను సృష్టించే అవకాశం ఉందంటూ కెర్ కౌంటీలోని ప్రజల ఫోన్లకు అత్యవసర సందేశాలు అందాయి. ప్రజలను అప్రమత్తం చేసేందుకు కెర్ కౌంటీలో ఉన్న క్యాంప్ మిస్టిక్ వద్ద ఈ అంశంపై లౌడ్ స్పీకర్లతో అనౌన్స్‌మెంట్లు చేయించారు. వెంటనే క్యాంప్ మిస్టిక్ పరిసరాలను వదిలి వెళ్లాలని ప్రజలకు సూచించారు. కాగా, టెక్సాస్ వరదల్లో చిక్కుకున్న 850 మందిని రక్షించామని అధికారులు ప్రకటించారు. వరదలకు విరిగిపోయిన చెట్లు సహాయక చర్యల్లో రెస్క్యూ సిబ్బంది వాయువేగంతో స్పందించారాన్నారు. జులై 4న టెక్సాస్ రాష్ట్రంలో కుండపోత వర్షాలు కురిశాయి. ఆరోజు అర్ధరాత్రి 1 గంటలకు టెక్సాస్‌లోని గ్వాడలూపే నదిలో నీటిమట్టం వేగంగా పెరగసాగింది. దీన్ని మొట్టమొదట అరోల్డో బరేరా అనే వ్యక్తి కళ్లారా చూశాడు. ఈ నదీతీరంలోనే ఏర్పాటుచేసిన ఒక సమ్మర్ క్యాంప్‌లో ఆయన ఫెసిలిటీస్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. దీనిపై వెంటనే అరోల్డో బరేరా తన బాస్‌కు సమాచారాన్ని అందించారు. ఆ వెంటనే నదీతీరంలో ఉన్న క్యాంపును మరో ప్రదేశానికి తరలించారు. క్యాంపులో ఉన్న దాదాపు 70 మంది పిల్లలు, పెద్దలను సురక్షిత ప్రదేశానికి తీసుకెళ్లారు. అయితే సమీపంలోని హంట్ అనే ప్రాంతంలో ఉన్న మరో సమ్మర్ క్యాంపును వరద జలాలు కుదిపేశాయి. అయితే అక్కడ వెంటనే సహాయక చర్యలు చేపట్టి, క్యాంపులో ఉన్న పిల్లలు, పెద్దలను రక్షించారు. వారిని సురక్షిత ప్రదేశాలకు తరలించారు.

# ముంబై ఉగ్రదాడులకు సహకరించింది నేనే!



## విచారణలో తహవూర్‌రాణా ఒప్పుకోలు

**ముంబయి,జూలై 7:** ముంబై 26/11 ఉగ్రదాడుల కేసులో ప్రధాన కుట్రదారుడైన తహవూర్ హుస్సేన్ రాణా, విచారణలో సంచలన విషయాలు వెల్లడించాడు. సుదీర్ఘ దౌత్య పోరాటం తర్వాత భారత్‌కు అప్పగించబడిన 64 ఏళ్ల రాణా, ముంబై పోలీసుల క్రైమ్ బ్రాంచ్ విచారణలో దాడుల వెనుక ఉన్న కుట్ర గుట్టు విప్పాడు. దాడుల మాస్టర్‌మైండ్ డేవిడ్ కోల్‌మన్ హెడ్లీకి తాను ఎలా సహాయపడిందీ పూసగుచ్చినట్లు వివరించాడు. ముంబైలోని ఛత్రపతి శివాజీ టెర్మినస్ వంటి ప్రధాన ప్రాంతాలను లక్ష్యాలుగా గుర్తించడంలో హెడ్లీకి సహకరించానని రాణా అంగీకరించాడు. దాడులకు ముందు ఉగ్రవాదులు నిఘా పెట్టేందుకు వీలుగా 'ఇమ్మిగ్రెంట్ లా సెంటర్' పేరుతో ఒక ముసుగు కంపెనీని ఏర్పాటు చేయాలనే ఆలోచన తనదేనని రాణా ఒప్పుకున్నాడు. ఈ కంపెనీ ముసుగులోనే హెడ్లీ భారత్‌లోని పలు నగరాల్లో పర్యటించి సమాచారం సేకరించాడు. గతంలో తాను పాకిస్థాన్ సైన్యంలో కెప్టెన్ హోదాలో డాక్టర్‌గా పనిచేసినట్లు రాణా వెల్లడించాడు. సియాచిన్ వంటి సున్నిత ప్రాంతాల్లో పని చేస్తున్నప్పుడు అనారోగ్యం కారణంగా విధులకు దూరమవడంతో తనను సైన్యం నుంచి పారిపోయిన వ్యక్తిగా ప్రకటించారని తెలిపాడు. ఈ రికార్డును సరిచేయిస్తానని హెడ్లీ హామీ ఇవ్వడంతోనే తాను ఉగ్రకుట్రలో భాగమైనట్లు చెప్పాడు. పాకిస్థాన్ సైనిక యంత్రాంగం, గూఢచార సంస్థ ఐఎస్ఐ, లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థలతో తాను చురుగ్గా సమన్వయం చేసుకున్నట్లు అంగీకరించాడు. దాడుల సూత్రధారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సాజిద్ మీర్, అబ్దుల్ రెహ్మాన్ పాషా, మేజర్ ఇక్బాల్ వంటి పాక్ అధికారులు తనకు తెలుసని కూడా రాణా అంగీకరించినట్లు సమాచారం. నవంబర్ 2008లో దాడులకు కొద్దిరోజుల ముందు తాను ముంబైలోని పోవాయ్‌లో ఒక హోటల్‌లో బస చేసి, దాడులకు ముందు దుబాయ్ మీదుగా బీజింగ్ వెళ్లిపోయినట్లు రాణా విచారణలో తెలిపాడు. ఈ కేసులో రాణా పాత్రను 14 మంది సాక్షులు ధృవీకరించినట్లు క్రైమ్ బ్రాంచ్ తన ఛార్జిషీట్‌లో పేర్కొంది.

# బంగ్లాను ఖాళీ చేసేస్తున్నా.. మాజీ చీఫ్‌జస్టిస్ చంద్రచూడ్ వెల్లడి



**న్యూఢిల్లీ, జూలై 7:** మాజీ సీజేఐ డీవై చంద్రచూడ్ తనకు కేటాయించిన అధికారిక బంగ్లాను ఇంకా ఖాళీ చేయలేదు. కాలపరిమితి దాటినా ఆయన ఆ ఇంటి నుంచి వెళ్లిపోవడం లేదు. దీంతో విసుగెత్తిన సుప్రీంకోర్టు రెండు రోజుల క్రితం కేంద్రానికి లేఖ రాసింది. మాజీ సీజేఐ డీవై చంద్రచూడ్‌పై విమర్శలు రావడంతో ఆయన స్పందించారు. ఇంట్లో ఉన్న లగేజీ మొత్తం ప్యాక్ చేసుకున్నామని, త్వరలోనే భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి మరో ప్రభుత్వ కిరాయి ఇంటికి వెళ్లనున్నట్లు చెప్పారు. చంద్రచూడ్ భార్య కల్పన కాగా, ఆ జంటకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఆ ఇద్దరూ దివ్యాంగులే. అయితే సీజేఐగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి న్యూఢిల్లీలోని కృష్ణ మీనన్ మార్గ్ 5లో ఆయన నివాసం ఉంటున్నారు. తనకు కేటాయించిన ప్రభుత్వ బంగ్లాలో ఎందుకు ఎక్కువ సమయం ఉండాల్సి వస్తుందో డీవై చంద్రచూడ్ చెప్పారు. ప్రస్తుతం ఆ ఇంట్లో ఉన్న లగేజీని ప్యాకప్ చేశామని, కొంత లగేజీ కొత్త ఇంటికి తరలించామని, కొంత స్టోర్‌రూమ్‌లో ఉందన్నారు. సీజేఐ డీవై చంద్రచూడ్ 2024, నవంబర్ 8వ తేదీన రిటైర్ అయ్యారు. బంగ్లా ఎక్స్‌టెషన్ గురించి పలుమార్లు ప్రభుత్వాన్ని కోరినట్లు ఆయన తెలిపారు. అయితే తన కూతుళ్లు దివ్యాంగులని, వాళ్లు ఎప్పుడూ వీల్‌ఛైయిర్‌లో ఉంటారని, వాళ్ల ఆరోగ్యం దృష్ట్యా బంగ్లా ఖాళీ చేయడం ఆలస్యం అయ్యిందన్నారు. కూతుళ్లు ప్రియాంకా, మహి వింత వ్యాధితో బాధపడుతున్నారని, వాళ్ల అవసరాలు కూడా ప్రత్యేకంగా ఉంటాయని, కూతుళ్లు ఇద్దరికీ నిమలైన్ మయోపథి అనే వ్యాధి ఉందని, జన్యుపరమైన ఆ వ్యాధి వల్ల వాళ్ల ఎముక మాంసం దెబ్బతింటుందన్నారు. ఇంట్లో ఉన్నప్పుడు వాళ్లకు చాలా ఉన్నత ప్రమాణాలతో ట్రీట్మెంట్ ఇవ్వాల్సి ఉంటుందని, ప్రత్యేకమైన నర్సులు వాళ్లను చూసుకుంటారని, కూతుళ్లకు అనువైన రీతిలో ఉండే ఇంటి కోసం వెతికామని, కానీ ఢిల్లీలో అలాంటి ఇళ్లు దొరకడం లేదని, ఇద్దరు కూతుళ్లను చూసుకోవాల్సిన బాధ్యత తమమీదే ఉందన్నారు. అయితే కొత్త ఇళ్లు పూర్తి అయిన సమాచారం అందగానే ఆ ఇంట్లోకి వెళ్లనున్నట్లు జస్టిస్ చంద్రచూడ్ తెలిపారు. తన పెద్ద కూతురు ప్రియాంకా 44 రోజుల పాటు ఐసీయూలో చికిత్స పొందినట్లు చెప్పారు. సిమ్లాలో హాలీడే కోసం వెళ్లినప్పుడు ఆ అమ్మాయి చాలా ఇబ్బందిపడినట్లు తెలిపారు. ట్రాచెస్టమీ ట్యూబ్‌తో ఆమె చికిత్స జరుగుతోందన్నారు. తమ కూతుళ్లకు నిరంతరం ఛాతి, శ్వాసకోస, నరాల సంబంధిత థెరపీ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు రెగ్యులర్‌గా పెయిన్, స్పీచ్ చికిత్స కూడా జరుగుతోందన్నారు. గతంలో మాజీ సీజేఐలు కూడా అధికార నివాసాల్లో ఎక్స్‌టెన్షన్ తీసుకున్నట్లు ఆయన గుర్తు చేశారు. సీజేఐ యూయూ లలిత్, ఎన్వీ రమణ తో పాటు ఇతర టాప్ జడ్జీలు ఆ అవకాశాన్ని వాడుకున్నట్లు చంద్రచూడ్ చెప్పారు. రిటైర్మెంట్ సమయంలో జరిగిన పరిణామాల గురించి జస్టిస్ చంద్రచూడ్ వివరిస్తూ తన తర్వాత బాధ్యతలు స్వీకరించిన సీజేఐ సంజీవ్ ఖన్నాతో బంగ్లాను ఖాళీ చేసే అంశాన్ని మాట్లాడినట్లు చెప్పారు. సీజేఐ బంగ్లాలోనే కొనసాగమని జస్టిస్ ఖన్నా తనకు చెప్పినట్లు చంద్రచూడ్ తెలిపారు. ఎందుకంటే జస్టిస్ ఖన్నా ప్రభుత్వ బంగ్లాలో ఉండాలనుకోలేదన్నారు. ఖన్నా హామీ నేపథ్యంలో చంద్రచూడ్ అక్కడే ఉంటున్నారు. రిటైర్మెంట్ తర్వాత కేవలం ఆర్నెళ్ల వరకే ఎక్స్‌టెన్షన్ ఉంటుంది. కానీ ఈ ఏడాది మే 31 వరకు అదనంగా పొడిగింపు ఇచ్చారు. ఆ కాలపరిమితి దాటడంతో చంద్రచూడ్‌ను బంగ్లాను ఖాళీ చేయాలని ఆదేశిస్తూ కేంద్రానికి సుప్రీం లేఖ రాసింది.


# శివసేన బ్రదర్స్‌ను కుదిపేస్తున్న బాల్‌థాకరే వీడియో!



**ముంబయి,జూలై 7:** మహారాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. రెండు దశాబ్దాలుగా రాజకీయంగా దూరంగా ఉంటున్న థాకరే సోదరులు ఉద్ధవ్ థాకరే, రాజ్ థాకరే మరాఠీ భాష పరిరక్షణ కోసం ఒక్కటయ్యారు. ఇదే సమయంలో, వారి తండ్రి, శివసేన వ్యవస్థాపకుడు బాల్ థాకరేకు చెందిన ఓ పాత వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో హిందీ భాషను తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా చేయడాన్ని విజయంగా అభివర్ణిస్తూ శనివారం ముంబైలో ఉద్ధవ్, రాజ్ కలిసి ఓ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా, రాబోయే ముంబై నగర పాలక సంస్థ ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తామని ఉద్ధవ్ థాకరే ప్రకటించారు. బీజేపీ ప్రభుత్వం హిందీని ప్రజలపై రుద్దడాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించబోమని ఆయన స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, బాల్ థాకరే పాత వీడియో ఒకటి ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతోంది. ఆ వీడియోలో, 'నేను మహారాష్ట్రలో మరాఠీ వాడిని కావచ్చు, కానీ భారతదేశంలో నేను హిందువును. మనం భాషా గుర్తింపుల కంటే హిందుత్వానికే ప్రాధాన్యత ఇవ్వాలని ఆయనమాట్లాడారు. తండ్రి సిద్ధాంతాలకు భిన్నంగా కొడుకులు భాషా రాజకీయాలు చేస్తున్నారంటూ కొందరు విమర్శలు చేస్తున్నారు. మహారాష్ట్రలో 1నుంచి 5వ తరగతి వరకు హిందీని తప్పనిసరి చేస్తూ ఏప్రిల్‌లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఈ వివాదం రాజుకుంది.

# భారత్ రక్షణ ఉత్పత్తులకు అంతర్జాతీయంగా డిమాండ్

## రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్



**న్యూఢిల్లీ, జూలై 7:** ఆపరేషన్ సిందూర్ తర్వాత భారతీయ రక్షణ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగిందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. 2024లో ప్రపంచ సైనిక వ్యయం 2.7ట్రిలియన్ డాలర్లకు పైగా పెరిగిందని, భారత్ కోసం ఓ పెద్ద మార్కెట్ ఎదురుచూస్తోందని అన్నారు. సోమవారం డీఆర్‌డీఓ భవనంలో డిఫెన్స్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ నిర్వహించిన కంట్రోలర్స్ కాన్ఫరెన్స్‌లో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. ప్రపంచం ఇప్పుడు మన రక్షణ రంగం వైపు చూస్తోంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో మన సైనికులు చూపిన పరాక్రమం, అలాగే మన దేశీయ పరికరాల సామర్థ్యాన్ని ప్రదర్శించిన తీరు వల్ల ఇక్కడి ఉత్పత్తులకు డిమాండ్ పెరిగింది. ప్రపంచంలోని కొన్ని దేశాల జీడీపీ కంటే భారత్ రక్షణ బడ్జెట్ ఎక్కువ. ప్రజలు కష్టపడి సంపాదించిన ఆదాయంలో గణనీయమైన భాగాన్ని రక్షణ మంత్రిత్వ శాఖకు కేటాయించినప్పుడు దానిని సమర్థవంతంగా వినియోగించే బాధ్యత కూడా పెరుగుతుంది. రక్షణ వ్యయం పెరగడం ఒక్కటే కాదు. దాన్ని సరైన లక్ష్యాల కోసం, సరైన సమయంలో, సమర్థంగా వినియోగించాల్సిన అవసరం ఉంది అని రాజనాథ్ సింగ్ చెప్పారు. 2016లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన గవర్నమెంట్ ఈ మార్కెట్ ప్లేస్ పోర్టల్ నుంచి రక్షణ ఉత్పత్తుల కొనగోళ్లకు అనుమతి ఇవ్వాలని తీసుకున్న నిర్ణయాన్ని రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. ఈ నిర్ణయం వల్ల పారదర్శకత, సమర్థత పెరుగుతుంది. అంతేకాదు సమగ్ర వేతన వ్యవస్థ, డేటాబేస్ నిర్వహణపై కూడా ఈ విభాగం పని చేస్తోందని తెలిసింది. ఇక శాంతంగా ఉన్నామంటే అది కేవలం ఒక భ్రమ మాత్రమే అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మనం ప్రశాంతంగా ఉన్న సమయాల్లో కూడా అనిశ్చితికి సిద్ధంగా ఉండాలి. ఆకస్మిక మార్పులు మన ఆర్థిక, కార్యాచరణ పరిస్థితులను మారుస్తాయి. పరికరాల ఉత్పత్తినిపెంచడమేకాదు. నూతన సాంకేతికతలతో ఎప్పటికప్పుడు వినూత్న పద్ధతుల్లో స్పందించగలిగేలా సిద్ధంగా ఉండాలని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. జులై 7 నుంచి 9 వరకు జరగనున్న ఈ కంట్రోలర్స్ కాన్ఫరెన్స్‌ను డిఫెన్స్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ నిర్వహిస్తోంది. సోమవారం ఈ సమావేశాన్ని రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, త్రివిధ దళాల అధిపతులు, రక్షణ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్, ఫైనాన్షియల్ అడ్వైజర్ ఎస్‌జీ. దస్తీదార్, డిఫెన్స్ అకౌంట్స్ కంట్రోలర్ జనరల్ మయాంక్ శర్మ పాల్గొన్నారు.

# బిలావల్‌భుట్టో వ్యాఖ్యలపై సయీద్ కుమారుడి ఫైర్!



**కరాచి,జూలై 7:** పాకిస్థాన్ మాజీ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో చేసిన వ్యాఖ్యలు ఆ దేశంలో తీవ్ర దుమారం రేపాయి. భారత్ మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులను అప్పగించేందుకు సిద్ధమంటూ ఆయన చేసిన ప్రతిపాదనపై లష్కరే తోయిబా (ఎల్ఈటీ) చీఫ్ హాఫీజ్ సయీద్ కుమారుడు తల్హా సయీద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బిలావల్ వ్యాఖ్యలను బాధ్యతారహితమైనవిగా అభివర్ణించిన తల్హా, పాకిస్థానీయులను కాకుండా భారత నాయకులనే తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. భారత్‌తో విశ్వాసం పెంచే చర్యల్లో భాగంగా హాఫీజ్ సయీద్, జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్ వంటి ఉగ్రవాదులను అప్పగించేందుకు పాకిస్థాన్‌కు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన పేర్కొన్నారు. ఇందుకు భారత్ కూడా సహకరించేందుకు సుముఖత చూపాలని అన్నారు.
ఈ వ్యాఖ్యలపై ఆదివారం ఓ వీడియో విడుదల చేసిన తల్హా సయీద్ తీవ్రంగా స్పందించారు. "శత్రుదేశమైన భారత్‌కు మా నాన్నను అప్పగించాలని బిలావల్ సూచించడం పాకిస్థాన్‌కు అంతర్జాతీయంగా అవమానం కలిగించింది. దీన్ని మేం తీవ్రంగా వ్యతిరేకిస్తాం" అని హెచ్చరించారు. భుట్టో కుటుంబం ఎప్పుడూ పాశ్చాత్య దేశాలు, భారత్ వాదనకే మద్దతు ఇస్తుందని ఆయన ఆరోపించారు. ఈ వివాదంపై లష్కరే తోయిబా రాజకీయ విభాగమైన పాకిస్థాన్ మర్కజీ ముస్లిం లీగ్ కూడా ఓ ప్రకటన విడుదల చేసింది. పాకిస్థాన్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతోంది భారతేనని ఆరోపించింది. కాగా, అమెరికా ట్రెజరీ విభాగం హాఫీజ్ సయీద్‌తో పాటు ఆయన కుమారుడు తల్హాను కూడా అంతర్జాతీయ ఉగ్రవాదుల జాబితాలో చేర్చిన విషయం తెలిసిందే.

# 'గెలాక్సీ లీడర్'ను ధ్వంసం చేసిన ఇజ్రాయెల్

## హూతీలపై దాడి!



**టెల్‌అవీవ్, జూలై 7:** దాదాపు రెండేళ్ల క్రితం హైజాక్‌కు గురైన 'గెలాక్సీ లీడర్' నౌకను ఇజ్రాయెల్ ధ్వంసం చేసింది. ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత తొలిసారి ఇజ్రాయెల్ దళాలు యెమన్‌లోని హూతీ రెబల్స్ స్థావరాలపై వైమానిక దాడులు చేశాయి. ఈ నౌకను 2023లో హూతీలు హైజాక్ చేసి యెమెన్ పోర్టులో ఉంచారు. దీనిలో 25 మంది బందీలను కొన్నాళ్ల తర్వాత విడుదల చేశారు. ఈ నౌకను ఇజ్రాయెల్‌కు చెందినదిగా సదరు రెబల్స్ అనుమానిస్తున్నారు. దీంతోపాటు ఇజ్రాయెల్‌కు చెందిన మొత్తం నౌకలను లక్ష్యంగా చేసుకొంటామని హూతీలు హెచ్చరించారు. 'గెలాక్సీ లీడర్' నౌక హైజాక్‌ను ఇజ్రాయెల్, పశ్చిమదేశాలపై సాధించిన విజయంగా చెప్పుకోవడం మొదలుపెట్టింది. తుర్కియే నుంచి భారత్‌కు వెళుతుండగా దీనిని హైజాక్ చేశారు. ఈ నౌకను హూతీలు ఇతర ఓడలపై దాడులకు వాడటం మొదలుపెట్టారు. దీనిపై ఓ రాడార్ వ్యవస్థను బిగించారు. దాని సాయంతో ఎర్రసముద్రంపై నుంచి వెళుతున్న నౌకలను ట్రాక్ చేయడం మొదలుపెట్టారు. దీంతో ఇజ్రాయెల్ దళాలు ఈ నౌకను తాజా దాడుల్లో ధ్వంసం చేశాయి. దీంతోపాటు రేవులైన హుదైద్, సలీఫ్, రస్ ఇసాలోని లక్ష్యాలపై బాంబులు వేశాయి. వీటితోపాటు ఓ విద్యుత్తు కేంద్రాన్ని కూడా పేల్చేసింది.

**ఎర్ర సముద్రంలో నౌకలపై దాడులు:** అంతకు ముందు హూతీ రెబల్స్ ఎర్ర సముద్రంలో లైబీరియా పతాకంపై ప్రయాణిస్తున్న నౌకపై దాడులు చేసింది. దీంతోపాటు గ్రీస్‌కు చెందిన బల్క్ క్యారియర్‌పై కూడా దాడి జరిగింది. డ్రోన్లు బోట్లు ఈ నౌకను ఢీకొన్నాయి. దీంతోపాటు రాకెట్ ప్రొపెల్డ్ గ్రనేడ్లతో దాడి జరిగింది.

# పంజాబ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

# మినీబస్సు కారు ఢీ: 8 మంది మృతి



**హోషియార్‌పూర్,జూలై 7:** పంజాబ్‌లోని హోషియార్‌పుర్ జిలాల్లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న మినీ బస్సు ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టి, రోడ్డుపై బోల్తా పడింది. దీంతో ఎనిమిది మంది మరణించగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఒక చిన్నారి కూడా ఉన్నాడు. ఘటనలో గాయపడిన వారిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. దాసుహాహాజీపూర్ రహదారిలోని అడ్డా సాగర్ సమీపంలో ఈ ఘోర ప్రమాదం జరిగింది. దీనితో చట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టాలని చూశారు. కానీ బస్సు బోల్తాపడి ఉండడంతో లోపల ఉన్నవారిని రక్షించేందుకు జేసీబీ వాహనాన్ని ఉపయోగించాల్సి వచ్చింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌తో సహా 15 మందికి పైగా గాయపడ్డారు. ఇక బస్సు ఢీకొనడంతో కారులోని వారికి కూడా గాయాలు అయ్యాయి. గాయపడిన వారందరినీ స్థానికులు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఇప్పటికే క్షతగాత్రుల గురించి వారి కుటుంబాలకు సమాచారం అందించాం. ప్రస్తుతం మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం పంపించాం. ప్రాథమిక దర్యాప్తులో అధిక వేగంతో బస్సు నడపడమే ప్రమాదానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తును ముమ్మరం చేశామని పోలీసులు తెలిపారు. మా ఇల్లు ఇక్కడకు సమీపంలోనే ఉంది. నేను ఇంటి బయట సెల్ ఫోన్ మాట్లాడుతూ ఉన్నాను. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి వచ్చాను. బస్సు లోపల నుంచి పిల్లలు, మహిళల అరుపులు వినిపించాయి. ఏదో ఒక విధంగా బోల్తా పడిన బస్సులోకి వెళ్లి ప్రయాణికులను ఒక్కొక్కరిగా బయటకు తీసుకువచ్చాను. ప్రస్తుతం ప్రయాణికుల పరిస్థితి చాలా దారుణంగా ఉంది. చాలా మంది అక్కడికక్కడే మరణించారు. ప్రత్యక్ష సాక్షివిచారం వ్యక్తం చేసిన సీఎంఈ ప్రమాదంపై పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సోషల్‌మీడియా వేదికగా విచారం వ్యక్తం చేశారు.

# తూర్పు ఇండోనేసియాలో బద్దలైన అగ్నిపర్వతం

## 18 కి.మీ. ఎత్తుకు ఎగసిపడుతున్న బూడిద



**పడాంగ్, జూలై 7:** తూర్పు ఇండోనేసియాలోని లెవోటోబి లకి-లకి అగ్నిపర్వతం సోమవారం బద్దలైంది. ఫ్లోర్స్ దీవిలోని మౌంట్ లెవోటోబి లకిలకిలో విస్ఫోటనాలు ఏర్పడుతున్నట్లు ఇండోనేసియా భూగర్భశాస్త్ర ఏజెన్సీ పేర్కొంది. అగ్నిపర్వతం నుంచి దాదాపు 18 కి.మీ. ఎత్తుకు మందపాటి బూడిద ఎగసిపడి సమీప గ్రామాలను కప్పివేసిందని తెలిపింది. దీంతో అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. 'అగ్నిపర్వతం విస్ఫోటనం చెందడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. త్వరగా గ్రామాలను ఖాళీ చేయించి, అక్కడి నివాసితులను ఇతర ప్రాంతాలకు తరలించడానికి చర్యలు తీసుకుంటున్నాం' అని వోల్కనాలజీ అండ్ జియోలాజికల్ హజార్డ్ మిటిగేషన్ అధికారులు పేర్కొన్నారు. అగ్నిపర్వతంలో బూడిద ఇప్పటికీ ఎగసిపడుతోందని, పెద్ద మొత్తంలో మరిన్ని విస్ఫోటనాలు సంభవించే అవకాశం ఉందని తెలిపారు. ఆకాశంలోకి భారీగా బూడిద ఎగసిపడుతుండడంతో పలు అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దయినట్లు బాలి విమానాశ్రయ అధికారులు వెల్లడించారు. గతేడాది నవంబరులో లకిలకి పర్వతం బద్దలు కావడంతో 9 మంది మరణించారు. ఈ యేడాది మార్చిలోనూ అగ్నిపర్వతం పలుమార్లు బద్దలైంది.

# ఓటర్ల జాబితాల సవరణలపై సుప్రీంలో పిటిషన్

# విచారణకు స్వీకరించిన న్యాయమూర్తుల బెంచ్

**న్యూఢిల్లీ, జూలై 7:** ఓటర్ జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఈ నెల 10న సుప్రీంకోర్టు విచారించనున్నది. ఈ కేసులో దాఖలైన పిటిషన్లను విచారించేందుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది.

ఎన్నికల కమిషన్ తీసుకున్న చర్యల చెల్లుబాటును పరిశీలించనున్నట్లు పేర్కొంది. పలువురు దాఖలుచేసిన ఈ పిటిషన్ల తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వినిపించిన వాదనలను పరిగణలోకి తీసుకున్న జస్టిస్ సుధాన్షు ధులియా, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి బెంచ్ గురువారం కేసును విచారించేందుకు అంగీకరించింది.

ఈ పిటిషన్‌లపై ఎన్నికల కమిషన్‌కు నోటీసులు జారీ చేయాలని బెంచ్‌ను సిబల్ కోరగా విచారణ జరుగుతుందని జస్టిస్ సుధాన్షు తెలిపారు. బీహార్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించాలన్న కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను సవాల్ చేస్తూ ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా, టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాతో పాటు ఏడీఆర్ సంస్థ పిటిషన్ దాఖలు చేశారు. ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకిస్తూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను వెంటనే అమలు చేయాలని ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాలను కొట్టివేయాలని మనోజ్ ఝా కోరారు.

ఈసీ ఉత్తర్వులు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (సమానత్వ హక్కు), ఆర్టికల్ 21 (జీవించే హక్కువ్యక్తిగత స్వేచ్ఛ), ఆర్టికల్ 325 (కులం, మతం, లింగం ఆధారంగా ఎవరినీ ఓటరు జాబితా నుంచి మినహాయించకూడదు), ఆర్టికల్ 326 (18 సంవత్సరాలు నిండిన ప్రతి భారతీయ పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులు)లను ఉల్లంఘిస్తుందని ఆదేశాలను రద్దు చేయాలని మనోజ్ ఝా కోరారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ రాజ్యాంగంలోని నిబంధనలు ఉల్లంఘించిందని ఎంపీ మహువా మొయిత్రా ఆరోపించారు. ఇది ఇలాగే కొనసాగితే దేశంలో పెద్ద సంఖ్యలో ఓట్లు కోల్పోయే అవకాశం ఉంటుందని పేర్కొంది. ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛాయుతమైన ఎన్నికలను బలహీనంగా మారు స్తుందన్నారు.

అఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ సైతం పిటిషన్ దాఖలు చేసింది.

# హిమాచల్‌ప్రదేశ్‌లో బ్యాంక్‌ను ముంచెత్తిన వరద

# బంగారం, డబ్బు ఏమయ్యాయో..?



**సిమ్లా, జూలై 7:** బంగారం, డబ్బు, ఆస్తిపాస్తుల దస్త్రాలు బ్యాంకుల్లో ఉంచి నిశ్చింతగా ఉంటారు ప్రజలు. కానీ హిమాచల్‌ప్రదేశ్‌లో కురుస్తున్న భారీ వర్షాలకు ఆ ఆశలు గల్లంతయ్యాయి. బ్యాంక్‌లోకి వరదనీరు ముంచెత్తడంతో తమ సొమ్ము ఏమైందోనని డిపాజిటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండి జిల్లాలోని తునాగ్ ప్రాంతంలోని ఎనిమిదివేల మంది ప్రజలకు ఒక కోఆపరేటివ్ బ్యాంక్ ఉంది. అయితే గత నెల నుంచి కురుస్తున్న వర్షాల ప్రభావం దానిపై పడింది. వాన నీరు, కొట్టుకొచ్చిన శిథిలాలు బ్యాంక్ రెండు అంతస్తుల భవనంలోని మొదటి ఫ్లోర్‌ను ముంచెత్తాయి. దాంతో దాని షటర్లు దెబ్బతిన్నాయి. ఈ విపత్తుతో కోట్లాది రూపాయల నగదు, బంగారం డిపాజిట్లపై ఎలాంటి స్పష్టత లేకుండా పోయింది. స్థానిక వ్యాపారి ఒకరు మాట్లాడుతూ 'మా ప్రాంతంలో ఉన్న బ్యాంక్ ఇదొక్కటే. చాలా కాలం నుంచి ఇది నడుస్తోంది. దీనిలో ప్రతిరోజు భారీ సంఖ్యలో లావాదేవీలు జరుగుతుంటాయి. ఇప్పుడు అందులో ఉంచిన నగదు, బంగారం, పత్రాలు ఏమైఉంటాయో?'అని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వరదల్లో ఏవైనా కొట్టుకుపోయి, దోపిడీకి గురికావొచ్చని స్థానికులు కాపలా కాస్తుండటం గమనార్హం.
జూన్ 20నుంచి జూలై 6వ తేదీ వరకు హిమాచల్‌ప్రదేశ్‌లో 23 సార్లు ఆకస్మిక వరదలు వచ్చాయి. పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. దాంతో ఇప్పటివరకు 78 మంది ప్రాణాలు కోల్పోయారు. 37 మంది ఆచూకీ లేకుండా పోయారు. వారికోసం గాలింపు కొనసాగుతోంది. ఇదిలా ఉండగా సోమ, మంగళ, బుధవారాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం అంచనా వేసింది. మూడు జిల్లాలకు రెడ్ అలర్ట్, ఏడు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

**ఇంట్లో అనాథగా 11 నెలల చిన్నారి:** గతవారం మండి జిల్లాలో కొండచరియలు విరిగిపడటంతో 11 నెలల చిన్నారి అనాథగా మారింది. రాత్రి సమయంలో భారీ వర్షం కురుస్తుండటంతో నీరు ఇంట్లోకి రాకుండా పక్కకు పంపేందుకు రమేశ్‌కుమార్ కుటుంబం ఇంటిబయటకు వచ్చింది. అప్పుడే కొండచరియ విరిగిపడటంతో రమేశ్‌తో పాటు భార్య, తల్లి ప్రాణాలు కోల్పోయారు. ఇదేమీ తెలియని 11 నెలల చిన్నారి ఉదయం వరకు ఇంట్లోనే ఒంటరిగా ఉండిపోయింది. సహాయకబృందాలు పాపను రక్షించాయి. అయిన వాళ్లు చనిపోవడంతో ఆ పాప అనాథగా మారింది.

8-7Pg6exHMNWJQE.qxd:8-7Pg6exHMNWJQE.qxd 01/01/01 7:57 AM Page 1



# సివిల్ సర్వీస్ అధికారులు ప్రజలకు సేవచేసే అవకాశం ఎక్కువ!

## ఉన్నతస్థాయికి చేరుకోవడానికి విద్యకు మించిన ఆయుధం లేదు

## : ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు కె.వి.మోహనరావు

**విజయవాడ జులై 07 ప్రభాతవార్త ప్రతినిధి:** సివిల్స్ పరీక్షలలో ఉత్తీర్ణతసాధించి ఉన్నత అధికారులను నేరుగా ప్రజలకు సేవచేసే అవకాశం ఎక్కువగా వుంటుందని పలువురు ఉన్నతాధికారులు వ్యాఖ్యానించారు. ఇటీవల ప్రకటించిన సివిల్స్ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్‌కు ఎంపికైన గులూరు సాయిషణ్ముఖ, ప్రభుత్వ అదనపు కార్యదర్శిగా పదవీవిరమణ చేసిన యు.మురళీకృష్ణలకు న్యూస్ ఆధ్వర్యంలో ఆదివారం ఐ.వి.ప్యాలెస్‌లో జరిగిన అభినందన సభలో వారు ప్రసంగించారు. సమాజంలో ఉన్నతస్థాయికి చేరుకోవడానికి విద్యకు మించిన ఆయుధంలేదని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు కె.వి.మోహనరావు వ్యాఖ్యానించారు. విద్య వల్ల ఆత్మవిశ్వాసం పెరగడంతోపాటు న్యూనతను అధిగమించ వచ్చునని ఐఎఎస్ అదికారి, రైతు కారికసంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.రామారావు వ్యాఖ్యానించారు. హైదారాబాద్‌కు చెందిన ఐడిఎస్‌టి ప్రిన్సిపాల్ కె.వి.రావు మాట్లాడుతూ సివిల్స్ సీర్వస్‌లో ఉత్తీర్ణత సాధించడం విషయం కాదన్నారు. సి.ఐ.డి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు డాక్టర్ కె.వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అంకితభావం కలిగిన వారు మాత్రమే సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారని వ్యాఖ్యానించారు. సివిల్స్ విజయం సాధించిన యువ అధికారి సాయిషణ్ముఖ మాట్లాడుతూ తాను సాధారణ విద్యార్థినని అయినా తల్లిదండ్రులు ఇచ్చిన ప్రోత్సాహం పట్టుదలతోపాటు నిరంతక కృషి కారణంగా సివిల్‌ర్యాంక్ సాధించానని తెలిపారు. షణ్ముక తండ్రి నరసింహయ్య మాట్లాడుతూ తన కుమారుని కోసం తాను కూడా అనేక విషయాలు తెలుసుకున్నానని తెలిపారు. ఉద్యోగవిరమణ చేసిన మురళీ కృష్ణ మాట్లాడుతూ ఒక అధికారిగా కులమతాలకు అతీతంగా తన శక్తి మేరకు సేవలందించడం తనకు ఎంతో సంతృప్తి కలిగిందన్నారు. రిటైర్డ్ ఐపిఎస్ అధికారి ఎం.రవీంద్రనాథ్‌బాబు అధ్యక్షత వహించిన ఈ అభినందన సభలో ఇంకా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఇ.మీరా ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎ.వి.నాంచారరావు ప్రకాశంజిల్లా మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.శ్రీహరి, ట్రజరీ విభాగ రిటైర్డ్ జాయింట్ డైరక్టర్ సురేంద్రబాబు , రిటైర్డ్ జాయింట్ కలెక్టరు.



# మామిడి కొనుగోళ్లలో ఫలితాలిస్తున్న ప్రభుత్వ చర్యలు

## - ప్రభుత్వ చర్యలతో కేజీ రూ.12లకు కొనుగోలు..

## ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

**విజయవాడ,, జూలై 7,ప్రభాతవార్తప్రతినిధి:** తోతాపురి మామిడి రైతుల విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో ఇప్పటి వరకూ 3,08,261 మెట్రిక్ టన్నుల మేర తోతాపురి మామిడిని ట్రేడర్లు, ప్రాసెసింగ్ యూనిట్లు రైతుల నుంచి కొనుగోలు చేశాయి. సీఎంఓ కార్యాలయ సమాచారాన్ని అనుసరించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రాసెసింగ్ యూనిట్లు, పల్ప్ పరిశ్రమలు తమ సామర్థం మేరకు మామిడిని కొనుగోలు చేస్తున్నాయి. చిత్తూరు జిల్లాలో 1.65 లక్షల మెట్రిక్ టన్నులు, తిరుపతి జిల్లాలో 45 వేల మెట్రిక్ టన్నులు, అన్నమయ్య జిల్లాలో 16,400 మెట్రిక్ టన్నుల మేర మామిడి కొనుగోళ్లు జరిగాయి. ర్యాంపులు, మండీల ద్వారా మరో 81 వేల మెట్రిక్ టన్నుల మామిడి ఇతర రాష్ట్రాలకు విక్రయించారు. మొత్తం 50,922 మంది రైతుల నుంచి మామిడి కొనుగోళ్లు జరిగినట్టు అధికారులు వెల్లడించారు. మూడు జిల్లా కలెక్టరేట్లలోనూ కమాండ్ కంట్రోల్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఈ మామిడి కొనుగోళ్లను రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోంది. రోజువారీగా మామిడి రైతుల నుంచి ఏ మేర కొనుగోళ్లు జరిగాయనే అంశాన్ని నిశితంగా పరిశీలిస్తోంది. మొత్తంగా ఈ సీజన్ లో 3,75,000 మెట్రిక్ టన్నుల మేర దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇటీవలే కుప్పంలో మామిడి రైతులు, పరిశ్రమలు, ప్రాసెసింగ్ యూనిట్ల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాసెసింగ్ యూనిట్లు, ట్రేడర్లు, పల్ప్ పరిశ్రమల యాజమాన్యాలకు దిశా నిర్దేశం చేశారు. రైతుల నుంచి యూనిట్ సామర్థం మేరకు మామిడి కాయలు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఆదేశించారు. రైతులకు అదనంగా కేజీకి రూ.4 రూపాయల మద్దతు ధరను ఇచ్చి ప్రభుత్వం ఆదుకుంటోంది. ప్రాసెసింగ్ యూనిట్లు, ట్రేడర్లు కేజీకి రూ.8 చెల్లించి కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. మొత్తంగా రైతులకు కేజీ మామిడికి రూ.12 ధర లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పల్ప్ పరిశ్రమల వద్ద గత ఏడాది మిగిలి పోయిన ఉత్పత్తిని విక్రయించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పార్లే ఆగ్రో, కోకోకోలా, పెప్సీ తదితర సంస్థలు రైతుల నుంచి మామిడిని కొనుగోలు చేసేలా ప్రభుత్వం ఆదేశించింది. అలాగే మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం ద్వారా మామిడి రైతును ఆదుకునేందుకు వీలుగా కేంద్రం రూ.130 కోట్లను విడుదల చేయాలని గతంలోనే లేఖ రాసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.

# మామిడి కాయల్లో ఎన్ని రకాలుంటాయో తెలియని జగన్ మామిడి రైతులకు పరామర్శా?

## - టిడిపి అధికార ప్రతినిధి డాక్టర్ సప్తగిరి ప్రసాద్



**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, జూలై 7:** మామిడి కాయల్లో ఎన్ని రకాలు ఉంటాయో కూడా తెలియని జగన్మోహన్ రెడ్డి మామిడి రైతుల పరామర్శకు వెళ్తున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ సప్తగిరి ప్రసాద్ మండిపడ్డారు. సోమవారం టిడిపి జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చిత్తూరు జిల్లా, బంగారుపాళ్యంలో ఈ నెల 9న మామిడి రైతులను పరామర్శించడానికి దండుపాళ్యం బ్యాచ్ బయలుదేరుతుందని, ప్రశాంతమైనటువంటి వాతావరణం కలిగిన ప్రాంతంలో గందరగోళం రేపడానికే జగన్ రెడ్డి బంగారుపాళ్యం పర్యటన కుట్రకు దారితీశారన్నారు. జగన్మోహన్ రెడ్డి రైతులను పరామర్శించే తీరు వెయ్యి ఎలుకల్ని తిన్న పిల్లి కాశీ యాత్రకు బయలుదేరినట్లు ఉందన్నారు. అసలు మామిడి పంట గురించి, వ్యవసాయం, రైతుల గురించి జగన్మోహన్ రెడ్డికి సరైనా అవగాహన ఉందా? పరామర్శల పేరుతో జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారన్నారు. రైతుల కష్టాలు, కన్నీళ్లు, సమస్యలు తెలిసినటువంటి చంద్రబాబుపై జగన్ రెడ్డి విమర్శలు చేస్తున్నారని, మామాడి రైతులకు ఫ్యాక్టరీ నుంచి కేజీకి రూ.8 ఇస్తే ప్రభుత్వం నుండి రూ.4 లు మద్దతు ధర ఇస్తానని భరోసా ఇచ్చి ఆదుకున్న దార్శనికుడు చంద్రబాబు అని అన్నారు. అలాంటి వ్యక్తిని దూషించడం సిగ్గుచేటని, పచ్చ కండువా వేసుకుని పరామర్శల పేరుతో గ్రామాల్ని, పట్టణాల్ని సందర్శిస్తూ రాష్ట్రంలో భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు.

# శాకంబరిగా దుర్గమ్మ అభయ ప్రదానం

## - పూజాదికాలతో ప్రారంభమైన ఆలయ అలంకారం

**ఇంద్రకీలాద్రి, జూలై 7, ప్రభాతవార్త** జగన్మాత దుర్గమ్మ వారు శాకంబరి మాతగా మంగళవారం నుండి భక్తులను అనుగ్రహిస్తారు. ఈ మేరకు ఆలయంతో పాటు ఉపాలయాలను కూడా వర్ణమయ కూరగాయలు, పండ్లతో ముచ్చటగా అలంకరిస్తున్నారు. ముందుగా ఆలయానికి వచ్చిన కూరలు, పండ్లకు పూజాదికాలు నిర్వహించారు. అనంతరం 200 మంది అలంకార ఏర్పాట్లలో ముమ్మరంగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ భూలోకంలో సకాలంలో వర్షాలు



శాకంబరి ఉత్సవాల అలంకారంకోసం వచ్చిన కూరలు, పండ్లకు పూజా నిర్వహిస్తున్న దృశ్యం



ఎస్‌బిఐ అధికారులకందించిన దుర్గమ్మవారి బంగారం

కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు, రైతులు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని , సకల లోకాల క్షేమం కోసం జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారంనాడు శాకంబరి మాతగా దుర్గమ్మవారు దర్శనమిస్తారని, భక్తులు దుర్గమ్మ దర్శనానికి పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం వున్నందున అంతరాలయ దర్శనం, విఐపి దర్శనాలు రద్దు చేస్తున్నట్లు ఇఓ వికె శీనా నాయక్ ప్రకటించారు. జూలై 10 వరకు 3రోజులపాటు వైభవోపేతంగా నిర్వహిస్తామన్నారు. 200 మంది సేవకులు ఆలయ అలంకరణలో పాల్గొంటున్నారన్నారు. - ఉత్సవ వివరాలు: 8వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వర పూజ, ఋుత్విక్‌వరుణం, పుణ్యాహవచనము, అఖండ దీపారాధన, అంకురార్పణ తో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 10 వ తేదీన గురువారం సప్తశతీ పారాయణం, మహావిద్యా పారాయణము, హోమము, శాంతి పౌష్టిక హోమాలు, మంటపపూజ, ఉదయం 9.30కు పూర్ణాహుతి నిర్వహిస్తారు. దుర్గమ్మ శాకంబరి మాతగా దర్శనమిచ్చే మూడురోజులు దర్శనాలు ప్రతిరోజు మాదిరి యధావిధిగా వుంటాయని ఇఓ తెలిపారు. దుర్గమ్మవారి ఆలయంలో చాలాకాలం పాటు స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచిన బంగారాన్ని సోమవారం ఇఓ వికె శీనా నాయక్ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులకు అప్పగించారు.

# ఆకాంక్షిత జిల్లాలు, బ్లాకుల్లో పథకాల అమలు తీరుపై త్వరలో సమీక్ష

## - సత్యసాయి, ప్రకాశం, అన్నమయ్య జిల్లాలను కూడా ఆకాంక్షిత జిల్లాల జాబితాలో చేర్చాలి

## - 20సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్



**సచివాలయం,జూలై 7,ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ఆకాంక్షిత జిల్లాలు,బ్లాకుల్లో అమలు చేయబడుతున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ పథకాలు,ప్రాజెక్టుల అమలు తీరుపై సమీక్షించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి నివేదిస్తామని ఆంధ్రప్రదేశ్ 20సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. వికసిత్ భారత్ - స్వర్ణాంధ్ర 2047సాధనలో భాగంగా రాష్ట్రంలోని ఆకాంక్షిత జిల్లాలు,బ్లాకుల్లో అభివృద్ధిని వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతో ఉందని,మరికొన్ని జిల్లాలను ఈ జాబితాలో చేర్చాల్సిన అవసరం ఉందని,అందుకు తగ్గట్లుగా కసరత్తు ప్రారంభించనున్నామని ఆయన తెలిపారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని తన చాంబర్‌లో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ ఆకాంక్షిత జిల్లాలు,బ్లాకుల్లో సమగ్రాభివృద్ధిని కాంక్షిస్తూ సబ్‌కా సాత్-సబ్ కా వికాస్ - సబ్ కా విశ్వాస్ (అందరితో కలసి - అందరి అభివృద్ధి కోసం-అందరి విశ్వాసంతో)స్ఫూర్తితో డబుల్ ఇంజన్ సర్కార్ పలు పథకాలను,ప్రాజెక్టులను అమలు చేయడం జరుగుతుందన్నారు.రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపేందుకు దేశ ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని డబుల్ ఇంజన్ సర్కార్ పనిచేస్తుందన్నారు.రాష్ట్రంలో పేదరికం తగ్గించే దిశగా కేంద్ర ప్రభుత్వ పథాకలు మరియు ప్రాజెక్టులతో కలపి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు,ప్రాజెక్టులు మరియు పి4 కార్యక్రమం ఎంతగానో ఉపకరిస్తున్నాయని, ఇందులో "ఆకాంక్షిత జిల్లా" లు మరియు "ఆకాంక్షిత బ్లాకు" ల పనితీరు చాలా కీలకం అన్నారు. దేశంలో 117 అభివృద్ధి చెందని మరియు సామాజిక ఆర్థిక వృద్ధిలో అత్యంత కఠిన సవాళ్ళు ఎదుర్కొంటున్న జిల్లాలను,బ్లాకులను ఆకాంక్షిత జిల్లాలు,బ్లాకులుగా గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలు,ప్రాజెక్టులను అమలు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో అల్లూరి సీతారామరాజు జిల్లా,పార్వతీపురం, మన్యం మరియు వైఎస్సార్ కడప మూడు జిల్లాలతో పాటు మండల స్థాయిలోని 15బ్లాక్‌లు ఆకాంక్షిత జిల్లాలు,బ్లాకులు ఉన్నాయన్నారు .ఆయా ప్రాంతాల్లో తీవ్ర మౌలికసదుపాయాల కొరత,ఒక ప్రాంతం ఉండి మరో ప్రాంతానికి మరియు ఇతర ప్రాంతాలకు చాలా పరిమితమైన కనెక్టివిటీ ఉండడం మరియు దైనందిన కార్యకలాపాలు నిర్వహణకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు మనకు కనిపిస్తారన్నారు దేశంలో 2011-12 సంవత్సరంలో అతి తీవ్ర పేదరికం 16.20శాతం ఉండగా,ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అంత్యోదయ స్ఫూర్తితో పాలన సాగిస్తున్నందున 2022-23నాటికి 2.30శాతం తగ్గిందన్నారు.ప్రస్తుతం దేశంలోని 20కోట్ల మందిపైగా ప్రజలు అతి తీవ్ర పేదరికం నుండి బయటపడ్డారని,రాబోయే కొద్ది సంవత్సరాల్లో ఇంకా చాలా భారీ స్థాయిలో ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడి అతి తీవ్ర పేదరికం ఛాయలు లేకుండా పోతాయని ప్రఖ్యాత ఆర్థిక సంస్థలు అంచనా వేస్తున్నాయన్నారు.ప్రపంచంలో సగటు ప్రజల ఆదాయం అంతరం భారతదేశం 25.50శాతంతో 4వ స్థానంలో,అమెరికాలో 41.80శాతం,చైనాలో 35.70శాతం మరియు ఆస్ట్రేలియాలో 32.40శాతం గా ఉందన్నారు. ఇందుకు కారణం 2014అనంతరం అర్హులైన పథకాలు,ప్రాజెక్టులు మరియు లీకేజి లేకుండా గత 11సంవత్సరాలు అమలు పర్చడం మరియు రూ.55కోట్ల జన్‌ధన్ ఖాతాల ద్వారా అర్హులైన పేద ప్రజలకు

# రొట్టెల పండుగ కోసం కూటమి ప్రభుత్వం రూ.10కోట్లు ఖర్చు పెట్టింది

## - నెల్లూరులో బారా షహీద్ దర్గా రొట్టెల పండుగలో పాల్గొన్న మంత్రి లోకేష్



**నెల్లూరు, జులై 7, ప్రభాతవార్త** రొట్టెల పండుగ కోసం కూటమి ప్రభుత్వం రూ.10కోట్లు ఖర్చు పెట్టిందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంత సామరస్యానికి ప్రతీకైన నెల్లూరు నగరంలోని బారా షహీద్ దర్గా రొట్టెల పండుగలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ముందుగా దర్గా ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు కూటమి ప్రజా ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం బారా షహీద్ దర్గాను సందర్శించారు. ముస్లిం మత పెద్దలు నారా లోకేష్‌కు గలఫ్‌ను అలంకరించారు. దర్గాలో ఉన్న మహ్మద్ ప్రవక్త అనుచరులు 12 మంది అమరవీరుల చిహ్నాలపై చాదర్‌లను కప్పి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం స్వర్ణాల చెరువులో ఆరోగ్యం రొట్టెను స్వీకరించి మంత్రి పి.నారాయణ, మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా టీడీపీ అధ్యక్షులు షేక్ అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్యే కోటంరెడ్డి, శ్రీధర్‌రెడ్డిలకు పెంచిపెట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కుల మతాలకు అతీతంగా ప్రజలందరూ సంతోషంగా ఉండాలని చక్కటి పాలన అందిస్తున్నాం. 2014 తర్వాత రొట్టెల పండుగ అద్భుతంగా జరిగేది. ఆనాడు నారాయణ మంత్రిగా ఉన్నప్పుడు నిధులు కేటాయించారు. అనేక పనులు చేపట్టారు. ఈ సారి కూడా ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. రూ.10 కోట్లు ఈ కార్యక్రమం కోసం కూటమి ప్రభుత్వం ఖర్చు పెట్టడం జరిగింది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఆలోచన ఒక్కటే.. తెలుగువారు ఎక్కడున్నా సంతోషంగా ఉండాలని, దేవుడు ఆరోగ్యంగా చూసుకోవాలనే లక్ష్యంతో మేమంతా ప్రార్థిస్తూ ఉంటామన్నారు. ఈ రోజు రొట్టెల పండుగలో ఏ రొట్టె తీసుకోవాలనేది భాగా చర్చించా. నేను బలంగా నమ్మేది బాబు ఆరోగ్యంగా ఉంటే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది. అందుకే ఆరోగ్యం రొట్టెను తీసుకోవడం జరిగింది.

# మామిడి రైతులకు 'కూటమి' ప్రభుత్వం చేయూత

## - రాష్ట్ర వ్యవసాయ మిషన్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి



**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, జూలై 7:** మామిడి రైతులకు ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర గురించి అవగాహన లేని జగన్ రెడ్డి ఇష్టం వచ్చినట్లు లేని పోని ఆరోపణలు చేస్తూ రైతులను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మిషన్ (ఎపిఎస్ఎఎం) చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. సోమవారం టిడిపి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చిత్తూరు, తిరుపతి, మరియు అన్నమయ్య జిల్లాల్లో ప్రధానంగా సాగు చేయబడే తోతాపురి మామిడి రకంపై చర్చ జరిగిందని, ఈ రకం మామిడి సుమారు 80,000 హెక్టార్లలో (2 లక్షల ఎకరాలు) పండించబడుతుందన్నారు. ఈ పంట దిగుబడి వాతావరణం మరియు ప్రకృతి పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని, ఒక సంవత్సరం ఎక్కువ దిగుబడి వస్తే, మరో సంవత్సరం తక్కువ వస్తుందన్నారు. గత సంవత్సరం 2.5 లక్షల టన్నుల దిగుబడి వచ్చిందని, కానీ ఈ సంవత్సరం ఉద్యానవన శాఖ గణాంకాల ప్రకారం 6.7 లక్షల టన్నుల దిగుబడి అంచనా వేయబడిందని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం మామిడి రైతులకు మద్దతు ఇవ్వడానికి అనేక చర్యలు చేపట్టిందని, తోతాపురి మామిడి కిలో రూ. 12 ధరకు కొనుగోలు చేయాలని నిర్ణయించటం జరిగిందన్నారు. ఇందులో రూ. 8 ఫ్యాక్టరీలు చెల్లిస్తాయని, మిగిలిన రూ.4 రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. ఈ ధర విధానం రైతులకు లాభదాయకంగా ఉంటుందని, వారి కుటుంబ ఆర్థిక అవసరాలను తీరుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 9 తేదిన నుండే చర్యలు మొదలు పెట్టిందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జూన్ నెలలోనే పల్ప్ ఫ్యాక్టరీ యజమానులతో చర్చలు జరిపారని, కరోనా సమయంలో 40,000 టన్నుల పల్ప్ నిల్వ ఉన్నట్లు తెలిసిందన్నారు. ఈ నిల్వలను సమర్థవంతంగా నిర్వహించేందుకు మరియు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మామిడి ఎగుమతులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నారన్నారు.



# గత ప్రభుత్వంలో చంపుతామని బెదిరించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు

## - తెనాలి వైసిపి మాజీ ఎమ్మెల్యే పై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, జూలై7:** తెనాలి వైసీపీ మాజీ ఎమ్మెల్యే అన్నా బత్తుని శివకుమార్ పినతండ్రి కొడుకు రాజశేఖర్.. తమను బెదిరించి పది లక్షలు డబ్బులు తీసుకోవడమే కాకుండా.. తమను చంపుతామని తమ పొలాన్ని రాయించుకున్నాడని.. నాడు శికుమార్ అండతో బలవంతంగా జరిగిన రిజిస్ట్రేషను రద్దు చేసి అన్నబత్తుని రాజశేఖర్ పై చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా చుండూరు మండలం చినపరిమి గ్రామానికి చెందిన మొవ్వా వెంకటేశ్వర్లు నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, మాదిగ కార్పొరేషన్ చైర్ పర్సన్ ఉండవల్లి శ్రీదేవి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ముస్తాక్ అహ్మద్, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్రలకు అర్జీ ఇచ్చి అభ్యర్థించారు . కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం బింగిదొడ్డి గ్రామానికి చెందిన కె. బాలమ్మ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. గత 60 సంవత్సరాలుగా తమ స్వాధీనంలో ఉన్న భూమిని పత్రికా విలేకర్లుగా ఉంటూ కొందరు తమ భార్యల పేర్ల మీదకు మార్చుకొని పాస్ పుస్తకాలు తెచ్చుకున్నారని.. వాటిని రద్దు చేసి తమకు న్యాయం చేయాలని బాధితురాలు విజ్ఞప్తి చేశారు.

# ఏడు గ్రామాల ప్రజలచే వలసదేవర

## - వర్షాల కోసం పురాతన ఆచారం కొనసాగింపు!

**శాంతిపురం, జూలై 7 ప్రభాతవార్త** పిల్లా జెల్లాఅందరూ కలిసి కోడికూయగానే ఒక్కచోటకు చేరుకుని గ్రామానికి దూరంగా వలస దేవరకు బయలుదేరారు.. గ్రామంలో ఎవరూ ప్రవేశించకుండా చుట్టుపక్కల ముళ్ల కంపలు వేసేశారు.. ఏడు గ్రామాల ప్రజలు ఒక్క చోటకు చేరి పూజలు నిర్వహించిన అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేసి సాయంత్రం చీకటి పడ్డాక మరలా గ్రామాలవైపుకు బయలుదేరారు.. ఇదంతా దేనికోకాదు మరి.. వర్షాలు బాగా కురిసి ప్రజలు, పశుపక్ష్యాదులు సుఖసంతోషాలతో ఉండాలనే ఒక్క కోరికతో మాత్రమే. ఈ కార్యక్రమాన్ని సోమవారం చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం కర్లగట్ట పంచాయతీ పరిధిలో ఉన్న ఏడు గ్రామాల ప్రజలు నిర్వహించారు. తాత ముత్తాతల కాలం నుంచి వస్తున్నఈ ఆచారాన్ని నేటికీ కొనసాగించడం విశేషం. అప్పట్లో వర్షాలు లేక కరువు వచ్చినసమయంల పశు పక్ష్యాదులకు నీరు లేక, పంటలసాగుకు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో గ్రామస్తులంతా ఒకరోజు వననాసం వెళ్లాలి అని నిర్ణయించుకున్నారు.

# ఐక్యవేదిక సమ్మెలో లక్ష మంది ఉద్యోగులు!

**హైదరాబాద్ (సైఫాబాద్), జూలై 7. ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డి మాండ్ చేస్తూ ఈ నెల 9న కేంద్ర కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యా య సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా రెండు తెలుగు రాష్ట్రా ల్లోని బ్యాంక్, బీమా కంపెనీలకు చెందిన లక్ష మంది ఉద్యోగులు పాల్గొంటారని టిఎస్- ఎపి రాష్ట్రాల జాయింట్ ఫోరం ఆఫ్ ఫైనాన్సియల్ సెక్టార్ యూని యన్స్ ప్రకటించాయి. ఎపిటిబి ఇఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జెఎఫ ఎఫ్ఎస్‌యు జా తీయ కార్యదర్శి బి.ఎస్. రాంబాబు, పలు యూనియన్స్ నాయ కులు వాల్ పోస్టర్లను

# దోస్త్-2025లో 1.43 లక్షల మంది ప్రవేశాలు

## ముగిసిన అడ్మిషన్ల ప్రక్రియ 64 కాలేజీల్లో ఒక్క అడ్మిషన్ కాలేదు, 9, 10 తేదీల్లో ఇంట్రాకాలేజెస్ ఆప్షన్లు

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలం గాణ(దోస్త్)-2025 అడ్మిషన్ల ప్రక్రియ శనివారంతో ముగిసింది. రాష్ట్రంలో మొత్తం 957 ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో 4,36,947 సీట్లు అందుబాటులో ఉండగా.. వాటిలో 1,43,037 మంది చేరారు. 63 ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో ఒక్క అడ్మిషన్ కూడా కాలేదు. శాతవాహన యూనివర్సిటీలో ఒక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కూడా ఒక్క అడ్మిషన్ కూడా జరగలేదు. డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం మూడు విడతల్లో సీట్లను కేటాయించారు. రెండు, మూడో విడతల్లో సీటు పొందిన విద్యార్థులు ఆయా కాలేజీల్లో చేరడానికి ఇచ్చిన గడువు కాస్త శనివారం(జులై 5)తో ముగిసింది. దీంతో 2025-26 సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిన ట్టయింది. మొదటి విడతలో 65వేల మందికి సీట్ల కేటాయింపు చేపట్టగా వారిలో సుమారు 43 వేల మంది కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ ఇచ్చారు. ఇక రెండో విడతలో 43వేల సీట్ల కేటాయింపు చేయగా.. మూడో విడతలో 85,680 మంది విద్యార్థులకు సీట్ల కేటాయింపు చేశారు. సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 30 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉండగా దానిని కాస్త జులై 5 వరకు పొడిగించారు. అదికాస్త శనివారంతో ముగిసింది. దోస్త్ మూడో విడత సీట్ల కేటాయింపును జూన్ 28న విడుదల చేశారు. దోస్త్ మూడో విడత రిజిస్ట్రేషన్‌లో భాగంగా 82,770 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మూడో విడతలో 96,015 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు.

వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారిలో 85,680 మందికి సీట్ల కేటాయింపు చేపట్టారు. తక్కువ ఆప్షన్లు ఇచ్చిన కారణంగా 10,335 మందికి మొదటి విడతలో సీట్ల కేటాయింపు చేయలేదు. రెండు, మూడో విడతలో సీటు పొందిన వారు రూ. 500.. రూ. 1000 ఫీజు చెల్లించి ఆయా కాలేజీల్లో చేరడానికి శనివారం (జులై 5) వరకు అవకాశం కల్పించగా .. గడువు కాస్త ముగిసింది. ఉస్మానియా వర్సిటీలో 1,95,397 సీట్లు ఉండగా.. 67,157 మంది చేరారు.

కాకతీయ యూనివర్సిటీలో 1,07,080 సీట్లు ఉండగా 33,289 మంది చేరారు. శాతవాహన యూనివర్సిటీలో 38,220 సీట్లు ఉండగా.. 14,022 మంది చేరారు.

పాలమూరు యూనివర్సిటీలో 34,220 సీట్లు ఉంటే వాటిలో 10,638 మంది చేరారు. తెలంగాణ యూనివర్సిటీ 33,110 సీట్లు అందుబాటులో ఉంటే 9959 మంది చేరారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీలో 26,660 సీట్లు ఉండగా వాటిలో 6589 మంది చేరారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో 1850 సీట్లు ఉండగా అందులో 1255 మంది చేరారు.

# తెలంగాణలో క్రీడారంగం అభివృద్ధిపై భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్ ప్రశంస

## ఢిల్లీలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 7:** తెలంగాణలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం క్రీడారంగం అభివృద్ధికి తీసుకుం టున్న చర్యలను భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్ ప్రశంసించారు. ఢిల్లీలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని ఆయన అధికారికనివాసంలో కపిల్‌దేవ్ సోమవారం కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు, క్రీడాభివృద్ధికి తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్య లను సీఎం రేవంత్‌రెడ్డి కపిల్‌దేవ్‌కు వివరించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీతోపాటు తెలంగాణలో క్రీడాభివృద్ధికి సంబంధించిన అన్ని విషయాల్లో తాను భాగస్వామినవుతానని కపిల్‌దేవ్ ముఖ్యమంత్రికి తెలియ జేశారు. ఈ సందర్భంగా దక్షిణ కొరియాతోపాటు పలు దేశాల్లో తాము సందర్శించిన క్రీడా యూనివర్సిటీలు. ప్రముఖులతో తమ భేటీ.

8-7P g7exHMNWJQE.qxd:8-7P g7exHMNWJQE.qxd 01/01/01 7:58 AM Page 1



# కొత్త టిమ్స్ హాస్పిటళ్లలో ఆధునిక సాంకేతిక పరికరాలు కొనాలి



## రోగుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఫర్నీచర్ కొనాలి

## ప్రతి వస్తువుకూ వారంటీ ఉండేలా చూడాలి

### టిజిఎంఎస్ఐడిసిపై సమీక్షించిన మంత్రి దామోదర రాజనర్సింహా

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న టిమ్స్ హాస్పిటల్స్‌తోపాటు వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అత్యాధునిక టెక్నాలజీ ఉన్న మెడికల్, డయాగ్నస్టిక్స్ ఎక్విప్‌మెంట్‌ను కొనుగోలు చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. డాక్టర్లు, సిబ్బంది, పేషంట్ల అవసరాలకు అనుగుణంగా ఫర్నీచర్‌ను కొనుగోలు చేయాలని అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ఎక్విప్‌మెంట్ కొనుగోలు చేయాలని మంత్రి సూచించారు. టిజిఎంఎస్ ఐడిసిపై మంత్రి దామోదర రాజనర్సింహ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కార్పొరేట్ హాస్పిటల్స్‌లో వినియోగిస్తున్న ఎక్విప్‌మెంట్ ఏమిటో డాక్టర్లను అడిగి తెలుసు కోవాలన్నారు. డాక్టర్లు, సిబ్బంది, పేషెంట్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఫర్నీచర్ కొనుగోలు చేయాలన్నారు. కొత్త హాస్పిటళ్లకు పేషెంట్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందని, ఆ అంచనాలకు తగ్గట్టుగా ఫర్నీచర్, ఎక్విప్‌మెంట్ సరిపడా ఉండాలన్నారు. కొనే ప్రతి వస్తువుకూ వారంటీ ఉండాలని, మెయింటనెన్స్ విషయంలో సప్లయర్లను బాధ్యులుగా చేయాలన్నారు. ఒక్క వస్తువు కూడా రిపేర్‌లో, నిరుపయోగంగా ఉండే పరిస్థితి ఉండకూడదన్నారు. ప్రభుత్వ దవాఖానలో మెడిసిన్ సరఫరాపై వివిధ విభాగాల హెచ్‌వోడీ లను మంత్రి వివరాలు అడిగారు. అవసరమైన అన్ని మెడిసిన్స్ అందుబాటులో ఉన్నాయా? లేవా అని డీఎంఈ, వైద్యవిధాన పరిషత్ కమిషనర్, డైరక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల కాలం కావడంతో పేషెంట్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందని, అందుకు అనుగుణంగా మెడిసిన్ అందుబాటులో ఉంచుకోవాలని మంత్రి ఆదేశించారు. సెంట్రల్ మెడిసినల్ స్టోర్లలో కనీసం 3 నెలలకు సరిపడా మెడిసిన్ అందుబాటులో ఉంచుకోవాలని టిజిఎంఎస్ఐడిసి అధికారులకు మంత్రి సూచించారు. ప్రతి పీహెచ్‌సీలోనూ టెస్టులు అవసరమైన పేషెంట్ల నుంచి సాంపిల్స్ సేకరించాలని, 24 గంటల లోపల రిపోర్టులు అందజేయాలని మంత్రి ఆదేశించారు. గతేడాది కొత్తగా ప్రతి జిల్లాలోనూ మెడిసినల్ స్టోర్లను ఏర్పాటు చేశామని, ఆయా స్టోర్లకు పర్మినెంట్ బిల్డింగ్స్ నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. అన్ని జిల్లాల్లో బిల్డింగుల నిర్మాణాన్ని ప్రారంభించి, త్వరగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. మెడికల్ కాలేజీలు అన్నింటిలోనూ సీటీ స్కాన్ మిషన్లను అందుబాటులోకి తీసుకొచ్చామని, అలాగే అవసరమైన చోట ఎంఆర్ఐ యంత్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించామని మంత్రి తెలిపారు.

**వెల్‌నెస్ సెంటర్ల తనిఖీలు..**

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు వెల్‌నెస్ సెంటర్లలో ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్ కుమార్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. వెల్‌నెస్ సెంటర్లపై వస్తున్న వార్తల విషయంలో అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు.




# పదేళ్లలో బాగుపడింది నలుగురే

## ఫామ్‌హౌస్‌కు రోడ్లు వేసుకున్న కెసిఆర్

## జుక్కల్ అభివృద్ధిని విస్మరించారు..

## మంత్రి కోమటిరెడ్డి నిశిత విమర్శ

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త:** వెనుకబడిన జుక్కల్ అభివృద్ధి చెందితేనే అభివృద్ధికి నిజమైన అర్థం అని ఆర్‌అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో సోమవారం రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. ఫామ్ హౌజ్‌కు రోడ్డు వేసుకొని జుక్కల్ వంటి వెనుకబడిన ప్రాంతంను కెసిఆర్ విస్మరించారని వెంకటరెడ్డి నిందించారు. మద్దెలచెరువు పిట్లం రోడ్, తిమ్మనగర్ వద్ద 4.86 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన హై లెవల్ బిడ్జ్ ను ప్రారంభించిన మంత్రి, బిచ్కుంద నుండి డోంగ్లి వరకు 13.20 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించే రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. స్థానిక ఎమ్మెల్యే లక్షి ్మకాంత రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. జుక్కల్ లో డైనమిక్ ఎమ్మెల్యే లక్షీ ్మ కాంత రావు ఉన్నాడని, ఇప్పుడు అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. ఆయనకు తోడుగా ఉంటానని నాకు ఇప్పుడు జుక్కల్ బాధ్యత కూడా తోడయిందని తెలిపారు. గత పదేళ్లలో కొడుకు, బిడ్డ, అల్లుడు బాగుపడ్డారు కానీ తెలంగాణ ప్రజలు కాదని గత బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. తెలంగాణ ఇచ్చిన పార్టీ అధికారంలోకి రాకున్నా బాధపడలేదనీ..ఏదైతే ఆశయంతో తెలంగాణ రాష్ట్రాన్ని కొట్లాడి సాధించుకున్నామో అవి నెరవేరలేదన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో 160 కోట్ల రూపాయలతో రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తున్నామని, జుక్కల్ లాంటి వెనుకబడిన నియోజకవర్గం అభివృద్ధి చెందినపుడే నిజమైన అభివృద్ధి జరిగినట్లన్నారు. నిరంతరం మమ్మల్ని విమర్శించే హరీశ్‌రావు వచ్చి జుక్కల్ రోడ్లు చూడాలన్నారు. అంతకు ముందు పిట్లం, బిచ్కుంద లో జుక్కల్ ఎమ్మెల్యే లక్షీ ్మ కాంతరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు.

**కామారెడ్డి సమగ్రాభివృద్ధికి పటిష్టచర్యలు : మంత్రి కోమటిరెడ్డి**

కామారెడ్డి జిల్లా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల బోర్డర్ రిమోట్ ఏరియా ఉందని, ఇక్కడ 100 బెడ్ ల ఆసుపత్రికి ప్రతిపాదనలు పంపించాలని అన్నారు. జాతీయ రహదారి దగ్గర ట్రామా సెంటర్ అవసరం ఉందని , హైవే సమీపంలోని ఆసుపత్రిలో ట్రామా సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశించారు. సేంద్రియ వ్యవసాయం పెరిగే విధంగా చూడాలని ఎరువుల వాడకం తగ్గించాలని అప్పుడే భూసారం కాపాడుకోగలుగుతామని అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు క్రాప్ బుకింగ్ పకడ్బందీగా చేయాలని, వాస్తవ పరిస్థితులకు రికార్డులకు చాలా తేడా ఉంటుందని, భవిష్యత్తులో ఇలా జరగడానికి వీలు లేదని అన్నారు. వ్యవసాయ పనిముట్లు సబ్సిడీ యూనిట్ల పట్ల రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి పేర్కొన్నారు. జిల్లాలో తదుపరి అటవీ భూముల ఆక్రమణ జరగకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులకు ఇబ్బందులు కలిగించ వద్దని అన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, జాయింట్ కలెక్టర్ విక్టర్, జిల్లా అధికారులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ కుమార్, నిజాంసాగర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, ఇతర ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

# పట్టా ఉన్న భూమి సొంతం కావడం లేదని కలెక్టరేట్‌లో రైతు ఆత్మహత్యాయత్నం

## సత్వరమే పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ

**భువనగిరి, జూలై 7 ప్రభాతవార్త :** యేళ్ల తరబండ నుంచి తన భూ సమస్యలను పరిష్కరించడం లేదంటూ ఓ రైతు ఏకంగా ప్రజావాణి కార్యక్రమంలో తన గోడును వెల్లబోసుకుంటూ ఏకంగా ఒంటిపై పెట్రోల్ పోసుకున్న సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలో కల కల సృష్టించింది . వివరాల్లోకి వెళితే యాప్రాల్ గ్రామానికి చెందిన రైతు తడకలపల్లి ఆజిరెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని బొమ్మలరామారం మండలం నాగినేనిపల్లి గ్రామంలో సర్వేనెంబర్ 345లో మూడు గుంటలు, సర్వేనెంబర్ 346లో ఎకరం 32 గుంటల భూమిని చీమల లింగం అనే వ్యక్తి నుంచి ఖరీదు చేసుకొని మే 9 ,2005న డాక్యుమెంట్ నెంబర్ 2226/2005 ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని బొమ్మలరామ్నార తాసిల్దార్ కార్యాలయంలో అమెండ్మెంట్ నెంబర్ 47/200708 ద్వారా పట్టా మార్పిడి చేసుకున్నారు .అందుకు సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలను సైతం పొందారు. తాను 2011వరకు పహాని రికార్డుల్లో సైతం నా పేర రెవెన్యూ అధికారులు నా యొక్క భూముల వివరాలను పొందుపరిచారు. అప్పటినుంచి ఆన్ లైన్ రికార్డుల్లో నా పేరు రావడం లేదంటూ ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్న పట్టించుకునే నాధుడే కరువయ్యారని, ఇదే విషయంపై జిల్లా అధికారుల ఫిర్యాదు చేసుసుకున్న నా సమస్య పరిష్కారం నోచుకోవడం లేదంటూ తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ బాటిల్ మూత తీసి సోమవారం కలెక్టరేట్ మందిరములో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారుల సమక్షంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని గోడు వెళ్లబోసుకునే ప్రయత్నం చేస్తుండడంతో అప్రమత్తమైన పోలీసులు పెట్రోల్ బాటిల్ లాక్కోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు .సమస్య జటిలంగా ఎందుకు మారిందో పూర్తి నివేదిక రూపకంగా తక్షణమే సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.హనుమంతరావు బొమ్మలరామ్నార తాసిల్దార్ ను ఆదేశించారు. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో రైతు ఆగి రెడ్డి ప్రజావాణి కార్యక్రమం నుంచి తిరిగి వెళ్లిపోయారు.

# సంస్థాగత నిర్మాణం కోసం ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జిల నియామకం

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త:** సంస్థాగత నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసేందుకు ఉమ్మడి జిల్లాలవారీగా ఇన్‌చార్జిలను పిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ నియమించారు. పిసిసి చీఫ్, ఎఐసిసి సోమవారం జిల్లా ఇన్‌చార్జిలతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, 10 ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విధివిధానాలను మీనాక్షి వెల్లడించారు. త్వరలో గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు కమిటీల నిర్మాణం ఉంటుందని చెప్పారు. వెంటనే రంగంలోకి దిగాలని మీనాక్షి నటరాజన్ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను పిసిసి చీఫ్ నియమించిన విషయం తెలిసిందే. ఇప్పుడు తాజాగా ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిలను ఆయన ప్రకటించారు. ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జిల వివరాలిలా ఉన్నాయి ఖమ్మం- వంశీచంద్‌రెడ్డి, నల్లగొండ-సంపత్‌కుమార్, వరంగల్-అద్లూరి లక్ష్మణ్, మెదక్-పొన్నం ప్రభాకర్, హైదరాబాద్-జగ్గారెడ్డి, మహబూబ్‌నగర్- కుసుమకుమార్, ఆదిలాబాద్-అనీల్‌యాదవ్, కరీంనగర్-అద్దంకి దయాకర్, నిజా మాబాద్- అజ్మతుల్లా హుస్సేన్, రంగారెడ్డి-శివసేనరెడ్డి నియామకం అయ్యారు.

# కెసిఆర్ అవినీతి నిర్వాకం వల్లే కూలిన మేడిగడ్డ

## సరైన సమయంలో ఎరువు సరఫరా చేసి రైతును ఆదుకొంటాం

## ఎమ్మెల్యే దేవరకద్ర జి.మధుసూదన్‌రెడ్డి

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త:** కెసిఆర్ ప్రభుత్వ అవినీతి నిర్వాకం వలన మేడిగడ్డ కూలిపోయిం దనీ, ఆ బ్యారేజీలో నీళ్లు నిల్వ చేస్తే దిగువన ఉన్న ప్రాంతాల ప్రజల ప్రాణాలకు పొంచి ఉందని ఎన్‌డిఎస్‌ఎ తేల్చి చెప్పినదని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు.



సోమవారం సిఎల్‌పి మీడియా సెంటర్‌లో ఆయన మాట్లాడుతూ హరీశ్‌రావు సూచనలు కాదు ఎన్‌డిఎస్‌ఎ సూచ నలను తమ ప్రభుత్వం పాటిస్తోంది. కొత్త బిచ్చ గాడు పొద్దెరగడన్నట్లు హరీశ్ రావు మాట్లా డుతున్నాడని దుయ్య బట్టారు. కన్నెపల్లి, కల్వకుర్తి పంప్‌హౌస్‌లు మీరు ఓపెన్ చేస్తారా? మేము ఓపెన్ చేయాలా అని హరీశ్‌రావు మాట్లాడు తున్నడనీ మీరు కన్నెపల్లి, కల్వకుర్తి దగ్గరకు వస్తే మీ కాళ్లు విరగ్గొడతారు జాగ్రత్త అని హరీశ్‌రావుకు మధుసూదన్‌రెడ్డి హెచ్చ రించారు. బిఆర్ఎస్ నాయకులు ఎక్కడైనా ప్రాజెక్టుల దగ్గరకు వస్తే తాట తీస్తామని ఆయన అన్నారు. ముచ్చుమర్రి నుంచి ఆంధ్రప్రదేశ్ కృష్ణా నీళ్లు తోడుకుపోతుంటే బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు పట్టించుకోలేదని ఆవేదన చెందారు. కేసీఆర్ సర్కార్ చేసిన తప్పిదాల వల్లనే ఆంధ్రప్రదేశ్ కృష్ణా జలాలను అప్పనంగా తీసుకెళ్తోంది.. కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్ చేసిన దోపిడీ వల్ల తెలంగాణ 100 యేళ్లు వెనక్కి పోయింది. కెసిఆర్‌ను తెలంగాణ బాపు అంటున్నారు ఫోన్ ట్యాపింగ్ చేసి భార్యాభర్తల జీవితాలు నాశనం చేసిన వ్యక్తి తెలంగాణ బాపు అయితడా అని ఆయన ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు లక్షన్నర కోట్ల అవినీతిలో ప్రధాన కారకుడు కెసిఆర్ కేటిఆర్ వలే పశువులు కూడా ప్రవర్తించవని ఆయన అన్నారు. వాళ్లు చేసిన అవినీతిపై విచారణ జరుగుతుంటే బనకచర్ల అంశాన్ని ముందుకు పెట్టి పక్క దారి పట్టిస్తున్నారు. సిఎం రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పోరాటం చేస్తే బనకచర్లను తాత్కాలికంగా కేంద్రం ఆపిందని వివిరించారు. బనకచర్లకు బిఆర్ఎస్ పార్టీనే మూల కారణమని ఆరోపించారు. రైతులను ఏవిధంగా ఆదుకోవాలో, వాళ్లకు ఎరువులు ఎప్పుడు ఇవ్వాలో రైతు కుటుంబాల నుంచి వచ్చిన తమకు తెలుసు అని ఆయన చెప్పారు.

# డ్వాక్రా గ్రూపు సభ్యులకు శుభవార్త

## మహిళా స్వయం సహాయక బృందాల

## ప్రమాద బీమా పథకం 2029 వరకు పొడిగింపు

### ఉత్తర్వులు జారీ చేసిన పంచాయతీరాజ్‌శాఖ

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త :** తెలంగాణలోని మహిళా స్వయం సహాయక బృందాలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. వారి ప్రమాద బీమా పథకాన్ని 2029 వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రమాదవశాత్తు సభ్యులు మరణిస్తే వారి కుటుంబానికి రూ. 10 లక్షల బీమా పరిహారం అందుతుంది. ఈ పథకం ద్వారా ఇప్పటికే 409 కుటుంబాలకు లబ్ధి చేకూరింది. ఈ వెసులుబాటుతో 1.67 లక్షల మంది కొత్త సభ్యులు బృందాల్లో చేరారు. ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోందని ఈ నిర్ణయం ద్వారా తెలుస్తోంది. రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక బృందాల(ఎస్‌హెచ్‌జి) సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక శుభవార్త అందించింది. వారికి అందించే ప్రమాద బీమా పథకాన్ని 2029 సంవత్సరం వరకు పొడిగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బీమా పథకం స్త్రీ నిధి ద్వారా అమలు జరుగు తుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే మహిళా స్వయం సహాయక బృందాలకు ఈ ప్రమాద బీమాను అందు బాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఈ ప్రమాద బీమా పథకం ప్రకారం.. ఏదైనా ప్రమాదవశాత్తు (ఎస్‌హెచ్‌జి) సభ్యులు మరణిస్తే, వారి కుటుంబానికి రూ. 10 లక్షల బీమా పరిహారం లభిస్తుంది. ఈ పథకం ద్వారా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 409 మంది కుటుంబాలకు బీమా సౌకర్యం కల్పించారు. ప్రభుత్వం అందించిన ఈ వెసులుబాటు, ఆర్థిక భద్రత కారణంగా మహిళలు స్వయం సహాయక బృందాల్లో చేరడానికి స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. ఇప్పటివరకు 1.67 లక్షల మంది కొత్త సభ్యులు ఈ బృందాల్లో చేరారు. సభ్యుల భద్రతను దృష్టిలో ఉంచుకొని, తెలంగాణ ప్రభుత్వం తాజాగా ప్రమాద బీమా పథకాన్ని మరో నాలుగేళ్ల పాటు పొడిగిస్తూ కొత్త జీవోను విడుదల చేసింది. మహిళా స్వయం సహాయక బృందాలు గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక స్వావలంబనకు, సామాజిక సాధికారతకు కీలకమైన వేదికలు. ఈ బృందాల ద్వారా మహిళలు చిన్న తరహా వ్యాపారాలు ప్రారంభించడంతో పాటుచిన్న తరహా పొదుపును ప్రోత్సహిస్తున్నారు. తద్వారా తమ కుటుంబాలకు ఆర్థికంగా చేయూతనిస్తున్నారు. అయితే.. అనేక సందర్భాల్లో దురదృష్టవశాత్తు జరిగే ప్రమాదాలు వారి జీవితాలను, వారి కుటుంబాల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తున్నాయి. ఇలాంటి పరిస్థి తుల్లో కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశం తోనే తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. పథకం మహిళా సాధికారతకు, గ్రామీణా భివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందనడంలో సందేహం లేదు. ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు ఇది ఒక పెద్ద ఊరట అని చెప్పవచ్చు. దీని ద్వారా వారికి ఎలాంటి దురదృ ష్టకర సంఘటన జరిగినా.. వారి కుటుంబం ఆర్థిక కష్టాల్లో చిక్కుకోకుండా కొంతమేర రక్షణ లభిస్తుంది.

# కొత్త పరిశోధన మైలురాళ్లను నిర్దేశిస్తున్న యువత

## గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**ఎడ్యుకేషన్ కేయూ, జూలై 7, ప్రభాతవార్త :** 'నేటి దేశయువత పరిశోధన, అభివృద్ధి (ఆర్‌అండ్‌డి)కి సిద్ధంగా కొత్త పరిశోధన మైలురాళ్లను నిర్దేశిస్తున్నారు' అని గవర్నర్, కాకతీయ విశ్వవిద్యాలయ ఛాన్సలర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. సోమవారం విశ్వవిద్యాలయ 23వ స్నాతకోత్సవ సందర్భంగా వివిధ ఫ్యాకల్టీ పీహెచ్‌డీ అభ్యర్థులకు పట్టాలు, వివిధ సబ్జెక్టుల మొదటి ర్యాంక్ పొందిన వారికీ గోల్డ్ మెడల్స్‌ను ప్రదానం చేస్తూ విద్యార్థులు, పరిశోధకులు, ఉపాధ్యా యులు, ఆహ్వానితులు, ప్రముఖులను ఉద్దేశించి కాకతీయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో ప్రసంగించారు. ప్రయోగాశాలకే కాకుండా, జీవితంలో కూడా సేవ చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఉత్తర తెలంగాణలోనే ఒక మహత్తర విద్యాకేంద్రంగా అభివృద్ధి చెందిందన్నారు. న్యాక్ ఎ+ గ్రేడింగ్, 151 - 200 బ్యాండ్ ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్, దేశంలోనే మూడో గ్రీన్ మెట్రిక్, జాతీయ స్థాయిలో ఫార్మసీ కళాశాల 84వ ర్యాంకింగ్ ఇవన్ని విశేష విజయాలు అని, ఇవన్ని కేవలం వనరులవల్ల మాత్రమే సాధ్యం కాదు ఉపాధ్యాయులు, పరిశోధకులు, విద్యార్థుల విజన్, పట్టుదలవల్ల సాధ్యమైనవన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ అన్నట్టు విద్యఅంటే శరీరం, మనస్సు, ఆత్మ అన్నింటిలోనే అత్యుత్తమని వెలికి తీయడమే", జాతీయ విద్యా విధానం 2020 దిశగా ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాల మెరుగుదల దీనికి అనుగుణంగా కృత్రిమా మేధా, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటాసైన్సు, న్యూట్రిషన్ సైన్సు కోర్సులు కాకతీయ యూనివర్సిటీలో ప్రారంభిం చడం అభినందనియం అన్నారు. స్నాతకోత్సవం అంటే ఒక ముగింపుకాదని, ఒక కొత్త ప్రయాణ మని మాజీ రాష్ట్రపతి ఎ.పి.జే. అబ్దుల్ కలాం అన్న మాటలు గుర్తుచేశారు. భారత ప్రధాని సూచించిన క్రిటికల్ థింకింగ్, క్రియేటివిటీ, కొలాబరేషన్, క్యురియాసిటి, కమ్యూనికేషన్ లాంటి నైపుణ్యా లు 21వ శతాబ్దపు దిక్సూ చిలు అన్నారు. ప్రతీగొప్ప నాయకుడు ఒకప్పుడు విద్యార్థి అన్నా రు. ధైర్యంగా ముందుకు సాగాలని, మార్పును ఆమోదించాలని, దయ, నైపుణ్యంతో సేవ చేయాలన్నారు.



సోమవారం కాకతీయ విశ్వవిద్యాలయ 23వ స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**ప్రతి విద్యార్థి జీవితం ఆనందభరితమైన క్షణం: డాక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి**

ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ సంచాలకులు, శాంతి స్వరూప్ భట్నగర్ అవార్డుగ్రహీత డాక్టర్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ స్నాతకోత్సవం అ నేది ప్రతి విద్యార్థి జీవితం ఆనందభరి తమైన క్షణం అన్నారు. మీ విజయానికి కారణ మైన తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు, మిత్రులకు కృతజ్ఞత గా ఉండాలన్నారు. గ్రామీణప్రాంతం, తెలుగు మాధ్యమం అడ్డంకి కాదన్నారు. మన లక్ష్యం ము ఖ్యమని, కేవలం జ్ఞానముంటే సరిపో దని, దాన్నెలా ఉపయోగించుకోవాలో తెలియాలన్నారు.

## ఇద్దరు నైజీరియన్లు, టాంజనీయా, సూడానీయనీలు అరెస్ట్

# నగరంలో విదేశీయులు అక్రమ తిష్ట

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త:** నగరంలో విదేశీయులు అక్రమంగా తిష్టవేసిన నల్గురుని సోమవారం హైదరాబాద్ పోలీసులు గుర్తించారు. వీసా గడువు అయిపోయినా ఉండడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘాపెట్టి అరెస్ట్ చేశారు. ఇద్దరు నైజీరియన్లు, టాంజనీయ, సుడానీయాన్ దేశస్తులను అదుపు లోకి తీసుకుని స్వదేశాలకు పంపిస్తున్నట్లు నార్త్‌జోన్ డీసీపీ సురేంద్ర పేర్కొన్నారు. ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారని, డ్రగ్స్ విక్రయాలపై నిఘాపెట్టడంతో వారు పట్టుబడ్డారు. అయితే కేసు నమోదు చేయకుండా వారిని స్వదేశాలకు పంపిస్తున్నట్లు వివరించారు. బంగ్లాదేశీకి చెందిన మహ్మద్ హాసీబుల్ నాలుగేళ్ల క్రితం ట్రాఫికర్లకు రూ.25వేలు ఇచ్చి పశ్చిమబెంగాలీ మీదుగా భారత్‌లోకి ప్రవేశించాడు. కోల్‌కత్తాలో కరాటే శిక్షకుడిగా పని చేశారు. సోషల్‌మీడియాలో జయచౌదరీ పరిచయం కావడంతో ప్రేమగా మారి వివాహం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం హైదరాబాద్‌లో జుమాటో, స్విగ్గీలో ఫుడ్ డెలివరీ ఏజంట్లుగా పని చేస్తున్నారు. స్థానిక ఏజంట్లు మహ్మద్ ముఖీద్, సాయికిరణ్ రజనీకాంత్ సహాయంతో నార్సింగ్ మున్సిపాలిటిలో ఔట్‌సోర్సింగ్ ఆపరేటర్ సుధీర్‌కుమార్ నకిలీ బర్త్‌డే సర్టిఫికేట్లు పొందారు. దీన్ని ఆధారంగా హాసిబుల్ ఓటరు, ఆధార్‌కార్డుకు దరఖాస్తు చేసుకోగా తన స్నేహితుడు రోహన్‌సాహా, అతని భార్యను ఏడాదిక్రితం మలక్‌పేటకు తీసుకవచ్చి నకిలీ ఆధార్‌కార్డు ఇప్పించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నకిలీ ఆధార్, ఓటరు కార్డులు, బర్త్ సర్టిఫికేట్లు, ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు.



అబ్దుల్లాపూర్‌మెట్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి తాళం వేస్తున్న భవన యజమాని పిట్టల రాజుముదిరాజ్

# సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి తాళం

## 40 నెలలుగా భవన అద్దె బాకీ

## పక్షం రోజుల్లో పూర్తి అద్దె చెల్లించేలా చర్యలు తీసుకుంటానని సబ్‌రిజిస్ట్రార్ హామీ

**హైదరాబాద్ (అబ్దుల్లాపూర్‌మెట్), జూలై 7, ప్రభాతవార్త :** ప్రైవేటు భవనంలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సంబంధించి 40 నెలల అద్దె చెల్లించడం లేదంటూ ఆ భవన యజమాని తాళాలు వేసిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, భవన యజమాని తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కేంద్రంలోని ఓ ప్రైవేటు భవనంలో గత 17 సంవత్సరాల నుంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాల యం కొనసాగుతోంది. అయితే గత 40 నెలలుగా ఈ కార్యాలయానికి సంబంధించిన అద్దెను చెల్లించకుండా భవన యజమాని అయిన పిట్టల రాజు ముదిరాజ్‌ను అధికారులు ఇబ్బందులకు గురిచేస్తుండడంతో విసుగు చెందిన ఆయన సోమవారం ఉదయం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి తాళాలు వేశారు. తనకు చెల్లించాల్సిన అద్దె డబ్బులు పూర్తిగా చెల్లించిన తర్వాతే కార్యాలయ తాళాలు తీస్తానని భీష్మించుకు కూర్చున్నాడు. బ్యాంకు రుణం తీసుకుని ఈ భవనాన్ని నిర్మించానని, ప్రతి నెల అద్దె సక్రమంగా వస్తే ఈఎంఐ చెల్లించేందుకు అవకాశం వస్తుందని భావించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి తన భవనాన్ని అద్దెకు ఇస్తే ప్రతి సారి అద్దె చెల్లించే విషయంలో అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని భవన యజమాని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యాలయ పనివేళల్లో సుమారు గంటన్నర పాటు కార్యాలయానికి తాళం వేయడంతో ఇటు అధికారులు, అటు ప్లాట్ల రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన ప్రజలకు కొంతమేర ఇబ్బందులు ఎదురైంది. దీంతో స్పందించిన స్థానిక సబ్‌రిజిస్ట్రార్ సునితా రాణి వచ్చే 15 రోజుల్లో పూర్తి అద్దె డబ్బులు వచ్చేలా ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీనివ్వడంతో భవన యజమాని కార్యాలయ తాళాలు తీశారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాగా సబ్ రిజి స్ట్రార్ కార్యాలయానికి తాళాలు వేశారన్న సమా చారం.

# మానవీయకోణంలో భూ సమస్యలకు పరిష్కారం చూపాలి

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త :** పేద ప్రజలు దశాబ్దాల కాలంగా సాగు చేసుకుంటున్న భూములపై వారికి హక్కులు కల్పించే విషయంలో మానవీయ కోణంలో ఆలోచన చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచిం చారు. సచివాలయంలో సోమవారంనాడు నల్గొండ జిల్లా నాగార్జున సాగర్ నియోజకవర్గంలో భూ సమస్యలపై మంత్రిగారు సమావేశం నిర్వహించారు. నాగార్జున సాగర్ నియోజకవర్గంలో40నుంచి 50 సంవత్సరాల నుంచిసాగుచేసుకుంటున్న భూములపై గిరిజనులకు హక్కులు కల్పించడానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, అయితే వివిధ నిబంధనలు చూపుతూ ఆ భూములు అటవీశాఖకు చెందినవని అటవీ అధికారులు కొర్రీ వేస్తున్నారని అన్నారు. ఈ అంశంపై రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాలు సమన్వయంతో పనిచేసి వీలైనంత త్వరగా పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చిన్నచిన్న సమస్యలను సాకుగా చూపించి సమస్యలను జఠిలం చేయవద్దని అటవీశాఖ అధికారులకు సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు చెన్నయ్య, బూర్గుల వెంకటేశ్వర్లు, బైండ్ల శ్రీనివాస్ తదితరులు

# వర్గీకరణతో విద్య, ఉద్యోగాల్లో మాలలకు తీవ్రనష్టం

## రోస్టర్ విధానాన్ని సవరించి న్యాయం చేయాలి

## మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య

**హైదరాబాద్, జూలై 7, ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణ ద్వారా మాలలకు జరిగిన అన్యాయంపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించేందుకు ఈ నెల 11న హైదరాబాద్ లక్డీకాపూల్‌లో జరిగే మాలమహానాడు రాష్ట్రస్థాయి ముఖ్య నాయకుల సమావేశాన్ని జయప్రదం చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి చెన్నయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం సోమాజి గూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు సూచనలు పాటించకుండా సరైన ఎంపరికల్ డేటా లేకుండా ప్రభుత్వం చేసిన వర్గీకరణ వల్ల మాలలు విద్య, ఉద్యోగ రంగాలలో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్లలో ఒక్క ఉద్యో గం కూడా గ్రూప్3కి కేటాయించబడలేదంటే మాలలపై ప్రభుత్వం ఏ స్థాయి లో కుట్ర చేసిందో అర్థమవుతుందని ఈ వర్గీకరణపై న్యాయపోరాటం చేస్తూనే ప్రజా పోరాటాలు చేస్తామన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాజ్యాం గం కల్పించిన 15శాతం విద్య, ఉద్యోగ అవకాశాలలో మాలలను ఐదు శాతానికి పరిమితం చేయడంతోపాటు 22, 41వ రోస్టర్ పాయింట్లు కేటాయించడం ద్వారా ఉద్దేశపూర్వకంగా మాలలను అణచివేసే కుట్ర చేసిం దని, మాలల హక్కుల కోసం రాజ్యాంగ రక్షణ కోసం భవిష్యత్ కార్యా చరణ ను రూపొందిస్తామని అన్నారు. సమావేశంలో గ్రేటర్ అధ్యక్షులు బైండ్ల శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగి ఆనందరావు, నల్లగొండ జిల్లా అధ్యక్షులు లకుమాల మధుబాబు, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.లలిత, మరిపల్లి శ్రీకాంత్, రాజేష్, రాకేష్, శివశంకర్, బాలకృష్ణ, శాలిం రాజు, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పోలిగ్రాస్ స్కిల్ అవార్డుకు
# దీపిక నామినేట్



**న్యూఢిల్లీ:** ఎఫ్ఐహెచ్ హాకీ ప్రో లీగ్2024-25 సీజన్‌లో ప్రపంచ నంబర్ 1 నెదర్లాండ్స్‌పై ఉత్కంఠభరితమైన సోలో గోల్ చేసినందుకు భారత ఫార్వర్డ్ దీపిక పోలిగ్రాస్ మ్యాజిక్ స్కిల్ అవార్డుకు నామి నేట్ అయింది. అంతర్జాతీయ హాకీ సమాఖ్య (సీఐబీ) తాజాగా నామినేషన్లను ప్రకటించింది, ఈ నెల 14వ తేదీ ఉదయం 3:29 వరకు ఓటింగ్ తెరిచి ఉంటుంది. విజేతను పూర్తిగా ప్రపంచ అభిమానుల ఓటింగ్ ద్వారా నిర్ణయిస్తారు, తద్వారా ఈ సీజన్‌లో అత్యంత నైపుణ్యం కలిగిన మరియు చిరస్మరణీయమైన క్షణం లేదా లక్ష్యాన్ని గుర్తిస్తారు. ఫిబ్రవరి 2025లో భువనేశ్వర్‌లో జరిగిన లీగ్ లెగ్‌లో దీపిక అద్భుతమైన ప్రదర్శన చేసి అకట్టుకుంది. కళింగ స్టేడియంలో డచ్ జట్టును 2-2తో డ్రాగా ముగించి, ఉత్కంఠభరితమైన షూటౌట్‌లో విజయం సాధించింది. 35వ నిమిషంలో, భారతదేశం రెండు గోల్స్ వెనుకబడి ఉండగా, 21 ఏళ్ల ఫార్వర్డ్ ఎడమ పార్శ్వం గుండా డ్రిబుల్ చేస్తూ, డచ్ డిఫెన్స్‌ను వెంబడించి, బేస్‌లైన్‌ను అనుసరించి డిఫెండర్ స్టిక్ మీదుగా బంతిని ఫ్లిక్ చేసి, గోల్ కీపర్‌ను దాటి స్మాష్ చేస్తూ అసాధారణ నైపుణ్యాన్ని ప్రదర్శించింది. అలాగే మహిళల విభాగంలో దీపికతో పాటు మరో ఇద్దరు అసాధారణ నామినీలు ఉన్నారు. ఆస్ట్రేలియాపై జరిగిన మ్యాచ్‌లో స్పెయిన్‌కు చెందిన ప్యాట్రిసియా అల్వారెజ్ అద్భుతమైన 3డి నైపుణ్యాలను ప్రదర్శించి తన స్థానాన్ని సంపాదించుకుంది. అల్వారెజ్ అద్భుతమైన బంతి నియంత్రణను ప్రదర్శించింది, పరుగెడుతున్న గోల్ కీపర్‌పై బంతిని గారడీ చేసి, దానిని ప్రశాంతంగా నెట్‌లోకి లాగింది. మరో నామినీ ఆస్ట్రేలియా మహిళా జట్టు, ఇంగ్లాండ్‌పై సొగసైన జట్టు గోల్‌కు గుర్తింపు పొందింది. హాకీరూస్ ప్రత్యర్థి హాఫ్‌లో ఐదు స్పష్టమైన పాస్‌లతో సరళమైన పాసింగ్ సీక్వెన్స్‌ను అమలు చేసి అద్భుతమైన ముగింపులో ముగిసింది.

## కామన్వెల్త్ బిలియర్డ్స్ ఛాంపియన్‌షిప్‌లో..
# విద్యా పిళ్లైకి స్వర్ణం

**న్యూఢిల్లీ:** ప్రారంభ కామన్వెల్త్ బిలియర్డ్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత క్యూయిస్ట్ విద్యా పిళ్లై హేబాల్‌లో బంగారు పతకాన్ని గెలుచుకుంది. మారిషస్‌లోని బాలాక్లావాలో సోమవారం జరిగిన తొలి 6-రెడ్ స్నూకర్‌లో మాజీ ప్రపంచ ఛాంపియన్ అయిన పిళ్లై, దక్షిణాఫ్రికాకు చెందిన మెరీనా జాకబ్స్‌ను 5-5తో ఓడించి తన పోటీతత్వాన్ని ప్రదర్శించింది, నిర్ణయాత్మక షూటౌట్‌లో భారత స్టార్ 3-1తో విజయం సాధించింది. హెబాల్, చైనీస్ 8బాల్ అని కూడా పిలుస్తారు, ఇది పూల్ మరియు స్నూకర్ యొక్క అంశాలను మిళితం చేసే ఒక ఆధునిక క్యూ క్రీడ, ఇది చైనీస్‌శైలి టేబుల్‌పై గట్టి పాకెట్స్ మరియు ఖచ్చితత్వం, వ్యూహం మరియు షాట్ మేకింగ్‌ను నొక్కి చెప్పే విభిన్న నియమాలతో ఆడబడుతుంది. ఈ క్రీడలో 47 ఏళ్ల విద్యా అద్భుతమైన ఫామ్‌తో మ్యాచ్‌ను ప్రారంభించి 5-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మిడిల్ ఫ్రేమ్‌లలో జరిగిన రెండు వ్యూహాత్మక తప్పిదాలు దక్షిణాఫ్రికా క్యూయిస్ట్ జాకబ్స్‌పూర్తి ప్రయోజనాన్ని చేకూర్చాయి. జాకబ్స్‌కు అనుకూలంగా ఆట వేగం మారుతున్నప్పటికీ, విద్యా సంయమనంతో ఉండి, తన లోతైన వ్యూహాత్మక జ్ఞానం మరియు అపారమైన మ్యాచ్ అనుభవాన్ని ప్రదర్శించడంతో ఈ షూటౌట్‌లో బలంగా పుంజుకుంది, ఫలితంగా విద్యా 3-1 తేడాతో విజయం సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది.

## వింబుల్డన్ మిక్స్‌డ్ డబుల్స్‌లో..
# యుకీ భాంబ్రీ ఓటమి

**న్యూఢిల్లీ:** ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో 2025 వింబుల్డన్ మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్ నుంచి భారత్ డబుల్ స్పెషలిస్ట్ యుకీ భాంబ్రీ మరియు భాగస్వామి జియాంగ్ జిన్యు నిష్క్రమించారు. రౌండ్ ఆఫ్ 16 పోరులో రెండో సీడ్ మార్సెలో అరెవాలో మరియు షుయ్ జాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో, ఇండోచైనీస్ జంట 6-7(6), 3-6తో వరుస సెట్లలో ఓడిపోయింది. భాంబ్రీ మరియు జియాంగ్ పోటీకి అత్యుత్తమ ఆరంభాలను ఇవ్వలేదు. వారు కేవలం మూడవ గేమ్‌లోనే నిష్క్రమించి ప్రత్యర్థులకు 1-3 ఆధిక్యాన్ని ఇచ్చారు. అయితే ఏడో గేమ్‌లో తిరిగి విజయం సాధించి మొదటి సెట్‌లో లోటును 3-4కి తగ్గించారు. దాని నుండి ఇద్దరూ తమ సర్వీస్‌లను నిలబెట్టుకున్నారు. భాంబ్రీ మరియు జియాంగ్ మొదటి పాయింట్ గెలుచుకోవడం ద్వారా టైబ్రేక్‌ను బాగా ప్రారంభించారు. అయితే, అరెవాలో మరియు షుయ్ త్వరలోనే 3-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లి వారిని నిరాశపరిచారు. ఇండోచైనీస్ జంట 6-6తో సమం చేయడానికి తిరిగి పోరాడింది. కానీ బ్యాక్‌హ్యాండ్ తప్పిదం కారణంగా కీలకమైన సెట్ పాయింట్‌ను వదులుకుంది. రెండో సెట్‌లో భాంబ్రీ మరియు జియాంగ్ తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకున్నారు, కానీ ఐదవ గేమ్‌లో వారు విఫలం అయ్యారు. ఈ ఇరువిరి జోడీ అరెవాలో-షుయ్‌లను ఇబ్బంది పెట్టడంలో విఫలమయ్యారు, దీంతో వారు తమ సర్వీస్‌లను నిలబెట్టుకున్నారు. తొమ్మిదవ గేమ్‌లో మరోసారి బ్రేక్ చేశారు. గంటా 24 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో అందరూ క్వార్టర్ ఫైనల్స్‌లో తమ స్థానాన్ని బుక్ చేసుకున్నారు.




# టెస్టులో సిక్సర్ల కింగ్స్
## బ్యాటర్ల ధనా ధన్ బాదుడు.. టాప్ 5లో చోటు దక్కని భారత్




**న్యూఢిల్లీ:** టీ20లు వచ్చిన తర్వాత టెస్ట్ క్రికెట్ కాస్త వెనుకబడింది. కానీ ఆటగాళ్లు కూడా కాలనుగుణంగా ఆటతీరు మార్చుకున్నారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ టెస్ట్ క్రికెట ఆటను వన్డే, టీ20లతో పోలిస్తే తక్కువ మంది చూస్తుంటారు. కానీ ఇప్పుడు కాలం మారింది. టీ20ల ప్రభావం టెస్టుల మీద పడింది. ఇప్పుడు బ్యాటర్లు టెస్టుల్లో కూడా సిక్సర్లతో దుమ్ములేపుతున్నారు. వేగంగా పరుగులు చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటున్నారు.

ఈ నేపథ్యంలో క్రికెట్ చరిత్రలో అత్యధిక సిక్సర్లు బాదిన పలువురు బ్యాటర్లు ఉన్నారు. సిక్సర్ల టాప్ 5 హీరోల్లో బెన్ స్టోక్స్ 133 సిక్సర్లతో అగ్రస్థానంలో నిలవగా, మెకల్లమ్, గిల్‌క్రిస్ట్, సౌథీ, గేల్ వంటి దిగ్గజాలు కూడా ఈ జాబితాలో ఉన్నారు. ఇంగ్లాండ్ టెస్ట్ టీమ్ ప్రస్తుత కెప్టెన్ బెన్ స్టోక్స్ అగ్రెసివ్ క్రికెట్‌కు సరికొత్త ఉదాహరణ. అతను ఇప్పటివరకు 112 టెస్టుల్లో 201 ఇన్నింగ్స్‌లలో 6781 పరుగులు చేశాడు. ఇందులో ఏకంగా 133 సిక్సర్లు ఉన్నాయి. ఈ సంఖ్యతో స్టోక్స్ టెస్ట్ చరిత్రలో అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పాడు. అతని బ్యాటింగ్ సగటు 35.31 కాగా, 786 ఫోర్లు కొట్టాడు. స్టోక్స్ బ్యాటింగ్ స్టైల్ ఇంగ్లాండ్ బజ్‌బాల్ ఆటతీరులో ముఖ్యమైన భాగం. అలాగే న్యూజిలాండ్ మాజీ కెప్టెన్, ప్రస్తుతం ఇంగ్లాండ్ టెస్ట్ కోచ్‌గా ఉన్న బ్రెండన్ మెకల్లమ్, టెస్ట్ క్రికెట్‌లో దూకుడు ఆటకు పునాది వేశాడు. అతను 101 టెస్ట్ మ్యాచ్‌లలో 6453 పరుగులు చేశాడు. అందులో 107 సిక్సర్లు ఉన్నాయి. అతని బ్యాటింగ్ సగటు 38.64 కాగా, 776 ఫోర్లు బాదాడు. బజ్‌బాల్ స్టైల్‌కు ఆద్యుడి చెబుతారు. మెకల్లమ్ దూకుడు ఆటతీరు టెస్ట్ క్రికెట్ పాత ఆలోచనలను మార్చేసింది. మూడో స్థానంలో ఆస్ట్రేలియా మాజీ వికెట్ కీపర్ బ్యాటర్ ఆడమ్ గిల్‌క్రిస్ట్ ఉన్నారు. అతను బ్యాట్‌తో కూడా ప్రత్యర్థి జట్లకు చుక్కలు చూపించాడు. 96 టెస్ట్ మ్యాచ్‌లలో 137 ఇన్నింగ్స్‌లలో 5570 పరుగులు చేశాడు. అతని ఖాతాలో 100 సిక్సర్లు ఉన్నాయి. అతని సగటు 47.60 కాగా, 677 ఫోర్లు కొట్టాడు. ఇక న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ టిమ్ సౌథీ, బ్యాటింగ్‌లోనూ చాలా ప్రమాదకరం. అతను 107 టెస్టులలో 2245 పరుగులు చేసి, 98 సిక్సర్లు బాదాడు. అతని బ్యాటింగ్ సగటు 15.48 మాత్రమే అయినా, లోయర్ ఆర్డర్‌లో వేగంగా పరుగులు చేయడంలో అతన్ని మించిన వాళ్ళు లేరు. కాగా యూనివర్స్ బాస్ క్రిస్ గేల్ కేవలం టీ20 క్రికెట్‌లో మాత్రమే కాదు టెస్టుల్లోనూ సిక్సర్ల కింగ్. అతను 103 టెస్టుల్లో 182 ఇన్నింగ్స్‌లలో 7214 పరుగులు చేశాడు. అందులో 98 సిక్సర్లు ఉన్నాయి. అతని సగటు 42.18 కాగా, 1046 ఫోర్లు కొట్టాడు. గేల్ స్టైల్ టెస్ట్ క్రికెట్‌లో కూడా టీ20 లాగే ప్రమాదకరంగా ఉండేది.

# నార్వే చెస్ టోర్నీ విజేతగా కార్ల్‌సెన్
## గుకేష్ సంచలన ఓటమి

**న్యూఢిల్లీ:** నార్వే గ్రాండ్ చెస్ టూర్ టోర్నమెంట్‌లో సూపర్ యునైటెడ్ టైటిల్‌ను మాగ్నస్ కార్ల్‌సెన్ కైవసం చేసుకున్నాడు. ప్రస్తుత ప్రంచ ఛాంపియన్, భారత్ గ్రాండ్ మాస్టర్ గుకేష్ సంచలన ఓటమితో మూడో స్థానానికి పరిమితమయ్యాడు. ప్రపంచ నంబర్ 1 మాగ్నస్ కార్ల్సెన్ వేగవంతమైన చెస్ ఫార్మాట్లలో తన ఆధిపత్యాన్ని పునరుద్ఘాటించాడు. సూపర్ యునైటెడ్ రాపిడ్ బ్లిట్జ్ క్రొయేషియా 2025 ను ఒక రౌండ్ మిగిలి ఉండగానే గెలుచుకున్నాడు.

నార్వేజియన్ 22.5 పాయింట్లతో ముగించాడు, వెస్లీ సో (20 పాయింట్లు), ముందు టైటిల్‌ను ఖాయం చేసుకున్న భారత్ గ్రాండ్ మాస్టర్ గుకేష్ 19.5 పాయింట్లతో మూడవ స్థానంలో నిలిచాడు. ప్రతిష్టాత్మకమైన గ్రాండ్ చెస్ టూర్‌లో భాగంగా జరిగిన ఈ ఈవెంట్‌లో ఎలైట్ ఆటగాళ్ల బలమైన ఫీల్డ్ ఉంది. బ్లిట్జ్ విభాగంలో కార్ల్‌సెన్ ప్రదర్శన ఒప్పందాన్ని ఖరారు చేసినప్పటికీ, వేగవంతమైన రౌండ్లలో గుకేష్ అద్భుతమైన ప్రదర్శన మొదట్లో దృష్టిని ఆకర్షించింది. భారత్‌కు చెందిన గుకేష్ టోర్నమెంట్‌ను అద్వితీయంగా ప్రారంభించాడు. తొమ్మిది రౌండ్ల రాపిడ్ విభాగంలో, అతను అద్భుతమైన 14 పాయింట్లు సాధించి, ప్రారంభంలోనే ఆధిక్యంలోకి వెళ్లి మిగిలిన ఫీల్డ్‌పై ఒత్తిడి పెంచాడు.

అయితే, బ్లిట్జ్ విభాగం సవాలుతో కూడుకున్నది కావడంతో పాటు, హై స్పీడ్ ఫార్మాట్‌లో లయను కనుగొనడంలో ఇబ్బంది పడుతున్న గుకేష్ మొదటి తొమ్మిది బ్లిట్జ్ గేమ్‌లలో కేవలం 1.5 పాయింట్లు మాత్రమే సాధించగలిగాడు.

బ్లిట్జ్ యొక్క రిటర్న్ లెగ్‌లో కోలుకున్నప్పటికీ, కార్ల్‌సెన్ యొక్క స్థిరత్వాన్ని అందుకోలేకపోయాడు. అతను అలిరేజా ఫిరోజ్జా (ఫ్రాన్స్), జాన్‌క్రిజ్‌టోఫ్ డుడా (పోలాండ్) కంటే సగం పాయింట్ ముందంజలో ఉండి ఇద్దరూ 19 పరుగులు చేశారు. రాపిడ్ సెగ్మెంట్ తర్వాత గుకేష్ కంటే నాలుగు పాయింట్లు వెనుకబడిన కార్ల్‌సెన్ శక్తివంతమైన పునరాగమనం చేశాడు. బ్లిట్జ్ మొదటి అర్ధభాగంలో అతను 7.5/9 స్కోరు సాధించాడు. రెండవ అర్ధభాగంలో 4/8 జోడించి, చివరి రౌండ్‌కు ముందు టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు.

# యాంటీ అమెరికా అయితే 10% సుంకాలు
## బ్రిక్స్ దేశాలకు ట్రంప్ హెచ్చరిక





**వాషింగ్టన్, జులై 7:** బ్రిక్స్ కూటమిలోని దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గట్టి హెచ్చరిక జారీ చేశారు. అమెరికా వ్యతిరేక విధానాలను అనుసరించే ఏ దేశంపైనైనా సరే 10 శాతం అదనపు టారిఫ్‌లు విధిస్తామని, ఈ విషయంలో ఎలాంటి మినహాయింపులు ఉండవని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం బ్రెజిల్‌లో బ్రిక్స్ దేశాధినేతల శిఖరాగ్ర సదస్సు జరుగుతున్న సమయంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధా న్యం సంతరించుకుంది. ఈ సదస్సులో భారత ప్రధాన మంత్రితో పాటు ఇతర సభ్య దేశాల నేతలు అమెరికా సుంకాల విధానాన్ని పరోక్షంగా ప్రస్తావించిన నేపథ్యంలో ట్రంప్ స్పందన వచ్చింది. ట్రంప్ చేసిన తాజా హెచ్చరికలపై చైనా స్పందించింది. సుంకాల యుద్ధంలో ఎవరూ విజేతలు గా నిలవరని, తాము ఘర్షణను కోరు కోవడం లేదని పునరుద్ఘాటించింది. రక్షణాత్మక వాణిజ్య వైఖరి సరైంది కాద ని చైనా పేర్కొంది. గతంలో అమెరికాచైనాల మధ్య తీవ్రమైన వాణిజ్యయుద్ధం నడిచినప్పటికీ, ఆ తర్వాత కుదిరిన ఒప్పందంతో అది తాత్కాలికంగా సద్దు మణిగింది. కాగా, బ్రిక్స్ కూటమిపై ట్రంప్ ఇటీవల కూడా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బ్రిక్స్ దేశాలు డాలర్‌తో ఆడుకోవాలని చూస్తే, వాణిజ్యపరంగా వారిని దెబ్బతీస్తానని బెదిరించారు. నా హెచ్చరికలతోనే బ్రిక్స్ ప్రతిపాదన బలహీనపడింది. ఒకవేళ వారు మాకు వ్యతిరేకంగా ముందుకెళితే 100 శాతం సుంకాలు వేస్తాను. అప్పుడు నా దగ్గరకే వచ్చి వేడుకుంటారు అని ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించారు. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షి ణాఫ్రికాలతో ప్రారంభమైన బ్రిక్స్ కూటమిలో ఇటీవల ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈలు కూడా సభ్య దేశాలుగా చేరాయి.

# కల్యాణ్ జ్యుయెలర్స్ నికరరాబడుల్లో 31% వృద్ధి



**ముంబై, జూలై 7:** ఆభరణాల విక్రేత కల్యాణ్ జ్యుయెలర్స్ నిరకర రాబడులు 31 శాతం పెరిగాయి. బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు, మరోవైపు భౌగోళిక ఉద్రిక్తతలున్నప్పటికీ కంపెనీ సమిష్టి నికరరాబడులు 5557.63 కోట్లుగా ప్రకటిం చింది. ఈ ఆర్థికసంవత్సరం ఏప్రిల్-జూన్‌త్రైమాసికం లో భారీ లాభాలు ఆర్జించినట్లు నిపుణులు చెపుతు న్నారు. భారత్‌లో సంస్థ కార్యకలాపాలు 31శాతం పెరిగాయి. రాబడుల వృద్ధికూడా పెరిగిందని స్టాక్ ఎక్ఛేంజీలకు నివేదిక ఇచ్చింది. ఇక అంతర్జాతీయ లావాదేవీల ద్వారా కూడా రాబడులు 31శాతం పెరిగాయి. మొత్తం రాబడుల్లో 15శాతం గ్లోబల్ రెవెన్యూయే ఉన్నట్లు సంస్థ ప్రకటించింది. మధ్య ప్రాచ్య దేశాల నుంచి 26శాతం రాబడులు రాగా డిజి టల్ ప్లాట్‌ఫామ్ పరంగా చూస్తే 67శాతం రాబడులు పెరిగినట్లు కంపెనీ ప్రకటించింది. ఈ త్రైమాసికంలో కంపెనీ 10 షోరూమ్‌లు ప్రారంభించింది. ఎనిమిది కేండీర్‌షోరూమ్‌లు ఉన్నాయి. అమెరికాలో కూడా కల్యాణ్ షోరూమ్‌ను ప్రారంభిం చింది. కంపె నీ భవిష్య త్తులో 170కి పైగా కొత్త షోరూమ్‌లు ప్రారంభిం చాలని నిర్ణయిం చింది. కల్యాణ్‌బ్రాండ్‌మీద కేండీర్ ఫార్మాట్స్‌లో కూడా భారత్, విదేశాల్లోను విస్తరించాలని నిర్ణయించింది. జూన్ 30వ తేదీ నాటికి కంపెనీ వివిధ బ్రాండ్లను ప్రవేశ పెట్టి 406 షోరూమ్‌లు ప్రారంభించింది.

# ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు




**ముంబై, జులై 7:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గాముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలతో మన మార్కెట్లు కూడా ఓ మోస్తరు శ్రేణిలో కదలాడాయి. రిలయన్స్, ఎఫ్ఎంసీజీ షేర్లు రాణించగా.. మీడియా, డిఫెన్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ ఉదయం 83,398.08 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,432.89) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 83,262.23 83,516.82 పాయింట్ల మధ్య కదలాడింది. చివరికి 9 పాయింట్ల లాభంతో 83,442.50 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 25,461 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.88గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో హిందుస్థాన్ యూనిలీవర్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ట్రెంట్, రిలయన్స్, ఐటీసీ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. బీఈఎల్, టెక్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, మారుతీ సుజుకీ, ఎటర్నల్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 68.72 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3,318 డాలర్ల వద్ద కొనసాగుతోంది.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14